www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 222 | శుక్రవారం 02-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

అంకెల గారడీ

జనానికి బురిడీ


పెద్దనోట్ల రద్దు, జీఎస్టీలతో తీవ్రంగా దెబ్బతిన్న ఆర్థిక రంగాన్ని సరిదిద్దే ప్రయత్నం ఏ మాత్రం చేయకుండా అరుణ్‌జైట్లీ 2018-19 బడ్జెట్‌ను అంకెల గారడీగా, కార్పొరేట్ల కొమ్ముకాసేలా తీర్చిదిద్దారు. గురువారం ఆయన లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య, మధ్య తరగతి ప్రజలను, సగటు వేతన జీవులను తీవ్ర నిరాశకు గురిచేసింది. వ్యవసాయం, మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించారు. అయితే వాస్తవానికి ఆ రంగాలకు ఏ మాత్రం తగిన రీతిలో కేటాయింపులు చేయకపోగా, వాటిని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చేందుకు బడ్జెట్ విన్యాసాలు ప్రదర్శించారు. ప్రత్యక్షంగా పన్ను పోటు కనిపించకుండా జనంపై బాదుడుకు అవకాశం ఉండే ప్రతిపాదనలను చాప కింద నీరులా ప్రవేశపెట్టారు. విభజన చట్టంలోని కనీస హామీల ఊసెత్తకుండా తెలుగు రాష్ట్రాలకు అన్యాయం చేశారు.

- తాయిలాలతో ఓటర్లకు ఎర
- అసాధ్య పథకాలతో వల
- బీమా కంపెనీలకు భరోసా
- కార్పొరేట్ ఆసుపత్రులకు ఊరట
- ఇదీ జైట్లీ బడ్జెట్ బండారం

బడ్జెట్ అంచనా రూ.21.57 లక్షల కోట్లు

విశాలాంధ్ర ప్రతినిధి - న్యూఢిల్లీ : వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో... మోడీ సర్కారు ఓట్ల వేటకు రంగం సిద్ధం చేసుకుంది. ఎన్డీయే సర్కారు తుది బడ్జెట్‌లో పలుతాయిలాతో రైతులు, మహిళలకు ఎర వేశారు. వ్యవసాయం, గ్రామీణం, సంక్షేమం రంగాలపై దృష్టి పెట్టారు. కనీస మద్దతు ధర పెంపు, పరపతికి మరిన్ని నిధులు, గ్రామీణ భారతం అభివృద్ధి.. ప్రపంచంలోనే అతిపెద్ద హెల్త్‌స్కీం...ఉచిత గ్యాస్ పంపిణీ ఇలా... ఊరింతలతో అరుణ్ జైట్లీ సామాన్యులను ఉక్కిరి బిక్కిరి చేశారు. పైకి సంక్షేమం బురఖా కనిపిస్తున్నా... అందులో బీమా కంపెనీలకు దీమా, భరోసా కల్పించే రీతిలోనే బడ్జెట్‌కు రూపకల్పన జరిగిందంటే కేవలం ఆరోపణ కాదు. 3.5 శాతం ద్రవ్యలోటుతో రూ.21.57 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో ఎక్కడా పేదలకు ఉపయోగపడే అంశమే కనిపించలేదంటే అతిశయోక్తి కాదు. 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్యబీమా పథకాన్ని ప్రకటించారు. ఈ పథకంలో 50 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని ఊరించారు. ఐతే, ప్రీమియం కింద ఒక్కొక్క కుటుంబం

- మిగతా 2 లో





vyavasayam



వ్యవసాయం
రూ.2,39,882 కోట్లు



రైల్వే
రూ.1.48 లక్షల కోట్లు



విద్య, ఆరోగ్య సంక్షేమానికి
రూ.1.38 లక్షల కోట్లు



గ్రామీణ పారిశుధ్య పథకానికి
రూ. 16,713 కోట్లు

ఏపీ కేటాయింపులు

- గిరిజన యూనివర్సిటీకి రూ. 10 కోట్లు
- కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రూ. 10 కోట్లు
- ఎన్ఐటీకి రూ. 54 కోట్లు
- ఐఐటీకి రూ. 50 కోట్లు
- ట్రిపుల్ ఐటీకి రూ. 30 కోట్లు
- ఐఐఎంకు రూ. 42 కోట్లు
- ఐఐఎస్‌సీఆర్‌కు రూ. 49 కోట్లు
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ దేశీయ పెట్రోలియం అండ్ ఎనర్జీకి రూ. 32 కోట్లు
- విశాఖ పోర్టుకు రూ. 108 కోట్లు
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు రూ. 19.62 కోట్లు

బడ్జెట్ కథనాలు లోపలి పేజీల్లో

ఇవి భారం





కార్లు, మోటారు సైకిళ్లు,
మొబైల్ ఫోన్లు, వంట నూనెలు
వెండి - బంగారం,
ఫుట్‌వేర్, సన్‌గ్లాసులు
సిగరెట్లు సంబంధిత లైటర్లు, కాండిల్స్
కూరగాయలు, ఆరెంజ్, కాన్‌బెర్రీ వంటి పండ్ల రసాలు

ధరలు తగ్గేవి...

ముడి జీడిపప్పు
సోలార్ స్వభావిత గ్లాసు, సోలార్‌ప్యానెల్స్, మాడ్యూల్స్ తయారీకి వినియోగించే గ్లాసు
ముడిపదార్థాలు, కాక్లియర్ ఇంప్లాంట్స్‌కు సంబంధించిన పార్టులు
గుర్తించిన ఎలక్ట్రానిక్స్ వంటి బాల్ స్క్రూలు,కాపిటల్ గూడ్స్

వేతన జీవులకు నిరాశే..!

- ఆదాయపు పన్ను మినహాయింపులో లేని మార్పు
- వైద్య, రవాణా ఖర్చులపైనే రూ.40 వేల పన్ను రాయితీ

- వివరాలు 2 లో



బడ్జెట్ భేష్...

ఇది రైతుహిత బడ్జెట్. అందరికీ అనుకూలంగా ఉంది. అన్నీ సమస్యలకు పరిష్కారం చూపించింది.

- ప్రధాని మోడీ



హామీల అమలులో విఫలం

హామీల అమలులో అధికార పార్టీపూర్తిగా విఫలమైంది. బడ్జెట్ అన్నీ వర్గాల వారినీ నిరాశపర్చింది. యువతకు ఉద్యోగాలు లేవు.

- రాహుల్ గాంధీ

కార్పొరేట్ల కోసమే...

బడ్జెట్‌లో ప్రజలకు మేలు చేసే అంశాలు లేనేలేవు. కార్పొరేట్లకు ప్రయోజనం కలిగించేలా ఉంది. ఉద్యోగ కల్పన హామీ నీటిమూటైంది.

- సీపీఐ



వాస్తవ విరుద్ధంగా బడ్జెట్

బడ్జెట్ పూర్తిగా వాస్తవ విరుద్ధంగా ఉంది. ఎన్నికల దృష్ట్యా రూపొందించిన బడ్జెట్ వల్ల ప్రజలకు ఒరిగేదేమిలేదు.

- సీతారాం ఏచూరి, సీపీఎం నేత

ఇదీ లోకం!



బీజేపీకి ఉప షాక్



- రాజస్థాన్‌లో రెండు ఎంపీ, ఒక అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ కైవసం
- పశ్చిమబెంగాల్లో టీఎంసీ ఆధిపత్యం

జైపూర్ : మరి కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు సర్వసన్నద్ధమవుతున్న రాజస్థాన్‌లో అధికార బీజేపీకి చావు దెబ్బ తగిలింది. రాష్ట్రంలో జరిగిన కీలక ఉప ఎన్నికల్లో కమలం వాడిపోయింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకొంది. ఒక అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో బీజేపీని మట్టికరిపించింది. మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానంలో విజయకేతనం ఎగరవేసింది. అజ్మీర్, అల్వార్ లోక్‌సభ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ భారీ ఆధిక్యం సాధించింది. ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయం కావడంతో బీజేపీ డీలా పడింది. జైపూర్‌లోని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయం సంబరాలతో కోలాహలంగా మారగా.. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం జనంలేక వెలవెలపోయింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానంలోనూ గెలవలేదు. ఒక రకంగా తుడిచిపెట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో రెండు లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకోవటంతో... కాంగ్రెస్ పార్టీకి ప్రాణప్రతిష్ట జరిగినట్టే. బీజేపీకి చావు మేళం మోగినట్టే. అధికార బీజేపీకి చెందిన ఈ మూడు స్థానాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు సన్వర్ లాల్ జాట్ (అజ్మీర్), మహంత్ చంద్ నాథ్ యోగి (అల్వార్), సిట్టింగ్ ఎమ్మెల్యే కీర్తి కుమారీ (మండల్‌గఢ్) చనిపోవడంతో ఉప ఎన్నికలు జరిగాయి. ఐతే, మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థి శక్తిసింగ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ధకడ్ 11,136 ఓట్ల మెజారిటీతో విజయం

- మిగతా 2 లో

సీఎం బాబు తీవ్ర అసంతృప్తి

- ఆదివారం ఎంపీలతో అత్యవసర భేటీ



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కనీస ప్రాధాన్యత ఇవ్వకపోవడం పట్ల సీఎం చంద్రబాబు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. జైట్లీ పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టేబోయే ముందు వరకు ఉల్లాసంగా గడిపిన చంద్రబాబు బడ్జెట్ వివరాలు తెల్సిన అనంతరం ఒక్కసారిగా నిర్వేదానికి గురైయ్యారు. వెంటనే కేంద్రమంత్రులు సుజనా చౌదరి, అశోక్ గజపతిరాజుతోపాటు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, సీనియర్ నేతలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈసందర్భంగా కేంద్ర బడ్జెట్‌పై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి అభిప్రాయాలను కూడా చంద్రబాబు అడిగి తెల్సుకున్నారు. చంద్రబాబు మాట్లాడిన తర్వాతే ఢిల్లీలో కేంద్రమంత్రి సుజనా చౌదరి ప్రెస్‌మీట్ పెట్టి మరీ బడ్జెట్ ఏపీకి నిరాశాజనకంగా వుందని చెప్పినట్లు తెల్సింది. దీనిపై పార్టీ అధ్యక్షునితో ఆదివారం అత్యవసర భేటీ వుందని, తర్వాతే తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని కూడా చెప్పడం గమనార్హం

టీడీపీ ఎంపీల రాజీనామా యోచన?

ఏపీకి మొండిచెయ్యిపై ఆగ్రహం

- చంద్రబాబుతో చర్చల తర్వాత నిర్ణయం : సుజనా
- విశాఖ రైల్వేజోన్ కోసం ఒత్తిడి తెస్తామని ప్రకటన
- బడ్జెట్‌ను సమర్థించుకున్న బీజేపీ ఎంపీ హరిబాబు

2 లో

సామాన్యులపై బండ

- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం
- అఖిలపక్షం ఏర్పాటు చేయండి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న రామకృష్ణ, జల్లి విల్సన్, డి.జగదీష్ తదితరులు

విశాలాంధ్ర ప్రతినిధి-అనంతపురము : మోడీ సర్కారు సామాన్య ప్రజలపై బడ్జెట్ అనే బండను వేసి మధ్య తరగతి, వేతన జీవుల నడ్డి విరిచిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి పూర్తి మొండిచేయి చూపిందని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో బుధవారం కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులపై ఆయన స్పందించారు. ఏపీ ప్రజలను బడ్జెట్ పూర్తిగా నిరాశ పరచిందన్నారు. ఏపీలోని ప్రాజెక్టుల నిధుల విషయంలో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం రాష్ట్రంపై కేంద్రానికున్న శ్రద్ధను తెలియజేస్తోందన్నారు. ఈసందర్భంగా రామకృష్ణ ఆధ్వర్యంలో సీపీఐ బృందం క్లాక్ టవర్ సమీపంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేసింది.

విజయవాడ, విశాఖలో సీపీఐ నిరసన ప్రదర్శనలు

- వివరాలు 2 లో

ఫ్రాన్స్‌లో రోడ్లు దిగ్బంధం చేసిన రైతులు



పారిస్ : ఫ్రాన్స్‌లోని అతి పెద్ద నాలుగు నగరాలలో ఒకటైన టౌలోస్‌లో రైతులు రింగ్‌రోడ్లను దిగ్బంధం చేశారు. యూరోపియన్ యూనియన్ తమకిచ్చే సబ్సిడీలను కోత విధిస్తున్నదని ఆందోళన చెందుతూ రైతులు రోడ్ల దిగ్బంధం ద్వారా నిరసన తెలియజేశారు. అయితే రైతుల ఉత్పత్తులకు సరైన ధరలు చెల్లిస్తామని పారిస్ ప్రభుత్వం ప్రతిపాదన పెట్టింది. వందకుపైగా ట్రాక్టర్లను అడ్డుపెట్టి రైతులు రోడ్లు దిగ్బంధం చేయడంతో ట్రాఫిక్ ఎక్కడకక్కడ ఆగిపోయింది. రైతులు పాడైపోయిన టైర్లకు నిప్పుపెట్టి రోడ్లపై వేశారు. గడ్డిమోపులువేసి వాటికి నిప్పుపెట్టారు. రైతులను ప్రభుత్వాలు అపహాస్యం చేస్తున్నాయని వ్యవసాయరంగానికి అననుకూలమైన విధానాలను అనుసరిస్తున్నాయని రెండు రైతు సంఘాలు సంయుక్త ప్రకటనలో విమర్శించాయి.

విద్వేషాన్ని విడనాడండి : లజ్‌కాక్

ఐరాస : విద్వేషాన్ని విడనాడాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు మిరోస్లావ్ లజ్‌కాక్ పిలుపునిచ్చారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీనరహంతకులు కోట్లాదిమందిని పొట్టన పెట్టుకున్న విషాద సంఘటనలో బాధితులను స్మరించుకుంటూ జనరల్ అసెంబ్లీ నివాళి అర్పించింది. ఈ సందర్భంగా లజ్‌కాక్ మాట్లాడుతూ ఆనాటి పెను విషాదాన్ని గుర్తు చేసుకునేందుకే మనం ఇక్కడ సమావేశం కాలేదు. ఆ విషాదాన్ని నివారించడంలో మనమంతా విఫలమయ్యాం. ఆనాటి పెను విషాదం అకస్మికంగా జరిగిందేమీ కాదు. ఒక రాత్రి చోటుచేసుకున్నది కాదు.. అది జరుగుతుందని తెలుస్తూనేవుంది. కాని దాన్ని ఆపలేకపోయాం. ఇలాంటి సమావేశాలు ఇంకా అనేకం నిర్వహించుకుని చర్చలు జరిపి తీర్మానాలు చేయాలి. ముందుగానే తగినంత జాగ్రత్త చర్య తీసుకోవాలి. ముప్పు కలుగుతుందనుకున్నప్పుడు తక్షణం స్పందించాలి. ఆ స్పందనకు ఫలితాలు కనిపించాలి. అయితే ఇదంతా అందరూ కలిసి చేయవలసిన పని. ప్రపంచంలో నేడు విద్వేషం నెలకొనివుంది. సామూహిక హత్యాకాండ, ఒక పద్ధతి ప్రకారం వివక్షను పాటించడం, జాతి వివక్షను ప్రదర్శించడం, అనహానాన్ని, ఇస్లాంపట్ల అనవసరమైన భయాన్ని, విద్వేషాన్ని ప్రదర్శించడం జరుగుతున్నదని ఆయన హెచ్చరించారు.

ప్రపంచం



సూకీ ఇంటిపై బాంబుదాడి

యాంగాన్ : మయన్మార్ ప్రభుత్వంలో కీలకనేత నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అంగ్‌సాన్‌సూకీ ఇంటిపై బాంబుదాడి జరిగింది. దాడి జరిగిన సమయంలో ఆమె ఇంటిలో లేరు. దీంతో ఆమె సురక్షితంగా బయలపడ్డారు. యాంగాన్‌లో సరస్సుపక్కనేవున్న ఆమె నివాస భవనంపై పెట్రోల్ బాంబుదాడి జరిగిందని ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. బాంబుదాడికి వెనుక లక్ష్యం ఏమిటన్నది, ఎవరు చేశారన్నది వివరాలు తెలియజేయలేదు. బాంబుదాడిలో భవనానికి స్వల్పంగానే నష్టం జరిగింది. చాలాకాలంగా సూకీ అదే ఇంటిలో ఉంటున్నారు. మయన్మార్ రఖిన్ రాష్ట్రంలో రొహింగ్యా ముస్లింలపై సైన్యం హింసాకాండ సాగించిన నేపథ్యంలో సూకీ సైన్యానికి తన తోడ్పాటు తెలిపింది. సైన్యం ఎలాంటి దాడులకు పాల్పడలేదని ఆమె చెప్పారు. బహుశా రొహింగ్యాల పరిరక్షణకు చర్యలు తీసుకోలేదన్న భావనతో దాడి జరిపి ఉండవచ్చునని భావిస్తున్నారు. మయన్మార్ సైన్యం అత్యంత దారుణంగా రొహింగ్యాలపై దాడులు జరపడంతో దాదాపు 7 లక్షలమంది రొహింగ్యాలు బంగ్లాదేశ్‌కు వలసవెళ్లి అక్కడ తలదాచుకుంటున్నారు. ఎట్టకేలకు అంతర్జాతీయ ఒత్తిడి కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి రొహింగ్యాలను తిరిగి తమ దేశంలోకి అనుమతించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే రొహింగ్యాలు తిరిగి మయన్మార్‌కు వెళితే అక్కడ తమకు రక్షణ ఉంటుందా? అన్న సందేహంతో తిరిగి వెళ్లేందుకు వెనుకాడుతున్నారు.

70 దేశాల్లో మానవ హక్కుల సంక్షోభం



ఐరాస : ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలలో మానవ హక్కుల సంక్షోభం ఏర్పడిందని ప్రపంచ న్యాయ ప్రాజెక్టు (డబ్ల్యుజెపి) 2018 సర్వే సూచీలో పేర్కొన్నది. 113 దేశాలలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 1,10,000 కుటుంబాలు పాల్గొన్నారు. 3000 మందికి పైగా నిపుణులు న్యాయవ్యవస్థలను లోతుగా పరిశీలించి తమ అనుభవాలను సర్వే ద్వారా ప్రకటించారు. ప్రాథమిక హక్కుల ఉల్లంఘన తదితర అంశాలకు సంబంధించి 8 కేటగిరీలుగా విభజించి సర్వే నిర్వహించారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో న్యాయవ్యవస్థేతర హత్యలను ప్రతిబింబిస్తూ మాస్కులు ధరించిన ప్రజలు నిరసన ప్రదర్శన జరిపారు. అన్ని దేశాలలోకంటే ఫిలిప్పీన్స్‌లో న్యాయము, చట్టాల అమలు అధ్వాన్నంగా ఉంది. 113 దేశాలలో సర్వే జరపగా మూడింట రెండువంతుల దేశాలలో చట్టబద్ధపాలన నాసిరకంగా ఉందని, నియంతృత్వ జాతీయవాదం పెరిగిపోయిందని, అంతర్జాతీయ న్యాయకర్తవ్యాలను అమలు చేయడంలేదని సర్వే పేర్కొంది. మానవ హక్కుల సంక్షోభమేగాకుండా మానవ హక్కుల ఉద్యమాలు కూడా వెనుకపట్టు పట్టాయి అని సర్వేలో పాల్గొన్న ఏలే యూనివర్సిటీ ప్రొఫెసర్ శామ్యూల్ మోయిన్ తెలిపారు. అనేక దేశాలలో ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాటం జరిపేందుకు మానవ హక్కుల ఉల్లంఘన పెద్ద అడ్డంకిగా తయారయ్యింది. ఆర్థిక వ్యవస్థ ప్రపంచీకరణలో సంపన్నులే విజయం సాధించారు. చరిత్రలో ఏనాడూ లేనంతగా అసమానతలు పెరిగిపోయాయి. మానవ హక్కుల ఉద్యమాలు బలహీనపడిపోయాయి. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలలో ప్రత్యేకించి వెనిజులా, కంబోడియా, ఆఫ్ఘనిస్తాన్, ఫిలిప్పీన్స్‌లలో మానవ హక్కుల సూచి గతంలోవున్నదానికంటే 18 పాయింట్లు తగ్గి 88వ స్థానంలో ఉన్నాయి. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రొడ్రిగొ దుటర్టి ప్రభుత్వంపై విమర్శలు చేఇసన ప్రతిపక్షాలను, వ్యక్తులను తీవ్రంగా వేధిస్తూ వారి హక్కులను ఉల్లంఘిస్తున్నారని, మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జోస్‌లూయిస్‌మార్టిన్ తెలిపారు. అనేక దేశాలలో భావప్రకటనా స్వేచ్ఛపై దాడి, మతం విస్తరణ, వ్యక్తిగత గోప్యత హక్కుపై దాడి, కార్మికుల హక్కుల హరణ యధేచ్ఛగా సాగుతున్నాయని నివేదిక తెలిపింది. మానవ హక్కుల పాటింపులో డెన్మార్క్, నార్వే, ఫిన్లాండ్ సర్వే సూచీలో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో ఉన్నాయి. బ్రిటన్‌లోను మానవ హక్కుల ఉల్లంఘన సూచి పైనుంచి లెక్కిస్తే 10 నుంచి 11వ స్థానానికి పడిపోయింది. అధిక ఆదాయం పొందుతున్న 35 దేశాల్లో అమెరికా కొరియాకంటే కాస్త ఎక్కువగా 19వ స్థానంలో ఉన్నది. అయితే మానవ హక్కుల పరిరక్షణ కేటగిరీలో అమెరికా గతంకంటే 5 స్థానాలు కోల్పోయి 26వ స్థానంలో ఉన్నది. వివక్ష పాటింపు విచ్చలవిడిగా జరుగుతోంది. నేర న్యాయవ్యవస్థలు ప్రపంచవ్యాప్తంగా అత్యంత అధ్వాన్నమయిన స్థితిలో కొనసాగుతున్నాయి.

జన్యుమార్పిడి వరికి అమెరికా ఓకే

ఆందోళన వ్యక్తం చేసిన చైనా శాస్త్రవేత్త

వాషింగ్టన్ : జన్యుమార్పిడి వరిపంటకి అమెరికా ఆహార ఔషధ నియంత్రణ సంస్థ తన ఆమోదం తెలియజేసింది. హుహుయ్ నెం.1 వరి విత్తనానికి అమెరికా తన ఆమోదం తెలిపింది. దీంతో చైనాలో ఉత్పత్తి అయ్యే జన్యుమార్పిడి వరి ధాన్యం అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రవేశించనున్నది. జన్యుమార్పిడి విత్తనంపట్ల శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విత్తనాన్ని వినియోగించడం ప్రమాదకరమని చైనా యునాన్ పర్యావరణ వ్యవసాయ సంస్థ డైరెక్టర్ నహోంగియాన్ స్పుత్నిక్ విలేకరితో మాట్లాడుతూ చెప్పారు. ఈ వరి విత్తనం సురక్షితమైందేనని అమెరికా ఆహార ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డిఏ) అంగీకారం తెలియజేసింది. శాస్త్రీయ విధానంలో రూపొందించిన కొత్త వరి వంగడం ఇది అని నహోంగియాన్ తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ వరి విత్తనం వినియోగంలో కనిపించే లోపాలు మరింత పరిశోధన జరిగితే సవరించుకునే అవకాశం ఉండవచ్చునని ఆయన తెలిపారు. అయితే ప్రస్తుతానికి మాత్రం ఈ ఉత్పత్తులు సురక్షితమైనవి కావని, అందువల్ల వాటిని వినియోగించరాదని ఆయన అభిప్రాయపడ్డారు. జన్యుమార్పిడి పంటలను పెద్దఎత్తున పండిస్తే అవి జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తాయని ఈ శాస్త్రవేత్త హెచ్చరించారు. హైబ్రీడ్ పంటలకంటే ఈ వరివిత్తనం మరింత ప్రమాదకరమైందని ఆయన హెచ్చరించారు. ఈ వరి విత్తనాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దవద్దని ఆయన కోరారు. అమెరికా రూపొందించిన జన్యుమార్పిడి పంటలను చైనా దేశీయ మార్కెట్‌లో ఇప్పటికే విరివిగా అనుమతిస్తున్నారు. జన్యుమార్పిడి పంటలు అత్యంత ప్రమాదకరమైనవని చైనాలో జరిపిన సర్వేలో ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ప్రజల ఆరోగ్యాన్ని ఇవి దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.

చైనా, బ్రిటన్ మధ్య 12 ఒప్పందాలు



బీజింగ్ : చైనా, బ్రిటన్‌లు వివిధరంగాలలో పరస్పరం సహకరించుకునేం దుకు 12 ఒప్పందాలు కుదుర్చుకొని సంతకాలు చేశాయి. వాణిజ్యం, ఆర్థికం, ఆరోగ్యభద్రత, స్మార్ట్‌సిటీలు తదితర రంగాలలో ఒప్పందాలు కుదిరాయి. బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసామె రెండు దేశాల వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు బీజింగ్ వచ్చారు. చైనా ప్రధానమంత్రి లీకెకియాంగ్‌తో ఇక్కడ గ్రేట్‌హాల్ ఆఫ్ పీపుల్‌లో థెరిసా చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్టం చేసుకుంటామని ఇరువురు నేతలు తెలియజేశారు. ప్రపంచ శాంతి, సుస్థిరత, అభివృద్ధికి రెండు దేశాల సంబంధాలు దోహదం చేస్తాయని చెప్పారు. బ్రిటన్, ఈయూ మధ్య సంబంధాలలో మార్పులు వచ్చినప్పటికీ చైనా, బ్రిటన్ సంబంధాలలో మార్పులు ఉండబోవని వారు పేర్కొన్నారు. పరస్పర గౌరవం, సమానత్వం, పరస్పర ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత వృద్ధి చేసుకుంటామని వారు తెలిపారు. లీకెకియాంగ్ మాట్లాడుతూ రెండు దేశాలు అవకాశాలను వినియోగించుకొని కలిసి పనిచేయడం ద్వారా స్వర్ణయుగం భాగస్వామ్యంలో కొత్త చరిత్రను సృష్టిస్తామని అన్నారు. షాంఘై-లండన్ స్టాక్‌మార్కెట్ల మధ్య సంబంధాలను నెలకొల్పేందుకు ఏర్పాట్లను వేగవంతం చేస్తామని చైనా ప్రధాని తెలిపారు. థెరిసా 2016లో ప్రధాని బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా చైనాలో పర్యటించారు.

ట్రంప్‌పై ట్రేడ్ యూనియన్ల ధ్వజం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్పొరేట్ శక్తులు వారి రాజకీయ మిత్రులతో కలిసిపోయి కార్మికుల బేరసారాల హక్కులను హరించివేశారని ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా విమర్శించాయి. మొదటిసారి స్టేట్ ఆఫ్‌ది యూనియన్‌లో ట్రంప్ చేసిన ప్రసంగంలో హక్కుల ఉల్లంఘటన అంశం ప్రధానంగా చోటుచేసుకున్నది. తాను అధికారం చేపట్టిన తరువాత ఏడాది కాలంలో అపారమైన వృద్ధి, అసాధారణమైన విజయం సాధించినట్టుగా చెప్పుకున్నారు. పన్నుల్లో కోత విధించానని, మౌలిక సదుపాయాల పెట్టుబడులను పెంచానని మాట్లాడారు. అదే సమయంలో వాతావరణ పరిరక్షణ విషయంలో తప్పుదారి పట్టారు. అమెరికా ఇంధనరంగంపై యుద్ధం ప్రకటిస్తున్నట్టు మాట్లాడారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానని చెప్పారు. క్యూబా పరిధిలోని గ్వాటెనామాబె జైల్లో అక్రమంగా అనేకమందిని ఇంకా నిర్బంధించే ఉన్నారు. ఆయన తన మొదటి ఏడాది పాలనలో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నారు. ఉమ్మడి బేరసారాలపై దాడి చేశారు. మా జేబులలో డబ్బు లాగివేసుకున్నారు. మేము పనిచేసే ప్రదేశాలు సురక్షితంగా లేవు. దేశాన్ని ఆయన విభజనకు గురి చేశారు. విలువలను వదిలేశారు. జాతి వివక్షకు రక్షణ కల్పిస్తున్నారు అని ట్రేడ్ యూనియన్లు విమర్శించాయి.

జనానికి బురిడీ

(మొదటిపేజీ తరువాయి)

రూ.330లు చెల్లించాలి. అంటే రూ. 3300 కోట్లు బీమా కంపెనీల బొక్కసాల్లో పోయాల్సిందే. హెల్త్ కార్డుల వినియోగంలో వివిధ రాష్ట్రాల ఇప్పటికే జనం విసిగి వేసారిపోయారు. ఇక కార్పొరేట్ ఆసుపత్రులకు పండగే పండగ. సాధారణ జ్వరంతో ఆసుపత్రికి వెళ్తే... టెస్ట్‌ల పేరిట లక్షలకు లక్షలు క్లెయిమ్ చేసుకున్నా... ప్రశ్నించే అవకాశమే లేదు. రైతుల కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచుతారట. ప్రస్తుతం క్వింటాలు ధాన్యానికి రూ.1590లు కనీస మద్దతు ధర ప్రకటించారు. ఈ ధరతో కనీసం పెట్టుబడి కూడా మిగలని పరిస్థితి. దీన్ని ఒకటిన్నర రెట్లు పెంచితే, రూ.2380లకు ధర పెరుగుతుంది. ఒకరకంగా రైతుకు కాస్త ఊరటే. కానీ బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధర కూడ రెట్టింపునకు చేరటం ఖాయం. అదే జరిగితే ప్రస్తుతం కిలో రూ.30ల పలుకుతున్న ముతక బియ్యం ధర రూ.60లకు చేరుతుంది. అప్పుడు సామాన్యుల పరిస్థితి ఏమిటి? కేవలం ఓట్ల కోసం రైతులను ఆకర్షించటానికే ఈ ప్రకటన చేశారు. ఇప్పటికే దళారీ వ్యవస్థలో చిక్కుకున్న రైతులను కాపాడేందుకు రుణవిముక్తులను చేయాలి. వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో రుణమాఫీ ప్రకటించిన బీజేపీ సర్కారు ఆ దిశగా అమలు చేయలేదు. చిత్తశుద్ధిలేని హామీలతో పబ్బం గడిపేందుకే అమలుకు, ఆచరణకు నోచుకోని అంశాలను బడ్జెట్‌లో ప్రవేశపెట్టారనేది ఆర్థిక నిపుణుల నిశిత విమర్శ. వ్యవసాయ రుణాలకు రూ.11లక్షల కోట్లు కేటాయించారట. రైతుల పరపతిని కాపాడుతారట. ఇప్పటికే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల రైతులు రుణభారం నుంచి విముక్తి కోరుతున్నారు. పారిశ్రామిక వేత్తలకు మాత్రం లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ రైతులను పట్టించుకోని కేంద్రం తాజాగా పరపతి పాట పాడటం కేవలం ఓట్లు దండుకోవటానికేనని స్పష్టమవుతోంది. ఇక జనాభా ప్రాతిపదిక ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన బడ్జెట్‌కు మళ్లీ కొర్రీ వేశారు. గత ఏడాదితో పోల్చితే కేటాయింపులు పెంచినట్టు ప్రకటించారు. గత సంవత్సరం ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.52,393 కోట్లు ఇస్తే ప్రస్తుత బడ్జెట్‌లో ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.56,619 కోట్లు కేటాయించారు. అలాగే గత ఏడాది ఎస్టీలకు 31,920 కోట్లు ఇస్తే ప్రస్తుతం

ఎస్టీ సబ్ ప్లాన్‌కు రూ.36,135 కోట్లు కేటాయించారు. ఐతే, గత కేటాయింపుల్లో ఎంత శాత ఖర్చు చేశారో వ్యయ పద్దులో స్పష్టం చేయలేదు. వ్యయ పద్దును పరిశీలిసే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉపకార వేతనాలు, ఇతరత్రా ఖర్చులు కింద రూ.6500 కోట్లు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. దీనిబట్టి రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని స్పష్టమవుతోంది. సబ్‌ప్లాన్ నిధులను అస్సలు ఖర్చు చేయట్లేదు. పేరుకే దళిత, గిరిజన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు కేంద్రం ప్రకటిస్తోంది. విద్యారంగాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.లక్ష కోట్లు కేటాయించారు. 24 మెడికల్ కాలేజీలు, 21 ఆర్కిటెక్ట్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని ఊరించారు. నిపుణ ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తామంటున్నారు.

కానీ కేటాయింపులకు, వినియోగానికి మధ్య భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్న నేపథ్యంలో... ఈ అంకెలన్నీ ఓటర్లకు ఉచ్చు పన్నినట్టే కనిపిస్తున్నాయంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఇక ఉజ్వల్ పథకంలో 8 కోట్ల మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ బండలు ఇస్తామని ప్రకటించారు. ఇలా వివిధ పథకాలతో వివిధ వర్గాలను ఆకట్టుకోవాలనే అత్యాశ ఈ బడ్జెట్‌లో కనిపిస్తోంది. కనీస మద్దతు ధర పెంపుదల పేరుతో రైతులు, హెల్త్ స్కీం పేరుతో 50 కోట్ల మంది, ఉచిత గ్యాస్ పేరుతో 8 కోట్ల మంది మహిళలను ఆకట్టుకుంటే... వచ్చే ఎన్నికల్లో అధికారం మళ్లీ దక్కుతుందనే మోడీ సర్కారు అత్యాశ ఈ బడ్జెట్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

వేతన జీవులకు నిరాశే..!

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు నిరాశే ఎదురయ్యింది. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు లేదా ఆదాయపు పన్ను స్లాబ్‌లో ఎటువంటి మార్పును ప్రతిపాదించలేదు. అయితే వైద్య, ప్రయాణ ఖర్చులకు మాత్రమే రూ.40 వేల వరకు పన్ను రాయితీ(స్టాండర్డ్ డిడక్షన్)ని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించారు. 2006-07 సంవత్సరం నుంచి స్టాండర్డ్ డిడక్షన్ నిలిపివేయబడింది. ఇదిలాఉండగా నిపుణులు మాట్లాడుతూ వేతన జీవులకు ఇది అత్యంత నామమాత్రపు ప్రయోజనమని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి మాట్లాడుతూ గత మూడేళ్లుగా వ్యక్తిగత ఆదాయపు పన్ను రేటులో అనేక మార్పులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అయితే భవిష్యత్తులో మార్పు చేసే ప్రతిపాదన ఏదీ లేదన్నారు. ఇది వేతన జీవులకంటే వ్యక్తి వ్యాపారం చేస్తున్న వారికి మంచి ఆదాయం ఉంటుందని సమాజంలో ఒక అభిప్రాయం ఉందని జైట్లీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అయితే వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లలో ప్రధాన భాగం వేతన జీవుల నుంచి వస్తుందని ఆదాయపు పన్ను వివరాలు విశ్లేషిస్తున్నాయన్నారు. 2016-17 సంవత్సర అంచనా ప్రకారం, 1.89 కోట్ల మంది వేతన జీవులు తమ ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేశారని జైట్లీ పేర్కొన్నారు. ఈ చెల్లింపులు రూ.1.44 లక్షల కోట్లుగా ఉంది. వ్యక్తిగత వేతన పన్ను చెల్లింపుదారు లేదా సగటు పన్ను చెల్లింపు రూ.76,306గా ఉన్నట్లు వివరించారు. ఇందుకు భిన్నంగా అదే సంవత్సరానికి రిటర్నులు దాఖలు చేసిన వ్యక్తిగత వ్యాపార ఆదాయపు పన్ను చెల్లింపుదారులు 1.88 కోట్లు చెల్లించారు. రూ.48 వేల కోట్లు మొత్తం పన్ను చెల్లింపు వ్యక్తిగత వ్యాపారదారుడు ఆదాయపు పన్ను చెల్లింపు లేదా రూ.25,753 సగటు పన్ను చెల్లింపునకు వర్తిస్తుంది. ఆదాయపు పన్ను పరిధిలోకి కొత్తగా 5 లక్షల మంది చేరినట్టు చెప్పారు. అదనంగా రూ.90 వేల కోట్ల ఆదాయ పన్ను వసూలైనట్టు తెలిపారు. వైద్య, ప్రయాణ ఖర్చులపై పన్ను రాయితీ నిర్ణయంతో 2.5 కోట్ల వేతన ఉద్యోగులకు, పెన్షనర్లకు లబ్ధిచేకూరనుందని పేర్కొన్నారు.

బీజేపీకి ఉప షాక్

(మొదటిపేజీ తరువాయి)

సాధించారు. అల్వార్ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి జస్వంత్ సింగ్ యాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థి కరణ్‌సింగ్ 1,56,319 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అజ్మీర్ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి రామ్‌స్వరూప్ లాంబాపై కాంగ్రెస్ అభ్యర్థి రఘుశర్మ 70,634 ఓట్ల ఆధిక్యం సాధించారు. అల్వార్, అజ్మీర్ ఎంపీ స్థానాల పరిధిలోని 17 అసెంబ్లీ స్థానాల్లోనూ బీజేపీకి చుక్కెదురు తప్పలేదు. అన్ని స్థానాల్లోనూ బీజేపీ పూర్తిగా వెనుకపడింది. దీంతో బీజేపీ శిబిరంలో అలజడి రేగుతోంది. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం ఏడు నెలల ముందు జరిగిన ఈ ఉప ఎన్నికలను అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అసెంబ్లీ పోరుకు సెమీఫైనల్‌గా భావించి.. సీఎం వసంధరారాజే. రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ సచిన్ పైలట్ హోరాహోరీగా ప్రచారం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అజ్మీర్ సీటు నుంచి కాంగ్రెస్ చీఫ్ సచిన్ పైలట్ పరాజయం పాలవ్వగా.. ఈసారి ఇక్కడ బీజేపీ అభ్యర్థి రాంస్వరూప్ లంబాపై కాంగ్రెస్ అభ్యర్థి రఘు శర్మ భారీ మెజారిటీతో ముందంజలో ఉన్నారు. అల్వార్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కరణ్‌సింగ్ యాదవ్.. బీజేపీ అభ్యర్థి జస్వంత్‌సింగ్ యాదవ్‌పై పైచేయి సాధించారు. రాహుల్ గాంధీ కీలక అనుచరులుగా భావించే సచిన్ పైలట్, సీపీ జోషీ, జితేంద్రసింగ్ భన్వర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇక్కడ పార్టీ విజయానికి కృషి చేశారు. రాజస్థాన్ ప్రజలు బీజేపీని తిరస్కరించారని, నైతిక బాధ్యతవహిస్తూ సీఎం వసుంధర రాజె తన పదవికి రాజీనామా చేయాలని సచిన్ పైలట్ డిమాండ్ చేశారు.

ఇక పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. నౌపోరా అసెంబ్లీ స్థానంలోనూ, ఉలుబెరియా ఎంపీ స్థానంలోనూ తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఉల్‌బెరియా ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి అనుపమ్ మల్లిక్‌పై తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి సాజ్దా అహ్మద్ 4,74,023 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

టీడీపీ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆగ్రహం



విశాలాంధ్ర-విజయవాడ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్డీఏ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ వెంటనే టీడీపీ కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేసి రాష్ట్రానికి అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసిస్తూ సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యాన స్థానిక లెనిన్‌సెంటర్ గురువారం మధ్యాహ్నం నిరసన ధర్నా నిర్వహించారు. నరేంద్ర మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేశాయి. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా దగా చేసిందన్నారు. విభజన చట్టంలోని హామీల ఊసే లేకుండా కేంద్ర బడ్జెట్ ప్రహసనంగా సాగిన నేపథ్యంలో కేంద్రంలోని టీడీపీ మంత్రులు తక్షణమే ప్రభుత్వం నుంచి వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. మోడీ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వానికి తీరని అన్యాయం చేస్తున్నా... రాష్ట్రానికి చెందిన ఎంపీలు, కేంద్ర మంత్రులు కానీ, రాష్ట్ర ముఖ్యమంత్రి పెదవివిప్పకపోవడం వారి అసమర్థతకు నిదర్శనమన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు రాజీనామా చేసి తాడోపేడో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు టీడీపీ మంత్రులు, ఎంపీలు పూనుకోకపోతే రాష్ట్ర ప్రజలు గాజులు, పసుపు కుంకుమలతో స్వాగతం చెబుతారని హెచ్చరించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు లంక దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, సంగుల పేరయ్య, ఈమని దాము, కొట్టు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో విశాఖలో అర్ధనగ్న ప్రదర్శన



విశాలాంధ్ర-విశాఖపట్నం: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన రూ.21.5 లక్షల కోట్ల బడ్జెట్ దేశ ప్రజలను ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులను తీవ్ర నిరాశకు గురిచేసిందంటూ సీపీఐ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్లకు వేతనాలు పెంచి సామాన్య, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతివారికి బడ్జెట్ ద్వారా అన్యాయం చేసిందని నేతలు ఆరోపించారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌ను ఈ బడ్జెట్‌లోనైనా ప్రకటిస్తారని ఆశించినవారికి నిరాశే ఎదురైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అల్లిపురంలోని సీపీఐ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ రైల్వేస్టేషన్ వరకు అర్ధనగ్న ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు, సహాయ కార్యదర్శులు జేడీ నాయుడు, కె.సత్యాంజనేయ, నాయకులు జి.రాంబాబు, పైలా ఈశ్వరరావు, ఎస్.కె.రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, టి.సాంబమూర్తి, జి.వామనమూర్తి, ఎం.మన్మథరావు, బి.ప్రశాంత కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీల రాజీనామా యోచన?

న్యూఢిల్లీ-విశాలాంధ్ర బ్యూరో :

కేంద్ర బడ్జెట్‌పై తెలుగురాష్ట్రాల ఎంపీలు పార్టీలకతీతంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరాశకు గురయ్యారు. ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ప్రతిపాదనలను కేంద్ర సర్కారు బుట్టదాఖలు చేసింది. విశాఖ రైల్వేజోన్, అమరావతి నిర్మాణం నిధుల ప్రస్తావన రాకపోవటంతో టీడీపీ ఎంపీలు ఆవేదనలో ఉన్నారు. వైసీపీ ఎంపీలు ఈ బడ్జెట్‌ను చూసి కేంద్రంపై పోరు సాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఎంపీ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ అంశంపై వైసీపీ ఎంపీలు...పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో చర్చలు జరుపుతున్నారు. టీడీపీ ఎంపీలు రాజీనామాలకు వెనుకాడబోమని చెబుతూనే బడ్జెట్‌పై కేంద్రం తీసుకున్న నిర్ణయంపై టీడీపీ పార్లమెంటరీ పార్టీలో చర్చించారు. ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలు వచ్చిన వెంటనే ఎంపీ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం అమరావతిలో చంద్రబాబు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం

తీసుకుంటారని కేంద్రమంత్రి సుజనా చౌదరి చెప్పారు. విశాఖ రైల్వే జోన్ అంశం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునేది లేదని సుజన స్పష్టంచేశారు. బడ్జెట్ తెలుగురాష్ట్రాలకు మొండిచెయ్యి చూపుతుందని తాము ఊహించలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎలాంటి త్యాగాలు చేయటానికైనా సిద్ధంగా ఉన్నామని సుజనా చౌదరి చెప్పారు. ఏపీకి కేటాయింపులపై రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు సంతోషంగా ఉన్నారేమో కానీ...తాము మాత్రం చాలా అసంతృప్తితో ఉన్నామన్నారు. విశాఖ రైల్వే జోన్ కోసం కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామన్నారు. నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపు నామమాత్రమేనని, చివరి బడ్జెట్ కావటంతో ప్రాధాన్యత ఇస్తారని ఊహించామన్నారు. సీఎంతో చర్చలు జరిగిన తర్వాతే కార్యాచరణ ప్రణాళికను విడుదల చేస్తామని సుజన పేర్కొన్నారు. టీడీపీకి ఈ బడ్జెట్ నిరాశ కలిగించిందన్నారు. బడ్జెట్‌లో కేటాయించకపోయినా తర్వాతైనా కేంద్రం ఇవ్వాలనుకుంటే కేటాయింపులు కష్టమేమీ కాదని వ్యాఖ్యానించారు. రైల్వే జోన్ సాధించి తీరుతామని విలేకరులు పలుమార్లు అడిగిన ప్రశ్నకు సుజన సమాధానం చెప్పారు. ఎప్పుడు తెస్తామనే అంశంపై సుజన స్పష్టత ఇవ్వలేదు. బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత తెలుగుదేశం పార్టీ ఎంపీలు హుటాహుటిన పార్లమెంటులోని తమ కార్యాలయంలో సమావేశమయ్యారు. సుజనా చౌదరి నేతృత్వంలో సమావేశమైన ఎంపీలు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాలని నిర్ణయించుకున్నారు. తెలుగుదేశం పార్టీ లైన్‌లోనే తమ కార్యాచరణ ఉంటుందని ఎంపీలు స్పష్టం చేశారు. కొద్ది రోజుల క్రితమే చంద్రబాబు కూడా ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా చేయాలని విన్నవించిన విషయం విదితమే. కానీ కేంద్రం చంద్రబాబు అభ్యర్థనలను బుట్ట దాఖలు చేసింది. మరోవైపు, బీజేపీ ఎంపీలు హరిబాబు తదితరులు కేంద్ర బడ్జెట్‌ను ప్రశంసించారు. వ్యవసాయం, గ్రామీణ భారతానికి పెద్దపీట వేసినట్టు ప్రకటించారు. వైసీపీ ఎంపీలు సుబ్బారెడ్డి, వరప్రసాద్, విజయసాయిరెడ్డి తదితరులు బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎన్‌డీఏ భాగస్వామి టీడీపీ మెతక వైఖరి కారణంగానే కేంద్రం ఏపీని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. పార్టీ అధినేతతో సంప్రదింపులు జరిపిన తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టంచేశారు.

కళ్లు తెరిచిన కాషాయ పార్టీ

గ్రామీణాభివృద్ధి-మౌలిక సౌకర్యాలపై శ్రద్ధ



న్యూఢిల్లీ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బీజేపీని చావుదెబ్బ తీశారు. అందుకని ఈసారి బడ్జెట్‌లో మోడీ సర్కార్ గ్రామీణాభివృద్ధిపై శ్రద్ధ పెట్టింది. అందులో భాగంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత కల్పించారు. పల్లెల్లో రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.9.64 లక్షల కోట్లు, గ్రామీణ పారిశుధ్య పథకానికి రూ.16,713 కోట్లు ,విద్యారంగంలో మౌలిక సౌకర్యాలకు రూ.లక్ష కోట్లు కేటాయించారు. సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం, ఉజ్వల యోజనలో భాగంగా 8 కోట్ల మంది గ్రామీణ మహిళలకు గ్యాస్ కనెక్షన్లు, ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజనతో మరిన్ని గ్రామీణ రోడ్ల అనుసంధానం, 2022 నాటికి అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత కల్పించారు. గ్రామీణ వ్యవసాయ మార్కెట్లకు రూ.2000 కోట్లు, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.14.34 కోట్లు కేటాయించారు.

కొత్త ఉద్యోగులకు 12శాతం పీఎఫ్

మహిళా ఉద్యోగులకు 8శాతమే



న్యూఢిల్లీ : కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి కేంద్ర బడ్జెట్ కొంత ఊరట కలిగించింది. ఏ రంగంలోనైనా కొత్తగా ఉద్యోగంలో చేరేవారికి వచ్చే మూడు సంవత్సరాలకుగానూ ప్రభుత్వమే 12శాతం ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ చెల్లిస్తుం దని అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఇన్నాళ్లూ మహిళా ఉద్యోగులు తమ జీతాల నుంచి చెల్లిస్తున్న 12శాతం పీఎఫ్‌ను 8శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. 2018లో 70లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జైట్లీ చెప్పారు. అరుణ్ జైట్లీ చేసిన ఈ ప్రకటన కొత్తగా ఉద్యోగంలో చేరబోయే వారిలో నూతనోత్తేజాన్ని నింపుతుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి అరకొరే..



న్యూఢిల్లీ : ఎస్సీ, ఎస్టీలపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సవతి తల్లి ప్రేమ కనబరిచారు. ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు అరకొర కేటాయింపులు జరిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పాటుపడు తున్నామని చెప్పుకుంటున్న మోడీ సర్కారు ఈ బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమానికి రూ.56,619 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.39,135 కోట్లు కేటాయించారు. గత కేటాయింపులతో పోలిస్తే ఇవి స్వల్ప పెరుగుదల మాత్రమే. 2018-19 బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి చేసిన కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి. 2017-18తో పోల్చితే ఈ రంగానికి కేటాయింపులు నామమాత్రంగానే పెరిగాయి. గత బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ. 52,393 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ. 31,920 కోట్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి నిధుల కేటాయింపులు చాలా స్వల్పంగానే పెరిగాయి.

అందరికీ అన్నీ...!



- బడ్జెట్‌లో జైట్లీ ఊరింతలు
- బడ్జెట్ అంచనా రూ.21.57లక్షల కోట్లు
- ద్రవ్యలోటు 3.3శాతం
- ఆదాయపన్ను యథాతథం
- రైల్వేకు రూ.1.48 లక్షల కోట్లు
- 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య రక్ష
- ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.56,619 కోట్లు
- ఎస్టీ సబ్ ప్లాన్‌కు రూ.36,135 కోట్లు
- ముద్ర రుణాలకు రూ.3లక్షల కోట్లు
- రవాణారంగానికి రూ.9.46 లక్షల కోట్లు

(విశాలాంధ్ర - ఇంటర్నెట్ డెస్క్)

సార్వత్రిక ఎన్నికల వేళ... ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాయాజాల బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. రైతులు, పేదలే లక్ష్యంగా వరాలు కుమ్మరించారు. యథావిధిగా కార్పొరేట్ శక్తులకు ఊరట కల్పించారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయ రంగాలను ఊరించారు. గురువారం ఉదయం 11 గంటలకు 2018 బడ్జెట్‌ను కేంద్ర కేబినేట్ ఆమోదించిన తరువాత..లోక్‌సభలో మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను చదివి వినిపించారు. రైతులు, పేదల కోసం తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. ఆయన మాటల్లోనే బడ్జెట్ వివరాలు ఇలా ఉన్నాయి. "మన దేశం 2.5 ట్రిలియన్ డాలర్ల (రూ.158.92 లక్షల కోట్లు) తో ప్రపంచంలోనే ఏడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే ఐదోవ ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. ఈ ఆర్థిక సంవత్సరం అర్ధ భాగంలో 7.2 - 7.5 శాతం ఆర్థిక వృద్ధి సాధిస్తాం. ఈ వృద్ధి 8 శాతానికి పెరుగు తుందని ఆశిస్తున్నాం. 2017-18లో ఎగుమతులు 15 శాతం పెరుగుతుందని అంచనా. వ్యవసాయ మార్కెట్ల మౌలిక సదుపాయల కల్పనకు రూ.2000 కోట్లు కేటా యించాం. 470 ఏపీఎంసీలను ఈనామ్‌కు అనుసంధానం చేశాం. రైతులకు 50 శాతం లాభం కలగాలనే ధ్యేయంతో ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచాం. వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా రైతుల ఆదాయం పెంచటమే లక్ష్యంగా వ్యవసాయ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రుణాల నిమిత్తం రూ.11 లక్షల కోట్లు కేటాయించాం. మత్స్యశాఖ, పశుసంవర్థక శాఖ మౌలిక సదుపాయాలకు రూ.10,000 కోట్లు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేశాం. ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖకు ఈ ఏడాది రెట్టింపు నిధులు రూ.1400 కోట్లు కేటాయించాం. హార్టికల్చర్‌లో క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశాం. ఆపరేషన్ గ్రీన్‌కు రూ.500 కోట్లు కేటాయించాం. వ్యవసాయ ఉత్ప త్తుల ఎగుమతులను సరళీకృతం చేశాం. ఆక్వా రైతులకూ కిశాన్ కార్డులను మంజూరు చేస్తాం. 2022 నాటికి అందరికీ ఇల్లు కట్టిస్తాం. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ జీవనోపాధికి రూ.14.34 లక్షల కోట్లు కేటాయించాం. జాతీయ జీవనోపాధి మిషన్‌కు రూ.5,750 కోట్లు కేటాయించాం. భూగర్భ జల పథకానికి రూ.2,600 కోట్లు కేటాయించాం. విద్యారంగ అభివృద్ధిపై దృష్టి పెంచాం. నాణ్యమైన విద్యను అందించేందుకు అధ్యాపకుల నైపుణ్యతను పెంచేందుకు, అదేవిధంగా డిజిటాల్ విద్యను ప్రోత్సహించేం దుకు చర్యలు చేపట్టాం. సమీకృత బీఎడ్ పథకాన్ని అందు బాటులోకి తీసుకువస్తున్నాం. డిజిటల్ తరగతుల సంఖ్యను పెంచుతాం. ఆర్టీఈ చట్టాన్ని సవరించి 13 లక్షల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పిస్తాం. గిరిజన బాలలకు విద్య సదుపాయం కల్పిస్తాం. వచ్చే నాలుగేళ్లలో విద్యారంగంలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రూ.లక్ష కోట్లు కేటాయించాం. ఇందుకు వైద్య, విద్య సెస్సును 4శాతానికి పెంచారు. జాతీయ ఆరోగ్య రక్షణ పథకం అమలుతో ప్రైవేటు భాగస్వామ్యం బాగా పెరిగింది. వైద్యసేవల్లో కోవై మెడికల్ సెంటర్ అండ్ హాస్పిటల్ 1.28 శాతం, హెల్త్‌కేర్ గ్లోబల్ 2.8 శాతం, షల్బై 2.35 శాతం, అపోలో హాస్పిటల్స్ 3.13 శాతం భాగం పంచుకున్నాయి. ప్రతి మూడు పార్ల మెంటరీ నియోజకవర్గాల పరిధిలో ఒక ఎయిమ్ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తాం. దేశంలో 10 కోట్ల కుటుంబాలకు జాతీయ ఆరోగ్య రక్ష పథకాన్ని అమలు చేస్తాం. ప్రతి ఏటా ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షలు చొప్పున ఖర్చు చేస్తాం. క్షయ నివారణపై దృష్టి సారించాం. ఏటా క్షయ రోగుల మర ణాలు పెరుగుతున్నాయి. అందుకే క్షయ రోగులకు పౌష్టికా ఆహారం అందించేందుకు రూ. 600 కోట్లు కేటాయించాం. ముద్ర రుణాలకు రూ.3లక్షల కోట్లు కేటాయించాం. జౌళిరంగానికి రూ.7,100 కోట్లు, ఎస్సీ సబ్‌ప్లాన్‌కు రూ.56,619 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్‌కు రూ.36,135 కోట్లు కేటాయించాం. జాతీయ రహదారుల అభివృద్ధికి 9.46 లక్షల కోట్లు కేటాయించాం. రూ.20.852 కోట్లతో చేపట్టిన స్మార్ట్ సిటీల నిర్మాణం పురోగతిలో ఉంది. 2018లో 9000 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి కాగా. .జాతీయ రహదారుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపు తున్నాం. రైల్వే శాఖకు రూ.1.48 లక్షల కొట్లు కేటాయిం చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 4000 కిలోమీటర్ల రైల్వే లైన్లను విద్యుదీకరిస్తారు. సబ్‌అర్బన్ రైళ్ల అభివృద్ధికి రూ.40,000 కోట్లు కేటాయించారు. బెంగళూరులో రూ.17,000 కోట్లతో 160 కిలోమీటర్ల సబ్‌అర్బన్ రైల్వేలైన్ మంజూరు చేశారు. దేశవ్యాప్తంగా 25000 రైల్వే స్టేషన్లలో ఎక్స్‌లేటర్లు ఏర్పాటు చేస్తారు. 3600 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ల పునరుద్ధరణ. 600 రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేస్తారు. అన్ని రైల్వే జోన్‌లు, రైళ్లలో సీసీటీవీలు, వైఫై సౌకర్యం. పెరంబూర్‌లో అధునాతన కోచ్‌ల నిర్మాణం. రైల్వేల్లో 18 వేల కిలోమీటర్ల డబ్లింగ్. రైలు పట్టాల నిర్వహణకు పెద్ద పీట. 4వేలకు పైగా కాపలాదారులు లేని గేట్ల తొలగింపు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సుపై పరిశోధన నిమిత్తం ఒక జాతీయ పథకాన్ని అమలు చేస్తారు. శాస్త్ర సాంకేతి శాఖ ఆధ్వర్యంలో సైబర్ స్పేస్ మిషన్‌ను నిర్వహిస్తారు. భారత్ నెట్ పథకంలో లక్ష పంచాయతీలను అనుసంధానం చేస్తారు. మొత్తం మీద డిజిటాల్ ఇండియాకు రూ.3,073 కోట్లు కేటాయించారు. క్రిప్టో కరెన్సీని ప్రభుత్వం గుర్తించటం లేదు. సాధ్యమైనంత వరకూ క్రిప్టో కరెన్సీ లావాదేవీలను నిరోధి స్తామని ఆర్థిక మంత్రి జైట్లీ సభకు వివరించారు. రాష్ట్రపతికి నెలకు రూ.5లక్షలు, ఉపరాష్ట్రపతికి రూ.4లక్షలు, గవర్నర్లకు రూ.3.5లక్షలు చెప్పున వేతనం చెల్లించాలని నిర్ణయించారు. గత ఏడాది పన్నుల వసూళ్లు గణనీయంగా పెరిగాయి. 2018 జనవరి 15 నాటికి 18.6 శాతం ప్రత్యక్ష పన్నులను వసూలు చేశారు. 2017లో దేశ వ్యాప్తంగా 8.27 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. గడచిన ఏడాది 41 శాతం మంది ఐటీ రిటర్న్ దాఖలు చేశారు. కార్పొరేట్ టాక్స్‌ను రూ.7000 కోట్లకు విస్తరించారు. ఇక వ్యక్తిగత ఆదాయపన్ను విషయంలో ఎలాంటి మార్పులు లేవు. వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీలకు నూరుశాతం పన్ను రాయితీ ఇచ్చారు. రూ.250 కోట్ల టర్నోవరు ఉన్న కార్పొరేట్ కంపెనీలకు 25 శాతం పన్ను రాయితీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్‌లకు ఆరోగ్య బీమా పథకంలో రూ.50వేలకు రాయితీ ఇచ్చారు. మొబైల్ ఫోన్ల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ 15నుంచి 20శాతానికి పెంచారు. సీనియర్ సిటిజన్ల ఎఫ్‌డీ, పోస్టాఫీస్ డిపాజిట్లపై టీడీఎస్ ఉండదు. రూ.50వేల వరకూ వర్తింపు. సీనియర్ సిటిజన్ల వైద్య ఖర్చులకు అదనపు రాయితీ రూ.60వేల నుంచి రూ.లక్షకు పెంచారు. బ్యాంకు డిపాజిట్ల ఆదాయంపై పన్ను పరిమితి పెంపు. రూ.50వేల వరకూ పన్ను ఉండదు. 2018-19 బడ్జెట్ అంచనా రూ.21.57 లక్షల కోట్లు. ద్రవ్యలోటు 3.3శాతంగా ఉంటుందని అంచనా.వేతన ఉద్యోగులకు రూ.40వేల వరకు ప్రయాణ, వైద్య ఖర్చులకు స్టాండర్డ్ డిడక్షన్ వర్తింపు. సీనియర్ సిటిజన్లకు వైద్య ఖర్చులకు అదనపు రాయితీ. దీనివల్ల 2.5కోట మందికి లబ్ధి. చిన్న తరహా పాదరక్షలు, తోలు ఉత్ప తుల తయారీ సంస్థల లాభాలపై ఆదాయ పన్ను రాయితీ. సహకార సంఘాల ద్వారా వ్యవసాయ ఉత్పాదక సంస్థలకు నూరుశాతం పన్ను రాయితీ. సైనిక సంపత్తి, ఆయుధాల తయారీలో స్వావలంబనకు ప్రయత్నం. ఆయుధాల తయారీ రంగంలో విదేశీ పెట్టుబడులకు ప్రోత్సాహం. అమృత్ పథకం కింద రూ.19,428 కోట్లతో 494 ప్రాజెక్టులు. ప్రత్యక్ష పన్నుల్లో 12.6శాతం వృద్ధి. గత రెండేళ్లుగా ఆదాయపన్ను వసూళ్లలో భారీ పెరుగుదల. వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుల కింద అదనంగా రూ.90వేల కోట్ల సేకరణ. ద్రవ్యోల్బణం ఆధారంగా ఐదేళ్లకొకసారి ఎంపీ వేతనాల్లో మార్పు. ప్రతి వ్యాపార సంస్థకు యూనిక్ ఐడీ. సులభతర వాణిజ్యంలో పారదర్శకత కోసం ప్రతి వ్యాపార సంస్థకు గుర్తింపు. స్టాంప్ డ్యూటీల విధానం నుంచి బయట పడేం దుకు రాష్ట్రాలతో సంప్రదింపులు. స్టాంప్ డ్యూటీల విష యంలో కొత్త విధానం. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.80వేల కోట్లు. 14 ప్రభుత్వ రంగ సంస్థలను స్టాక్‌మార్కెట్‌లో లిస్ట్ చేశారు. 900 కొత్త విమానాల కొను గోలు. వంద కోట్ల ప్రయాణాలకు వీలుగా విమానాశ్రయాలు విస్తరణ. టోల్ ప్లాజాలో సులభతర ప్రయాణానికి వీలుగా ఎలక్ట్రానిక్ చెల్లింపులు. 2020 నాటికి 50 లక్షల మంది యువతకు ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ. క్రియాశీల కంగా లేని 56 విమానాశ్రయాలు ఉడాన్ పథకం కింద అభివృద్ధి. జీవన ప్రమాణాల మెరుగుదలకు పైలట్ ప్రాజెక్టు కింద 115 జిల్లాల ఎంపిక. ఇంటింటి తాగునీటి పథకానికి రూ.77,500కోట్లు. ఆకర్షణీయ నగరాల పథకం కింద 99 నగరాల ఎంపిక వాటి అభివృద్ధికి రూ.2.04లక్షల కోట్లు. నమామి గంగ పథకం కింద 187 ప్రాజెక్టులు. 10 పర్యాటక కేంద్రాల అభివృద్ధి. పురావస్తుశాఖ కింద 110 కేంద్రాల అభివృద్ధికి కృషి. కొత్త ఉద్యోగాలు కల్పించే రంగాల్లో ప్రభుత్వం చెల్లించే ఈపీఎఫ్ 8.33శాతం నుంచి 12శాతానికి పెంపు. పెంచిన ఈపీఎఫ్ మూడేళ్ల పాటు అమలు. సరి హద్దుల్లో మౌలిక సౌకర్యాలకు ప్రాధాన్యత. గత మూడు సంవత్సరాల్లో ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యం. వస్త్రపరిశ్రమ కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు. టెక్స్‌టైల్ రంగానికి రూ.7,140కోట్లు. ముద్ర యోజన కింద చిన్న పరిశ్రమలకు రుణాలు ఇచ్చే యోచన. రుణాల్లో 75శాతం మహిళలకు కేటాయింపు. పీఎం జీవన్ బీమా యోజన ద్వారా రెండు కోట్ల కుటుంబాలకు లబ్ధి. జన్‌ధన్ యోజనలో భాగంగా 60వేల కోట్ల బ్యాంకు ఖాతాలకు బీమా సౌకర్యం వర్తింపు.దళిత సంక్షే మానికి కోసం రూ.56వేల కోట్లు. ఆదివాసీల సంక్షేమానికి రూ.32,508కోట్లు. చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమల కోసం రూ.3,790కోట్లు, ఆరోగ్య రంగానికి 1.38 లక్షల కోట్లు. గ్రామీణ పారిశుద్ధ్య పథకానికి రూ.16,713కోట్లు. ప్రధాని సౌభాగ్య పథకంలో భాగంగా నాలుగు కోట్ల గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు. సౌభాగ్య పథకానికి రూ.16వేల కోట్లు. అన్ని పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర. ప్రతీ పౌరునికి సమీపంలో వెల్‌నెస్ సెంటర్లు. వాటి ఏర్పాటుకు రూ.1200 కోట్లు. మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.75వేల కోట్లు కేటాయించారు.

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి గవర్నర్ల జీతాలు పెంపు

న్యూఢిల్లీ : దేశ ప్రధమపౌరుడి జీతాల పెరిగాయి. రాష్ట్రపతికి రూ. 5లక్షలు, ఉప రాష్ట్రపతికి రూ.4 లక్షలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఈ విషయం గురువారం పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడిం చారు. 2006 జనవరి1 నుంచి వారి జీతాలను పెంచలేదు. పనిలోపనిగా గవర్నర్ల జీతాలను కూడా రూ.3.5 లక్షలకు పెంచారు. ఇప్పటి వరకు రాష్ట్రపతి నెలకు రూ. 1.50 లక్షలు, ఉపరాష్ట్రపతి 1.25, రాష్ట్ర గవర్నర్ల రూ. 1.10 లక్షలు జీతాలు పొందుతున్నారు. సీనియర్ ఐఏఎస్‌లు, ప్రధాన కార్యదర్శుల కంటే రాష్ట్రపతులు తక్కువ జీతం పొందు తున్నారు. రెండేళ్ల క్రితం ప్రకటించిన ఏడవ వేతన సంఘం సిఫార్సులు రాష్ట్రపతులకు చట్టబద్దంగా వర్తించకపోవడంతో గురువారం పార్లమెంటులో జీతభత్యాలపెంపును ప్రకటించారు. 2016 జనవరి1న అమలులోకి వచ్చిన ఏడవ వేతన సంఘం సిఫార్సుల మేరకు సీనియర్ ఐఏఎస్ కేబినెట్ సెక్రటరీకి జీతం నెలకు రూ.2.50 లక్షల వరకు పెరిగింది. కేంద్రపాలిత ప్రాంతాల్లోని సెక్రటరీలకు రూ. 2.25 లక్షలకు చేరింది. దేశ రక్షణ రంగంలోని త్రివిధ దళాలైన సైనిక, వాయు, నౌకాదళాలకు అధినేత అయిన రాష్ట్రపతికి ఆయా విభాగాధిపతుల కంటే తక్కువ జీతాలు ఉండటంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతులు జీతాల పెంపును చేపట్టింది.

ప్రజలకు శూన్యం, కార్పొరేట్లకే..

కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ విమర్శ

న్యూఢిల్లీ: పార్లమెంటులో గురువారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లో ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఏమీలేవని, కార్పొరేట్లకు ప్రయోజనం కలిగించేవే ఉన్నాయని సీపీఐ కేంద్ర కార్యదర్శి వర్గం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించింది. ఆ వివరాలు:

వ్యవసాయం, విద్య, నిరుద్యోగ రంగాలపైన కేంద్ర బడ్జెట్ ప్రత్యేక శ్రద్ధ పెడుతుందన్న ఆశాభావనను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సర్వే కల్పించింది. ఈ మూడు రంగాలలో ప్రజలు అనుభవిస్తున్న తక్షణ సమస్యలు పరిష్కరించేందుకు నిర్దిష్టమైన అంశాలు ఏవీ ఈ బడ్జెట్‌లో లేవు. ఈ ఆర్థిక సంవత్సరంలో 70లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని చేసిన వాగ్దానం ఒట్టిమాటే...కోట్లాదిమంది యువత ప్రత్యేకించి విద్యావంతులైనవారికి ఉద్యోగాలు లేవు. వీరు ఎదుర్కొంటున్న కష్టాలను ఉపశమింపచేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కోసం ప్రతిపాదించిన నిధులు సంక్షోభంలో కొట్టిమిట్టాడుతున్నా రైతులకు ఎంత మాత్రం ప్రయోజనం కలిగించవు. తమ ఉత్పత్తులకు తగ్గ గిట్టుబాటుధరలు లభించక రైతులు కష్టాలను ఎదుర్కోవడం కొనసాగుతుంది. మరోవైపు వ్యవసాయ ఉపకరణాల ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి.

విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు గత మూడేళ్లుగా తగ్గుతూనే ఉన్నాయి. ఈ ఏడాది జీడీపీలో 2.4శాతం తగ్గించారు. విద్యారంగానికి ఆర్థికమంత్రి ఎలాంటి నిధులను కేటాయించలేదు. నిధులు కేటాయించకపోగా ఉన్నతవిద్యా సంస్థలలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను, సీట్లను ఒక వ్యూహం ప్రకారం తగ్గించారు. గత మూడేళ్లలో ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య సైతం తగ్గింది. రైల్వేలతో సహా ఆర్థికమంత్రి చేసిన వివిధ ప్రతిపాదనలు సాధారణ ప్రజలపైన మరింత భారం మోపుతాయి. అన్ని నిత్యావసరాల వస్తువుల ధరల పెరుగుదల కొనసాగుతుంది. మరి సాధారణ ప్రజలకు 'అచ్చేదిన్' (మంచిరోజులు) ఎక్కడ..? మరోవైపు ఆర్థిక మంత్రి కార్పొరేట్ పన్నులను మరింతగా తగ్గించి తెలివితేటలను ప్రదర్శించారని విమర్శించింది.

విద్యార్థి వ్యతిరేక బడ్జెట్ :ఏఐఎస్ఎఫ్

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర నూతన బడ్జెట్ విద్యార్థి వ్యతిరేకమైనదని ఏఐఎస్ఎఫ్ జాతీయసమితి తీవ్రంగా ఖండించింది. ఈ బడ్జెట్ పూర్తిగా విద్యారంగ, విద్యార్థుల వ్యతిరేకమైనదని ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రి విడుదల చేసిన ప్రకటన విమర్శించింది. సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను పరిష్కరించడంలో ఇది పూర్తిగా విఫలమైంది. జీడీపీలో 6శాతం విద్యారంగానికి కేటాయించడంలో వైఫల్యంచెందింది. బ్రిక్స్ దేశాలు లేదా ఇతర దేశాలలో విద్యారంగానికి చేసే కేటాయింపులను పరిశీలిస్తే, మనం ఎంత వెనుకబడిఉన్నామో తెలుస్తుంది. బ్రెజిల్ జీడీపీలో 5.99శాతం, దక్షిణ ఆఫ్రికా 6శాతం నిధులను చాలా సంవత్సరాలుగా కేటాయిస్తున్నాయి. భారతదేశం కేవలం 4శాతం మాత్రమే కేటాయిస్తూ వెనుకబడిఉంది. కనీసం 6శాతం కేటాయించాలి. విద్యార్థులకు ఈ కేటాయింపులు ఎంతమాత్రం సమ్మతంకాదు. విద్యార్థులకు ప్రయోజనంలేని ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని ఏఐఎస్ఎఫ్ స్పష్టం చేసింది.

వాస్తవ విరుద్ధంగా బడ్జెట్ : సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన 2018-19 కేంద్ర బడ్జెట్ 'వాస్తవ విరుద్ధంగా ఉంది' అని సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి గురువారం తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ, 'వాస్తవాలను విస్మరించిన చేసిన కసరత్తు' అని పేర్కొన్నారు.

పేదలు, కార్మికులను దెబ్బకొట్టారు : అఖిలేష్



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందని సమాజ్‌వాది పార్టీ(ఎస్పీ) జాతీయ నాయకుడు అఖిలేష్ యాదవ్, ఢిల్లీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఒబ్రెయిన్ వంటి నాయకులు వ్యాఖ్యానించారు. 'నిరుద్యోగ యువతను రెచ్చగొట్టేందుకు ఈ బడ్జెట్‌ను తీసుకువచ్చారు. పేదలు, రైతులు, కార్మికులకు నిరాశే మిగిల్చింది. సాధారణ ప్రజలు, వేతన జీవులు, మహిళలు, వ్యాపారుల ముఖాన్ని చరించిందని అఖిలేష్ ట్వీట్ చేశారు. 'ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసిన దురంహకార ప్రభుత్వానికి చెందిన వినాశకర బడ్జెట్ ఇది. బీజేపీ ధనవంతుల పట్ల పక్షపాతాన్ని ప్రదర్శించింది. ప్రజలు తిరిగి సమాధానం చెబుతారు' అని ఎస్పీ నాయకుడు పేర్కొన్నారు.

దేశ రాజధానిపై సవతి తల్లి ప్రేమ : కేజ్రీవాల్



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దేశ రాజధాని పట్ల సవతి తల్లి ప్రేమ కనబరిచిందని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కేజ్రీవాల్ అన్నారు. 'దేశ రాజధానికి ముఖ్య మైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కొంత ఆర్థిక సాయం లభిస్తుందని నేను భావించా. కానీ కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపడంతో నిరాశకు గురయ్యా' అని ట్వీట్ చేశారు.

ఆధునీకరణ, భద్రతలకు రూ.1.48లక్షల కోట్లు



న్యూఢిల్లీ: జాతీయ రవాణా సంస్థ రైల్వేల పరుగులు పట్టాలెక్కిం చడం లక్ష్యంగా రూ. 1,48,528 కోట్ల (మూల ధన వ్యయం) కేటాయింపులు జరిపి నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. గత 92 సంవత్సరాలుగా రైల్వే బడ్జెట్‌ను వేరుగానే ప్రకటిస్తూ వచ్చారు. గత సంవత్సరం నుంచి సాధారణ బడ్జెట్లోనే రైల్వే బడ్జెట్‌నూ కలిపివేశారు. గత సంవత్సర కేటాయింపులు రూ.1,31లక్షల కోట్ల కంటే ఇది 13శాతం అధికం. కొత్త రైళ్లను ప్రకటించలేదు. ఆధునీకరణ, భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. ఇందుకుగాను అందుబాటులోని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటామన్నారు. రైళ్లలో, స్టేషన్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేస్తామన్నారు. ముంబై, బెంగళూరు సబర్బన్ ప్రయాణికులకు నజరానాలను ప్రకటించారు. అత్యంత రద్దీగా ఉండే ముంబై రవాణ వ్యవస్థలోని 90కి.మీలను రూ.11వేల కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామన్నారు. మరో రూ.40వేల కోట్ల వ్యయంతో అదనంగా 160కి.మీ. సబర్బన్ రైల్వేట్రాక్ అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. 25వేలు మించి ప్రయాణికులు సందర్శించే రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భారత్ రైల్వే స్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షణలో సుమారు 600ల ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధి పరుస్తామన్నారు. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో ప్రాధాన్యత క్రమంలో వై-ఫై సేవలు అందించనున్నామన్నారు. 18వేల కి.మీ. మేర డబ్లింగ్, ట్రిబ్లింగ్ పనులు చేపడతామని జైట్లీ తెలిపారు. ఐదు వేల కి.మీ. గేజ్ మార్పిడి పనులు జరుగుతున్నాయన్నారు మొత్తం రైల్వే ట్రాక్‌ను బ్రాడ్ గేజ్‌కు మారుస్తున్నామన్నారు.

ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనూ3,600కి.మీ ట్రాక్ పునరుద్ధరణ జరుపుతామన్నారు.రానున్న రెండేళ్ల కాలంలో మొత్తం బ్రాడ్ గేజ్‌లోని 4,267 కావలిలేని లెవల్ క్రాసింగ్‌ల తొలగిస్తామన్నారు. పెరంబూర్‌లోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫాక్టరీలో అత్యంతాధునిక బోగీల తయారీ చేపడుతున్నట్లు చెప్పారు. 2018-19లో ఆధునిక బోగీలతో కూడిన రైళ్లను ప్రవేశపెడతామన్నారు.

ఇది రైతు బడ్జెట్ : ప్రధాని



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసలు కురిపించారు. ఇది రైతు హిత బడ్జెట్ అని ఆయన అన్నారు. బడ్జెట్ అనంతరం ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. రైతులకు, సాధారణ పౌరులకు, వ్యాపారవేత్తలకు బడ్జెట్ అనుకూలంగా ఉందన్నారు. ఈ బడ్జెట్‌తో జీవిత విధానం మరింత సరళంగా మారుతుందన్నారు. అన్ని రంగాలపై బడ్జెట్‌ను కేంద్రీకరించారన్నారు. వ్యవసాయం నుంచి మౌలిక సదుపాయాల కల్పన వరకు కేటాయింపులు జరిగాయన్నారు. రైతులు, దళితులు, గిరిజన వర్గాలు ఈ బడ్జెట్ నుంచి లాభం పొందుతారన్నారు. గ్రామీణ భారతానికి ఈ బడ్జెట్ ద్వారా కొత్త అవకాశాలు వస్తాయని ప్రధాని మోడీ తెలిపారు.

హామీల అమలులో బీజేపీ విఫలం : రాహుల్



న్యూఢిల్లీ : కేంద్రంలోని అధికార బీజేపీ తాను ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం పేర్కొన్నారు. పార్లమెంటులో 2018-19 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం మోడీ ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్ వ్యాపారులు, పరిశ్రమలు లేదా యువత, రైతులు, ఆర్థిక వ్యవస్థకు చెందిన అన్ని వర్గాలను నిరాశపరిచిందన్నారు. 'నాలుగేళ్లు గడిచిపోయింది. రైతులకు కనీస మద్దతు ధర విషయమై ఇచ్చిన హామీ మాత్రం అలాగే ఉంది. ఆకర్షణీయ పథకాలు బడ్జెట్‌తో సరిపోలవు. నాలుగేళ్లు అయిపోయింది. యువతకు ఉద్యోగాలు లేవు. అదృష్టవశాత్తూ ఇంకా ఒక ఏడాది మాత్రమే ఉంది' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

ఈ బడ్జెట్ ప్రభుత్వ మరణ వాంగ్మూలం : టీఎంసీ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఈ బడ్జెట్ ప్రభుత్వ మరణ వాంగ్మూలమని ఆపార్టీ సీనియర్ నాయకుడు డెరెక్ ఒబ్రెయిన్ వ్యాఖ్యానించారు. 2018-19ల బడ్జెట్ సూపర్‌గా ఫ్లాప్ అవుతుందని ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లే ముందు ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌గా ఆయన విమర్శించారు. ఈ బడ్జెట్‌తో కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తన మరణ శాసనాన్ని రాసుకుందన్నారు.

జైట్లీ ఘోర విఫలం : చిదంబరం



న్యూఢిల్లీ : ఆర్థిక రంగాన్ని స్థిరీకరించే పరీక్షలో జైట్లీ ఘోరంగా ఫెయిలయ్యారని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్‌తో దేశం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఆర్థిక లోటు పరిమితి 3.2 మాత్రమేనని అయితే దానిని అతిక్రమించి 3.5కు చేరుకుందని లోక్‌సభలో జైట్లీ బడ్జెట్ ప్రసంగం ముగించగానే చిదంబరం పీటీఐ వార్తాసంస్థకు వెల్లడించారు.

నవ్య భారతావిష్కరణ బడ్జెట్ : రాజ్‌నాథ్ కితాబు



న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం పార్ల మెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అభివృద్ధి అనుకూల బడ్జెట్‌గా రాజ్‌నాథ్ సింగ్ కితాబిచ్చారు. గ్రామీణ, నగరాల మధ్యనున్న అంతరాలను తగ్గించేందుకు వంతెనగా ఈ బడ్జెట్ దోహదపడుతుందన్నారు. మౌలిక రంగాల్లో ప్రవేశపెట్టిన అధిక కేటాయింపులు ఆర్థికాభివృద్ధి పెంపుదలకు దోహదపడతాయని ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇంతమంచి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రధాని మోడీకి అభినందనలు తెలుపుతున్నానన్నారు. నూతన భారత దేశ ఆవిష్కరణకు చారిత్రాత్మకమైన బడ్జెట్‌గా నిలుస్తుందని ఆయన శ్లాఘించారు.

సంపాదకీయం

కార్పొరేట్లకు ఊడిగం

అంకెల గారడీ, మాటల మాయాజాలం, ఓట్ల గాలం.. ఇదీ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్ స్వరూపం, అంతస్సూత్రం. ఎన్నో అంచనాలు, ఆశల మధ్య బాధ్యతాయుత బడ్జెట్ ప్రవేశపెడతామంటూ మోడీ సర్కారు సాగించింది అక్షరాలా– ఆర్థిక సవాళ్లు, రాజకీయ అవసరాల మధ్య సమతూకానికి కసరత్తే. వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధికల్పన రంగాల బాధ్యతలపై గొప్పగా సంకల్పాలు ఉల్లేఖిస్తూ– బడ్జెట్ పరిమాణం, కీలక కేటాయింపులపై అమిత లౌక్యం ప్రదర్శించింది. బడ్జెట్ గమనం, సారాంశంపై చిత్తశుద్ధి కన్నా తాము ఏ వర్గాల్నీ వదలిపెట్టలేదని చాటుకోవాలనే ఆరాటమే ప్రస్ఫుటమైంది. అదే విధంగా తమ లక్షిత పీపీపీ, ఎఫ్‌డీఐలు, ప్రైవేటీకరణ బాటను వదులుకోలేదు. స్థూలంగా కార్పొరేట్‌కు ఊతంగా, సామాన్యులను ఉసూరుమనిపించేలా ఈ బడ్జెట్ ఉంది. పన్నులు, సబ్సిడీల కోత, ధరల పెరుగుదల తప్పదనే సంకేతాలూ ఇచ్చింది. పన్నుల్లో రాయితీలపై ఎన్నో ఆశలు పెట్టుకొన్న వేతనజీవులు, మధ్యతరగతి ప్రజానీకం మోముపై చిరునవ్వులు పూయించలేకపోయింది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలను చూపిస్తూ ప్రజాప్రతినిధుల వేతనాలను ఘనంగా పెంచుకున్నారు. అంతేకాదు, ప్రతి ఐదేళ్లకోసారి రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారి వేతనాలపై సమీక్ష జరపనున్నారు. ఎంపీల జీతాల పెంపుపై రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటుచేశారు. ఈ ద్రవ్యోల్బణం, ధరలు, సగటు వేతనజీవుల విషయంలో వీరికి గుర్తురాలేదా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యంత కీలకమైన తయారీ రంగం ప్రస్తావనే లేకపోవడం ఈ బడ్జెట్ ప్రధాన లోపం. ఒక్క మాటగా చెప్పాలంటే ఈ బడ్జెట్ ఏ వర్గానికీ పూర్తిగా సంతృప్తి కలిగించలేక పోయింది. దీర్ఘకాలంలో ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయంటూ హామీలు, భరోసాలకు మాత్రం అంతులేకుండా పోయింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు మరోసారి మొండిచేయి చూపింది.

'ఈజ్ ఆఫ్ లివింగ్' నినాదంతో ఈ బడ్జెట్‌ను తీర్చిదిద్దినట్లు ప్రధాన మంత్రి మోడీ ప్రకటించారు. దీన్ని రైతు బడ్జెట్‌గా అభివర్ణించారు. విత్తమంత్రి కూడా తమ ప్రథమ ప్రాథమ్యం వ్యవసాయం, రైతు సంక్షేమమేనంటూ మాటల కోటలు కట్టారే తప్ప రైతుకు రక్షణఛత్రం అందించే ప్రయత్నంచేయలేదు. దేశ ఆర్థిక ప్రగతికి, సామాజిక పురోగతికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రైతును దశాబ్దాలుగా పాలకశ్రేణులు పూర్తిగా నిర్లక్ష్యం చేసిన పాపాన్ని కడుక్కునేందుకు ముందుకు వచ్చామంటూనే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కబంధహస్తాలకు అప్పగించే ప్రమాదకర ప్రయత్నానికి ఒడిగట్టారు. అంతేకాదు, ఉత్పాదకత, ఉత్పత్తి కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని ఆదాయ వనరుగా మారుస్తున్నామని మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించడమే అర్థరహితం. ఉత్పాదకత, ఉత్పత్తి లేకుండా ఆదాయం ఎక్కడ నుంచి వస్తుంది. దేశంలో వ్యవసాయరంగంపై ఇప్పటికీ 60శాతానికి పైగా జనం ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈ రంగంలో వృద్ధిరేటు కేవలం 2.1శాతం మాత్రమే ఉందంటే దేశ ఆర్థిక వృద్ధి బాగుందని ఎలా చెప్పగలం. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు 2022నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్నారే తప్ప ఇంతవరకూ అందుకు నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకటించలేదు. కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు చేస్తామని చెప్పారు. అయితే అది ఆచరణ లో పెడతారా అనేది పెద్ద ప్రశ్న. వ్యవసాయ రుణాలకు ఈ బడ్జెట్‌లో 11లక్షల కోట్లు కేటాయించారు. ఇది నిరుటి కన్నా లక్ష కోట్లు అధికం. అయితే నిరుటి బడ్జెట్ లక్ష్యంలో కేవలం 11శాతం మాత్రమే బ్యాంకులు రైతులకు రుణాలందిం చాయంటే ఈ అంకెలు, లెక్కలతో అన్నదాతలకు ఒరిగేదేమీ లేదు. కౌలు రైతుల ప్రస్తావన చేసినా ఎలా అమలు చేస్తారనేదే ప్రశ్న. ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చినా వారికి రుణాలు అందడం గగనమే అవుతున్న వాస్తవం తెలిసిందే. సాగు సజావుగా సాగాలంటే నీటి సరఫరా ముఖ్యం. కానీ సాగునీటి ప్రాజెక్టులకు ఈ బడ్జెట్ తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. మొత్తంగా చూస్తే వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించినా.. కేటాయింపులను విశ్లేషిస్తే ఉసూరుమనిపిస్తుంది. కష్టనష్టాలతో కుమిలిపోతున్న రైతన్నను సాంత్వన పరిచేందుకు ఈ చర్యలతో సరిపెట్టడం వ్యవసాయ రంగానికే కాదు, దేశ ఆర్థిక పురోగతికీ ఏ విధంగానూ ఉపయోగపడదు. ఈ మొత్తం బడ్జెట్‌లో చిన్న రైతుకు తీవ్ర నిరాశ ఎదురైంది. దేశంలో నేటికీ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే ప్రత్యక్ష ఉపాధిని కల్పిస్తోంది. సగటున రోజుకు రెండువేల మంది ఈ రంగాన్ని విడిచిపెట్టి ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. ఉత్పాదక వ్యయంపై కనీసం యాభైశాతమైనా లాభాన్ని కళ్లజూసేలా చర్యలు చేపడతామంటూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఏకరువు పెట్టిన బీజేపీ ఎన్నికల ప్రణాళికకూ ఈ కేటాయింపులకూ పొంతనేలేదు. ఆహార రంగాన పరాధీనతను అధిగమించి, ఆర్థిక ప్రయోజనాలను దండిగా అందుకునే శాస్త్రీయ సేద్య ప్రణాళికను అమలు చేయడం మరచి, ఒక్క సేంద్రీయ వ్యవసాయానికే పెద్దపీట వేస్తామనేలా పాలకులు వ్యవహరించడం నేటి పరిస్థితుల్లో ఏ మాత్రం సరికాదు. నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీతో కూడిన ఎరువులు, పురుగుమందులు, సకాలంలో తగిన రుణవసతి, సాంకేతిక తోడ్పాటు, పంటబీమా, గిట్టుబాటు ధరలు అందించినప్పుడే రైతన్న తిరిగి కోలుకోగలుగుతాడు. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ కొత్త జవసత్వాలు పుంజుకుంటుంది. అటువంటి ప్రయత్నం చేయకుండా మాయమాటలతో కాలక్షేపం చేసే ఎత్తుగడ వల్ల సాగును సమాధి చేయడమే అవుతుంది. ఫుడ్ ప్రాసెస్ రంగానికి రూ.1400 కోట్లు కేటాయించడం, ఆహార శుద్ధి, వాణిజ్య శాఖలతో కలిసి వ్యవసాయ ఉత్పత్తుల క్లస్టర్లు ఏర్పాటు చేస్తామనడం ఈ రంగంలో కార్పొరేట్ శక్తులకు అండగా నిలవడానికే తప్ప రైతులకు మేలు చేసేందుకు కాదు. ఈ బడ్జెట్‌లో తక్షణమే రైతులకు లభించే వాస్తవ ఆదాయమేదీ కనిపించడంలేదు. గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో నెలకొన్న సంక్షోభాలకూ, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మధ్య అగాధం ఉంది. దీనిని గుర్తించనంత కాలం, ఎన్ని వార్షికబడ్జెట్‌లు వచ్చినా పరిస్థితి మారదు. ఉపాధికల్పనపై మోడీ సర్కారు తొలినుంచి కల్లబొల్లి కబుర్లే చెబుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 70లక్షల కొత్తఉద్యోగాలకు హామీ ఇచ్చింది. గత మూడేళ్లగా ఏటా 0.4శాతం ఉద్యోగకల్పన క్షీణిస్తూ వచ్చిన నేపథ్యంలో ఈ హామీని ఎలా నెరవేర్చుతారో స్పష్టతలేదు. కోట్లాది మంది విద్యావంతులైన యువత ఆశలతో మోడీ సర్కారు చదరంగమాడుతోంది. విద్యారంగానికి వస్తే మూడేళ్లగా ప్రతి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తూ వస్తోంది. ఈసారి బడ్జెట్‌లో 2.4శాతం మాత్రమే కేటాయించింది. బడ్జెట్‌లో ఇతర కేటాయింపులు, ప్రతిపాదనలు కూడా సామా న్యులకు భారంగానే పరిగణిస్తాయి. రానున్న ఎన్నికల దృష్ట్యా మహిళలకు గాలం వేసే ప్రయత్నం ఈ బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ముద్రా యోజన క్రింద రూ.3 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించడం,ఉజ్వల యోజన కింద ప్రస్తుతం 5 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లను 8 కోట్లకు, మహిళా స్వయం సహాయ బృందాలకు ఇచ్చే రుణాలను 37 శాతం పెంచారు. ప్రసూతి సెలవులను ఆరు నెలలు చేశారు. ఈ బడ్జెట్‌లో పలువురి ప్రశంసలు అందుకొంటున్నది కొత్తగా ప్రవేశపెట్టిన 'జాతీయ ఆరోగ్య భద్రతా పథకం'. అయితే ఇది ఎన్నికల ఎత్తుగడే. దీనివల్ల ప్రయివేటు రంగానికి భారీ ప్రయోజనాలు కలుగుతాయే తప్ప గ్రామీణ నిరుపేదకు పెద్దగా ఒనగూరేదేమీ ఉండదు. దిగుమతులపై పరిమితి విధించడానికి అదనపు కస్టమ్ సుంకాన్ని విధించడం, ఎగుమతులు పెంచడానికి ఏ చర్య చేపట్టకపోవడం మోడీ మార్కు పాలనకు నిదర్శనం. రైల్వే బడ్జెట్‌లో చెప్పుకోదగిన మెరుపుల్లేవు. మొత్తంగా ఈ బడ్జెట్ సామాన్యుణ్ణి కాకుండా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. అంతిమంగా ప్రైవేటీకరణ దిశగానే దేశాన్ని నడిపే చర్యలనే బడ్జెట్‌లో చొప్పించారు. తెలుగు రాష్ట్రాల ఆశలపై మరోసారి నీళ్లుజల్లారు. విభజన చట్టంలోని హామీలను విస్మరించారు. పోలవరం, అమరావతి, రైల్వేజోన్‌ల ప్రస్తావన లేదు. ద్రవ్యలోటును భర్తీచేసేందుకు సాయం, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఉత్తరాంధ్ర, రాయలసీమలకు నిధులు ప్రత్యేక ప్యాకేజీ ఊసేలేదు. తెలంగాణకు ఇదే పరిస్థితి ఎదురైంది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు కూడా మొండి చెయ్యి చూపించారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్ హామీలు ఆచరణకు నోచుకోలేదు. ఇక మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధుల కేటాయింపుపైనా చాలా కాలంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతున్నా బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేదు.

దేశ ఆర్థిక రంగాన్ని విదేశీ పెట్టుబడుల ఆధారంగా నిర్మించాలనుకునే భావన నుంచే మోడీ బడ్జెట్‌లు రూపుదిద్దు కుంటున్నాయి. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న కొత్త పరిణామాలు ఈ నమూనాను, దానిని నమ్ముకున్న దేశాలను ప్రమాదంలో పడవేస్తాయి. ఉపాధి అవకాశాలు లేని అభివృద్ధి అంకెల్లో ఎంత ఘనంగా ఉన్నా ప్రజలందరికీ అన్నం పెట్టదు. 125 కోట్ల మంది ప్రజలను బలోపేతం చేసే విధానాలు, ఆర్థిక లక్ష్యాలు, వీటికి అనుగుణమైన బడ్జెట్లే మనకు కావాలి. మోడీ సర్కారు ఆ పని చేసేందుకు సిద్ధంగా లేదని ఈ బడ్జెట్ మరోమారు రుజువు చేసింది.

ఆంధ్రా ఉసురు తీసిన కేంద్ర బడ్జెట్!

కంచల జయరాజ్

కేంద్ర బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకొన్న ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నిరాశ ఎదురయింది. కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చినతర్వాత ప్రవేశపెట్టిన నాలుగో బడ్జెట్ లోనూ తగిన ప్రాధాన్యం లేకపోవడంతో అన్ని స్థాయిల్లోనూ నిరసన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే 26సార్లు ఢిల్లీ వెళ్లి వచ్చిన ముఖ్యమంత్రి మాట గానీ, ఎంపీలు రోజువారీ చేసే విజ్ఞాపనలు గానీ కేంద్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. దాదాపు 16నెలల తర్వాత ప్రధాని మోడీతో ప్రత్యేకంగా సమావేశం అయి, రాష్ట్ర సమస్యలపై చర్చించిన ముఖ్యమంత్రి, అప్పటి నుంచీ 2018–19 వార్షిక బడ్జెట్‌లో తగిన న్యాయం జరుగుతుందని భావించారు. ఇదే రాష్ట్ర ప్రజలకూ చెప్పారు. కానీ బడ్జెట్‌లో కనీసం ఆంధ్రప్రదేశ్ పేరు కూడా ప్రస్తావించకపోవడంతో అందరి అంచనాలు తల్లకిందులు అయ్యాయి.రూ.24.4 లక్షల కోట్ల అంచనా బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులు నామ మాత్రమే. అందులోనూ అన్ని రాష్ట్రాలకూ చేసే కేటాయిం పుల లాంటివే తప్పితే, ప్రత్యేకంగా కొత్త రాష్ట్రం అని చేసిన కేటాయింపులు ఏమాత్రం లేవు. విద్యాసంస్థలకు చేసిన కొన్ని కేటాయింపులు మినహాయిస్తే విభజనచట్టంలో పేర్కొన్న అంశాలను కనీసంగా కూడా కేంద్రం పట్టించుకోలేదు. వ్యవసాయప్రధానమైనదేశంలో ఇప్పటి వరకూ ఆరంగానికి చేసినమేలు నామమాత్రమే. ప్రభు త్వం సాచివేత ధోరణి అవలంభించడం వల్లనే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. రాబోయే 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయరంగానికి మేలు చేసే విధంగా బడ్జెట్‌ను రూపొందించామని పేర్కొంటు న్నారు. కానీ ఇది సరైంది కాదు. వ్యవసాయ సంక్షోభాన్ని తీసుకొచ్చే విధంగా బడ్జెట్ ఉంది. రైతుల ఆత్మహత్యలు పెంచేదిగానే ఈబడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయి. గిట్టుబాటు ధరలులేక,పరపతి సౌకర్యాలు సమకూరక, చేసిన అప్పులు తీర్చే స్థోమత లేక అన్నదాతలు అఘాయి త్యాలకు పాల్పడుతున్నారు. వీటిని నిలుపుదల చేయాల్సిన పాలకవర్గాలు ఏస్థాయిలోనూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా వ్యవసాయం సంక్షోభం లోకి వెళ్లిపోయింది. ఈబడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు వరాల జల్లు కురిపించారని అందరూ భావిస్తున్నారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించడం, ఖరీఫ్‌పంటలకు కనీస మద్దతుధరలను ఒకటిన్నరెట్లు పెంచడం వంటివిప్రస్తావించింది. గ్రామీణ వ్యవసాయ మార్కెట్ల ఏర్పాటుకు రూ.2వేల కోట్ల నిధిని ఏర్పాటు చేయడం, ఆక్వా కల్చర్ అభివృద్ధి, పశుసంరక్షణ కోసం రూ.10వేల కోట్లు నిధిని ఏర్పాటు చేయడం వంటివి రైతులకు,వ్యసాయానికి కేంద్రం చేసే సహాయ సహకారాలుగా బడ్జెట్‌లో పేర్కొంది. అయితే ఇప్పటి వరకూ వ్యవసాయాన్ని, రైతునూ ఏస్థాయిలోనూ ప్రభుత్వం గుర్తించలేదు. ఆదుకోలేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేదు. ఈయేడాది కూడా పత్తి, పొగాకు వంటి వాటికీ ఇప్పటికీ ధరలేక తెగనమ్ముకునే అసాధా రణ పరిస్థితులే. ఈరెండు పంటల్ని కూడా కేంద్రమే సంరక్షించి, కొనుగోలు చేయాల్సి ఉంది. వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించడం ఎలా ఉన్న, అరుగాలం పండించే పంటలకు కనీస ధరలు ఇవ్వాలనే ప్రతిపాదన కూడా చేయలేదు. ఎన్నికల వాగ్దానంగా అయినా కొన్ని రాష్ట్రాలు రుణమాఫీలు ప్రకటిస్తే వాటికి కూడా కేంద్రం సహకరించ లేదు. ఫలితంగానే అన్నదాతల ఆత్మహత్యలు పెరిగాయి. వ్యవసాయం దండగమారిసదిగా భావించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇపుడు రాబోయే ఎన్నికలకోసం ,గ్రామీణ ఓటర్లకు గాలం వేయడానికే వ్యవసాయంపై వరాలు కురిపిస్తున్నారు. అయితే ఎవరైనా ఏయేడాదికి ఆ యేడాది ప్రణాళిక వేసుకొని మరీ కేటాయింపులు చేస్తారు. కానీ కేంద్రం మాత్రం 2022 నాటికి వ్యవ సాయానికి చేసేది ఏమిటో చెప్పింది. నిజంగా రైతుల మేలుకోసం, వ్యవసాయాన్ని ఉద్ధరించాలనుకుంటే 2018–19లో ఏమి చేస్తారనేది చెప్పి ఉండేది.ఇవన్నీ ఎన్నికల వాగ్దానాలేగానీ, నిజంగా నెరవేర్చేవి కానేకావని అర్థం అవుతోంది. ఇలాంటిదే మరో అంశాన్ని కూడా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించింది. దేశంలో99నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని.కానీ గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 7శాతం కూడా ఖర్చుచేయలేదు. దీనిపై సమీక్షించిన వారుగానీ,చర్యలు తీసుకున్నవారు గానీ లేరు. అందుకే మళ్లీ అదే ప్రతిపాదన. ప్రజల్ని నమ్మించే యత్నం. ఉద్యోగాల విషయంలోకూడా ఇదే రకమైన నమ్మకాన్ని కల్పిస్తున్నారు. యువతరం ఓట్లను రాబట్టుకునే విధంగా వారికి కూడా బడ్జెట్‌లో కేటాయిం పులు చేస్తున్నట్లు కేంద్రం పేర్కొంది.కానీ ఇప్పటి వరకూ ఇచ్చిన ఉద్యోగులు ఎన్ని, గత ఎన్నిక సమయంలో నిరుద్యోగుల కోసం చేసిన ప్రకటనపై తీసుకున్న చర్యలు ఏమిటో స్పష్టం చేయలేదు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన నేతలు ఇపుడు మౌనం దాల్చడం వెనుక ఉన్నరహస్యం ఏమిటో కూడా స్పష్టం చేయాలి. అన్నిరంగాల్లోని కొత్త ఉద్యోగులకు ఈపీఎఫ్ ఖాతాల్లో ప్రభుత్వం 12శాతం జమచేస్తుందని పేర్కొన్నారు. కానీ ఇప్పటికే సీపీఎఫ్ విధానాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌పై కేంద్రం ఏవిధంగానూ స్పందించ లేదు. ఇలాంటివే అనేక అపసవ్యధోరణుల్ని ప్రభుత్వం అమలు చేస్తూ మరో సారి మాయచేసి, అధికారంలోకి రావాలని ఎన్డీయే ప్రభుత్వం భావిస్తోంది.

ఆంధ్రాకి అన్యాయం!

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగింది. విభజనచట్టంలోని అంశాలను కూడా ఏ మాత్రం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి, ఎంపీలు ప్రధాన మంత్రిని కలిసి చేసిన విజ్ఞాపనలకు కూడా లెక్కలేకుండా పోయింది. బడ్జెట్‌లో విశాఖ రైల్వేజోన్ గురించిగానీ, పోలవరంతో పాటు పలు మెగా ప్రాజెక్టులకు నిధు కేటాయింపుపై ఏమాత్రం దృష్టిసారించ లేదు. అమరావతి రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపుల పై కనీస ప్రస్తావనకూడా తేలేదు. కడప ఉక్కు పరిశ్రమ, దుగ్గరాజపట్నం పోర్టుకు బడ్జెట్‌లో కనీస స్థానం లేకుండా పోయింది. విశాఖ–చెన్నైపారిశ్రామికకారిడార్, ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి మాటమాత్రంగా అయినా స్పందించ లేదు. రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపులో ఇప్పటి వరకూ ఎలాంటి పురోగతీ లేదు. విభజనచట్టం లోని సెక్షన్ 50,51లో వాణిజ్య పన్నుల బకాయిలు, రిఫండ్స్‌కు సంబంధించిన అంశాలున్నాయి. రాష్ట్రవిభజన తర్వాత ఆయా కంపెనీలు తమ పన్నుల బకాయిలు ఎవరికి చెల్లించాలనే విషయంలో సందిగ్ధత నెలకొంది. కొన్నికంపెనీలు ఏపీలో ఉండగా,వాటి ప్రధాన కార్యాల యాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. పన్ను బకాయిలు తమకేచెల్లించాలని తెలంగాణా ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తోంది. పలు కంపెనీలు ఇప్పటికే కోర్టును ఆశ్రయించాయి. విభజన చట్టాన్ని సవరించాలని టీడీపీ ప్రభుత్వం కేంద్రాన్నికోరుతోంది. సవరించని పక్షంలో ఏపీకి రూ.3000 కోట్ల మేర నష్టం వాటిల్లుతోంది. ఈ అంశాన్ని గురించి కూడా ఎక్కడా ఇప్పటి వరకూ కేంద్రం ప్రకటించ లేదు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థను ఏపీకి ఇవ్వలేమని కేంద్రం చెపుతోంది. రాష్ట్రం ఇప్పటికే 10ఎకరాల స్థలాన్నికేటాయించింది. దీనిపైన కూడా ఎలాంటి హామీ లేదు. విద్యుత్ బకాయిల వివాదం జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు చేరింది. తమకు తెలంగాణా డిస్కమ్‌లు రూ. 3813 కోట్లు బకాయిలు పడ్డాయని, అదివడ్డీతోకలుపుకొని రూ.4,500 కోట్లకు చేరుకుందని ఏపీ జెన్‌కో పిటీషన్ వేసింది. ప్రత్యేక సహాయంకింద రాష్ట్రానికి రూ.16,447 కోట్లు రావాల్సి ఉంది. దీనిపై బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. సవ్యాంధ్రలోటు రూ.16,079.76కోట్లుగా నిర్ధారించారు. కానీ దాన్ని రూ. 7,500 కోట్లు తగ్గించారు. అందులోనూ రూ.3,979 కోట్లు మాత్రమే చెల్లించారు. దీని ప్రకారం చూసినా మరో రూ.3,500 కోట్లకుపైగా కేంద్రం నుంచి రావాల్సి ఉంది. కానీ దీనిగురించి కూడా ఎక్కడా బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఈఏపీ కింద ఏపీ ప్రభుత్వం రూ.18,857 కోట్ల విలువైన ప్రతిపాదనలు పంపింది. వీటిల్లో రూ. 8,349 కోట్లు ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. రూ.7,611 కోట్ల విలువైన ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విభాగం కింద కేంద్రం నుంచి రూ.20,010 కోట్ల మేర కేంద్రం నుంచి ప్రత్యేక సహాయం రావాల్సి ఉంది. బడ్జెట్‌లో ఈ అంశంపై కనీసం ప్రస్తావన కూడా లేదు. విభజన జరిగి మూడున్నరేళ్లయినా కూడా 89కార్పొరేషన్లు, కంపెనీల ఆస్తులు,అప్పులు,ఉద్యోగుల విభజన జరగలేదు.

వాణిజ్యపన్నుల పంపిణీకి సంబంధించి విభజన చట్టంలోని సెక్షన్ 50,51,56 సవరణలు చేయాల్సి ఉంది. కాకినాడలో రూ.33 కోట్లతో పెట్రోకాంప్లెక్స్ ఏర్పాటు పెండింగ్‌లోనే ఉంది. వనరుల వ్యత్యాస విడుదలతో పాటు, షెడ్యూలు 13లో పేర్కొన్నసంస్థలు, ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు, కడపలో ఉక్కుకర్మాగారం, దుగరాజపట్నంలో ఓడరేవు అంశాలు ఎటూ తేలకుండానే ఉన్నాయి. ఇన్ని అంశాలు విభజనచట్టంలో ఉంటే వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్రం బడ్జెట్ రూపొం దించింది. కొత్త రాష్ట్రం, అనేక సమస్యలు ఉన్నా సరే సానుకూలవైఖరి ప్రదర్శించడంలో కేంద్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది.

ఇప్పటికైనా ప్రశ్నించాలి!

మూడున్నరేళ్లనుంచి కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలవైఖరినే అవలంభిస్తోంది. బిజెపితో తెగ తెంపులు చేసుకోవడం గానీ, పరుషంగా మాట్లాడటం గానీ చేయకుండానే కాలం వెళ్లదీస్తోంది. కేంద్రంతో వైరం పెట్టుకుంటే జరిగేది నష్టమేనని, సావధానంగా ఉంటూనే కావాల్సినవి సాధించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుఅనేక సందర్భాల్లో పేర్కొన్నారు. కానీ పుణ్యకాలం కాస్త పూర్తవుతోంది. ఇప్పటికే మూడు బడ్జెట్‌లుపూర్తయ్యాయి. నాలుగోది కూడా అయిపోయింది. ఇంకా సాచివేత ధోరణి వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. అసలు అమరావతి రాజధాని నిర్మాణ శంఖుస్థాపనకు వచ్చిన మోడీ చెంబుడునీళ్లు,పిడికెడు మట్టి ఇచ్చినపుడే ప్రశ్నించాల్సింది. ప్రత్యేక హోదా విషయంలో మాటతప్పిన మోడీని, వెంకయ్యను నిలదీయాల్సింది. ప్రత్యేక ప్యాకేజీ గురించి పట్టించుకోని కేంద్రంపై నిరసన తెలపాల్సింది. పోలవరంపై కిరికిరులు పెట్టినపుడైనా ప్రశ్నించాల్సింది. ఎపుడూ, ఎక్కడా కూడా పన్నెత్తి మాట అనలేదు. ఇపుడు అనే అవకాశంకూడా లేకుండా పోయింది. కేంద్రం దయాదాక్షిణ్యాలమీద ఆధారపడాల్సిన అగత్యం ఏర్పడింది. విభజనచట్టంలో ఉన్నవాటిని కూడా సాధించుకోలేని నిస్సహాయ స్థితిలో రాష్ట్రప్రభుత్వం ఉంటే ఇంకా రాష్ట్రానికి ఎలా మేలు జరుగుతుంది? ఇప్పటికైనాప్రశ్నించాలి. రాష్ట్ర ప్రయో జనాల కోసం పనిచేసే వారందరినీ కలుపుకొనికేంద్రంపై వత్తిడి తేవాల్సిన అవసరం ఏర్పడింది. బిజెపితో భాగస్వామ్యంగా ఉన్న తెలుగుదేశంపార్టీ ఎంపీలు పార్లమెంటులో తమగళాన్ని తెలుగు ప్రజల కోసం ఇకనైనా విన్పించాల్సిన అవసరం ఉంది. ఇపుడు కూడా సాచివేత ధోరణి అవలంబిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితులు వస్తాయి. అపుడు ఫలితాలు కూడా విషమంగానే ఉంటాయి. ప్రతిపక్షం, వామ పక్షాలు, ప్రజాసంఘాల మద్దతుతీసుకొని రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైనా హక్కుల్ని సాధించు కునే దిశగా ఇక పోరాడాల్సిన అవసరం ఏర్పడింది. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబే నాయకత్వం వహిస్తే బాగుంటుంది.

వ్యాస రచయిత : ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు,
విజయవాడ, సెల్ : 9848992299

దేశంలో మూడొంతులకు పైగా నగరాలు, పట్టణాల్లో వాయునాణ్యతకు తూట్లుపడ్డట్లు స్వయంగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలే నిర్ధారించింది. ఢిల్లీని తలదన్నేలా అత్యంత ప్రమాదకర నైట్రోజన్ ఆక్సైడ్ల విడుదలలో హైదరాబాద్ (రోజూ 69.51 టన్నులు) నెలకొల్పిన రికార్డు మనల్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. ఆ జాబితాలో భాగ్యనగరంతో పాటు విశాఖ, వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, గుంటూరు సైతం చోటు చేసుకోవడం తెలుగు వారందరినీ కలవరపరచేదే.

ఉసురు తీస్తున్న వాయువు

దేశంలో వాయుకాలుష్యం మృత్యురూపం దాల్చింది. దేశ రాజధాని నగరం ఢిల్లీతో సహా అనేక ప్రధాన నగరాలు, పట్టణాలు కాలుష్య భూతాలుగా మారిపోతున్నాయి. జనం ఈ కాటుకు విలవిల్లాడుతున్నారు. ఈ విషమ స్థితిగతులకు దర్పణం పడుతూ ఇటీవల ఢిల్లీలోని విద్యాసంస్థలు మూతపడ్డాయి. బస్సులు, రైళ్లు, విమానాలు కొన్ని రద్దయ్యాయి. ఢిల్లీలో వాయునాణ్యత సూచి 491కి చేరి పెనుప్రమాద ఘంటికలు మోగిస్తోంది. మితిమీరిన కార్లూ ద్విచక్ర వాహనాలు, ఇబ్బడిముబ్బడిగా డీజిల్ జనరేటర్లు, కుప్పలు పోసిన వ్యర్థాలు, చుట్టుపక్కల బొగ్గు కర్మాగారాలూ ఇటుక బట్టీలు... వీటికితోడు పంజాబ్, హర్యానా, యూపీల్లోని పొలాల్లో తగలబడుతున్న గడ్డి, అవశేషాలు– ఢిల్లీకి శ్వాస ఆడనివ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దేశ రాజధాని ప్రాంతంలో నిర్మాణ, పారిశ్రామిక కార్యకలాపాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్



కొన్నిరోజుల పాటు నిషేధాస్త్రం ప్రయోగించిందంటే పరిస్థితి ఎంతగా తీవ్రత దాల్చిందో అర్థం అవుతోంది. సుప్రీంకోర్టు నియమించిన కాలుష్య నివారణ నియంత్రణ సంస్థ తనవంతుగా చేసిన సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకునేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రాణాలు నిలబెట్టాల్సిన వాయువే విషకలుషితమైపోవడం వెనుక మానవ తప్పిదాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ ఉత్పాత తీవ్రత ఒక్క ఢిల్లీకే పరిమితం కాలేదు. వాయునాణ్యత సూచి ప్రాతిపదికన పరిసర ప్రాంతాల్లోని ఘజియాబాద్ (475), నొయిడా (468), ఫరీదాబాద్ (409), గురుగ్రామ్ (368)లనూ నవంబరు, డిసెంబరు మాసాల్లో కాలుష్య మేఘాలు కమ్మేశాయి. ఇప్పటికీ పరిస్థితుల్లో పెద్ద తేడా

లోచనం

ఏమీ లేదని సర్వేలు చెబుతున్నాయి. 'గ్రీన్‌పీస్ ఇండియా' ఇటీవలి అధ్యయనం ప్రకారం అలహాబాద్, బరేలీ, ఝరియా, రాంచీ, కాన్పూర్, పట్నా తదితర నగరాలూ వాయుకశ్మల నెలవులుగా మసిబారుతున్నాయి. దేశంలో మూడొంతులకు పైగా నగరాలు, పట్టణాల్లో వాయునాణ్యతకు తూట్లుపడ్డట్లు స్వయంగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలే నిర్ధారించింది. ఢిల్లీని తలదన్నేలా అత్యంత ప్రమాదకర నైట్రోజన్ ఆక్సైడ్ల విడుదలలో హైదరాబాద్ (రోజూ 69.51 టన్నులు) నెలకొల్పిన రికార్డు మనల్ని భయభ్రాంతులకు గురిచేస్తోంది. బహిరంగంగా చెత్తను తగలబెట్టినప్పుడు తలవెంట్రుక కంటే సన్నగా ఉండే పీఎం 2.5 ధూళి కణాలు నేరుగా ఊపిరితిత్తుల్లోకి చొరబడి అనారోగ్య కారకాలవుతాయి. ఆ జాబితాలో భాగ్యనగరంతో పాటు విశాఖ, వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, గుంటూరు సైతం చోటుచేసుకోవడం తెలుగువారందరినీ కలవరపరచేదే. దేశంలోని 90కి పైగా నగరాల్లోని గాలిలో విషధూళి కణాలు స్థిరంగా పెరుగుతున్నాయని నిర్ధారించిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి 42 అంచెల కార్యాచరణను ప్రకటించి చేతులు దులుపుకొంది. వాహన కాలుష్య నియంత్రణ, డీజిల్ శకటాల రద్దు, అడవుల పెంపకం లాంటి అంశాలు కాగితాలకే పరితమవుతున్నాయి తప్ప ఆచరణలోకి రావడంలేదు. ఫలితంగానే క్షేత్రస్థాయి పరిస్థితుల్లో గుణాత్మక పరివర్తన సాధ్యం కావడంలేదు. వాయు కశ్మలం గుండెను, మెదడును, శ్వాసకోశాలను, జీవనాడులనే దెబ్బతీసి పౌరుల ఆయుర్దాయాన్ని మూడేళ్లకు పైగా హరించి వేస్తున్నట్లు వైద్య, ఆరోగ్య అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వాహన, పారిశ్రామిక కాలుష్యాల కట్టడికి విస్పష్ట కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడంలో పాలకుల వైఫల్యం ఎంత ఉందో ఈ కాలుష్యానికి పౌరుల బాధ్యతారాహిత్యమూ అంతే ఉందనడంలో సందేహంలేదు. గాలి గరళమై నేల, నీటి కాలుష్యాలూ జతపడి ప్రపంచవ్యాప్తంగా ఒక్క ఏడాదిలో ఊపిరి ఆగిపోయిన అభాగ్యులు 90 లక్షల మంది ఉంటే, అందులో భారత్ వాటా పాతిక లక్షలు. అందులో అత్యధికంగా 18 లక్షలకు పైగా మరణాలు వాయు కాలుష్యం వల్లే జరిగాయి. అరున్నర దశాబ్దాల క్రితం నేటి ఢిల్లీని తలపిస్తూ పొగచూరిన లండన్‌ను పాలకులు చిత్తశుద్ధితో నేడు పరిశుభ్ర వాయువుకు నిలయంగా తీర్చిదిద్దారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ ఇటుక బట్టీల దుష్పరిణామాలపై జనంలో చైతన్యం పెంపొందించి, ఒకప్పటి విపరీత కలుషిత నగరం రాజ్‌షాహీని తెప్పరిల్లజేసింది. వాయుకాలుష్య మృతుల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో ఫిలిప్పీన్స్, వియత్నాం, పెరూ, ఉరుగ్వే ప్రభృత దేశాలు ఎన్నదగ్గ విజయాలు సాధించాయి. ప్రజారవాణా వ్యవస్థను తీర్చిదిద్ది, పర్యావరణ చట్ట నిబంధనల్ని పకడ్బందీగా అమలుపరుస్తున్న కెనడా, ఫిన్లాండ్, డెన్మార్క్, న్యూజిలాండ్ తదితర దేశాలు వాయు నాణ్యతకు చిరునామాలుగా విలసిల్లుతున్నాయి. సుమారు 15 వందల ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పరచిన చైనా వాయుకాలుష్య నియంత్రణలో ధీమాగా ముందడుగేస్తోంది. మన దేశంలో ఆ ప్రయత్నం ఇప్పటికైనా మొదలు కావాల్సిన తక్షణావసరం ఉంది. ఇందుకు పాలకులతో పాటు ప్రజలు కూడా దీక్షబూని వాహన, పారిశ్రామిక కాలుష్యాన్ని కనిష్ఠస్థాయికి తెచ్చేందుకు పూనుకోవాలి.

– జ్యోతి

రాజ్యమేలుతున్న అనైతిక రాజకీయాలు

అరుణ్ శ్రీవాత్సవ్

ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించిన వివాదాస్పద చిత్రం 'పద్మావత్'పై కర్ణిసేన, రాజ్‌పుత్‌ల దమనకాండను విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ సమర్థించడం హాస్యాస్పదంగా తోస్తోంది. ఏకాభిప్రాయం లేకుండా సినిమా తీస్తే నిరసనలు అనివార్యమన్న ఆయన వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. సేన గూండాల హింసను ఖండించాల్సిన ఆయన ఈ విధంగా వారి చర్యలను సమర్థించడం ప్రభుత్వ ద్వంద్వనీతికి అద్దంపడుతున్నాయి. సినిమా తీసే ముందు ప్రజామోదం అవసరమన్న ఆయన వాదన అర్థరహితం. అయినా దాన్ని ఆమోదించేది ఎవరు.. ఈ మిడిమిడి జ్ఞానంతో చెలరేగిపోయే దుస్సాహసులా? 'భావప్రకటన స్వేచ్ఛ ఉన్నది కదా అని చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదు' అన్న సింగ్ తన సొంత వ్యాఖ్యలను మర్చి వ్యవహరించడం శోచనీయం.. బాధాకరం. ఆయన మహామేధావి కాకపోయినా బాధ్యగల పదవిలో ఉన్న వ్యక్తి. కాబట్టి ఆయన ఆలోచనలు, వ్యాఖ్యల ప్రభావం ప్రజలపై ఉంటుంది. సింగ్ వ్యాఖ్యల్లో ఈచిత్రాన్ని తెరకెక్కించే ముందు భన్సాలీ వాస్తవాలను తెలుసుకోలేదన్న అర్థం కనిపిస్తోంది. అసలు ఆయన ఈ సినిమా చూశారా.. అది ఏ రచన నేపథ్యంలో తీశారో.. ఆ పుస్తకాన్ని చదివారా? ఏమో ! అయితే ఈ విషయాన్ని చాలా మంది తెలుసుకోవాలని అనుకుంటున్నారు. అదే విధంగా గుర్‌గావ్‌లో చిన్నపిల్లలు తమ టీచర్లతో కలిసి ప్రయాణిస్తున్న స్కూల్ బస్సును కర్ణిసేన దుండగలు తగలబెట్టేందుకు యత్నించడాన్ని ఆయన సమర్థించడం నిర్ఘాంతపర్చింది. ఆ హేయమైన చర్య ఆందోళనకారుల ఉన్మాదభరిత మనస్తత్వాన్ని ప్రతిబింబించింది.

రాజకీయాల్లోకి అడుగుపెట్టే వారంతా తమకు మించిన మేధావులు ఈ భూమిమీదే లేరని అనుకుంటుంటారు. సింగ్ కూడా అదే కోవకు చెందిన వారు. సింగ్ మాట్లాడుతూ 'ఎప్పుడైనా సరే వాస్తవాలను తెలుసుకున్న తర్వాత చరిత్ర గురించి మాట్లాడాలి. భావప్రకటన నెపంతో చరిత్రను మార్చడం, వక్రీకరించడం కుదరదు. సినిమాను వ్యతిరేకిస్తున్న వారందరినీ బుజ్జగించాలి. వారికి నచ్చజెప్పేందుకు యత్నించాలి. ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనాలి. వారికి అభ్యంతరం ఉన్న అంశాలు ఏమిటో తెలుసుకోవాలి. ఇలాంటి ఘర్షణాత్మక పరిస్థితులు గందరగోళానికి దారితీస్తాయి' అని అన్నారు. సింగ్ మాటల్లో దర్శక, నిర్మతాలు నిజనిజాలు తెలుసుకోకుండా చిత్రాన్ని తెరకెక్కించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల పద్మావత్ ప్రివ్యూ షోను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సినిమాను చూసినవారంతా దాన్ని ప్రశంసించారు. అందులో అభ్యంతరకర సన్నివేశాలేమీ లేవని స్పష్టంచేశారు. చిల్లర రౌడీలను సమర్థించకుండా ఈ స్వీయ ప్రకటిత చరిత్రకారుల వాదనలను వినేందుకు దర్శకుడు భన్సాలీ నిరాకరించడం వెనుక కారణాలను సింగ్ అన్వేషించాలి. వాస్తవాలను, తనకు తెలిసిన సమాచారాన్ని వెల్లడించాలి. ఇటీవలి కాలంలో సినిమాలను విమర్శించడం ఫ్యాషనైపోయింది. దర్శక, నిర్మాతలపై బురద జల్లి.. మిడిమిడి జ్ఞానమున్న వారు సెలబ్రిటీలుగా కొనసాగుతున్నారు. గుర్‌గావ్‌లో చిన్నారులు భయోత్పాతానికి గురైన ఆ సంఘటన పలువురిని కలిచివేసినప్పటికీ సింగ్ దాన్ని ఖండించలేదు. కర్ణిసేన నేతలైతే గూండాలతో తమకు ఏ సంబంధం లేదని చెప్పేశారు. అయితే ఇది కొత్తేమీ కాదు. వీరావేశంతో రెచ్చిపోయిన గూండాలతో తమ సంబంధాలను వారు బహిరంగంగా అంగీకరించలేరు కదా!

దేశంలో దాదాపు మూడు దశాబ్దాలుగా రాజీయాలు నైతిక విలువలను కోల్పోతున్నప్పటికీ తాజా పరిణామాలు నిర్ఘాంతపరుస్తున్నాయి. పెట్టుబడిదారీ, సామాజిక సిద్ధాంతాలేవీ దీనికి పరిష్కారం కాదు. అంతేకాకుండా సమాజంలో అసమానత్వం, అసహనం సవాళ్లుగా మారాయి. కాగా, ఆందోళనకారులు కర్రలు, రాళ్లతో దాడి చేస్తుంటే భయభ్రాంతులకు గురైన ఆ చిన్నారులు బిక్కుబిక్కుమంటూ బస్సులోని సీట్ల కింద నక్కికూర్చున్న ఆ దృశ్యం ప్రభుత్వ అలక్ష్యానికి, హింసాత్మక ఘటనలపై ప్రజల అలసత్వానికి అద్దంపడుతోంది. నైతికతను కోల్పోతున్న రాజకీయాలు... రాజకీయ అలసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఏదిఏమైనా తాజా పరిణామాల దృష్ట్యా రాజకీయ వ్యవస్థపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోతున్నారు. సామాన్యుల్లో రాజకీయాలంటే విముఖత ఏర్పడుతోంది. స్వీయప్రయోజనాలు, స్వలాభం కోసం జిత్తులు, కుయుక్తులకు తెరతీసేవారికి తప్ప మరెవ్వరికీ రాజకీయాలు రుచించడం లేదు.

పాశ్చాత్య దేశాలైన అమెరికా, యూరప్‌లలో ప్రజలు రాజకీయ అలసత్వం గురించి మాట్లాడుకుంటారు. నేతల పతనంతో ఇది జరుగుతుంది. అయితే, తమ ఆకాంక్షలను రాజకీయ వ్యవస్థ పట్టించుకోవడం లేదన్న విషయం అక్కడి ప్రజలు జీర్ణించుకోలేరు. ఈ విషయంలో భారత్–అమెరికా, యూరప్ దేశాల మధ్య చాలా తేడా ఉంది. మనదేశంలో రాజకీయ సంక్షోభం గురించి, దిగజారుడు వైఖరి, పడిపోతున్న ప్రమాణాల గురించి మాట్లాడుకుంటామే తప్ప మార్పు గురించి మాట్లాడేలా రాజకీయ వ్యవస్థపై ఒత్తిడి తీసుకురాలేం. పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగించడం నేడు సర్వసాధారణమైంది. మన్మోహన్ సింగ్ హయాంలో బీజేపీ సీనియర్‌నేత ఎల్‌కే అద్వానీ నేతృత్వంలో ఇది ప్రాచుర్యం పొందింది. రాజకీయాలు ఎందుకు ఇంతగా దిగజారుతున్నాయన్న దానిపై ఆత్మ విమర్శ అవసరం. రాజకీయాల్లోగానీ, కార్పొరేట్ ప్రపంచంలోగానీ అవినీతి, కుంభకోణాలు తారస్థాయిలో వెలుగుచూస్తున్నాయి. రాజకీయాలు.. అవినీతి, కుట్రలు, కుతంతాలకు చిహ్నామయ్యాయి. అధికారాన్ని పొందే క్రీడగా తయారయ్యాయి. నాయకులు మంచి, చెడు అన్న తేడాను మర్చి మనస్సాక్షిని చంపుకొని వ్యవహరిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. పూర్వం మనస్సాక్షి గురించి గొప్పగా మాట్లాడేవారు. కానీ నేటి ఆధునిక యుగంలో మనిషి తన అంతరాత్మను, మనస్సాక్షిని మర్చి ముందుకు సాగిపోతున్నాడు. కుటుంబ బంధం, సామాజిక బాంధవ్యాలకు విలువలేకుండా పోయింది. గతంలో ప్రతి ఒక్కరూ నీతిగా నిజాయితీగా బతకాలనుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అలాగే నాడు నైతికతన్నది ఇంటి నుంచి సమాజం వరకు విస్తరించేది... కాని నేడు అది కనుమరుగయ్యే ప్రమాదముంది. నేడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అనాసక్తి, విముఖత స్పష్టమవుతున్నాయి. దేశంలో మేధో సంపత్తి, రాజ్యాంగబద్ధ, నైతిక విలువుల అణచివేతకు, దోపిడీకి గురవుతున్నాయని బహిర్గతపర్చి తమ హక్కులను, నైతికతను పరిరక్షించుకోవాలని ప్రజలకు తెలియజెప్పడం ఎంతైనా అవసరం.



వీరనగరం స్టాలిన్ గ్రాడ్

జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్ మానవాళి యావత్తునూ తన కబంధ హస్తాల క్రింద ఉంచుకుని, నాజీయిజాన్ని వ్యాప్తిచేసి, యూదు, స్లావ్, మరిన్ని జాతులను నామరూపం లేకుండా బుగ్గిచేయ తలపెట్టిన ప్రపంచ సంగ్రామం 1941లో ప్రారంభమైంది.

ఆ సంగ్రామంలో భాగంగా, ఆ దాడిని వీరోచితంగా అడ్డుకుని హిట్లరు సేనలను తిప్పికొట్టి ఆ యుద్ధాన్ని గొప్ప మలుపు తిప్పిన స్టాలిన్ గ్రాడ్ వద్ద పోరాటం జరిగి నేటికి 75 సంవత్సరాలు గడిచాయి.

హిట్లరు సోవియట్ రష్యామీదకి దండయాత్రకు పూనుకొని 76 సంవత్సరాలు పైగా గడిచింది. నాలుగు వారాలలో ఆక్రమించుకుని, 6 నెలల్లో పూర్తిగా ఆధీనంలోకి తెచ్చుకుని జర్మన్ ప్రజలకు ఇంకా విస్తరించడానికి అదనపు నేల, అదనపు వనరులు కలుగజేస్తానని, యూదులను, స్లావ్ జాతిని నిర్మూలించడంతోబాటు బోల్షివిక్కులను లేకుండా చేస్తానని బీరాలు పలికాడు. సోవియట్‌లో ఎదురు మాట్లాడకుండా మేధావి వర్గాలను కూడా నాశనం చేయాలని నిర్ణయించాడు. అందుకు అనుగుణంగా సైన్యానికి ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో యూరప్ దేశాల మీదకి దండెత్తినప్పుడులా కాకుండా సోవియట్‌మీద దండయాత్రలో సైనికులను బందీలుగా పట్టుకోకుండా చంపివేయడానికి, రష్యన్ పౌరులను ఊచకోత కోయడానికి కాల్బలం వెంట ప్రత్యేక దళాలు కూడా నియమించబడ్డాయి.

యూరప్‌ను తేలికగా జయించిన ధీమాతో అవే దళాలు, అదే కమాండర్ల నాయకత్వంలో వచ్చాయి. మెరుపుదాడితో ప్రారంభంలో తేలికగా చాలాదూరం చొచ్చుకుపోయింది జర్మన్ సైన్యం. కానీ తర్వాత, సరైన శిక్షణలేని సరైన ఆయుధాలు లేని బలహీనమైనదనుకునే ఎర్రసైన్యం, దానికి మద్దతుగా ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడి తమ దేశాన్ని, తమ సోషలిస్టు రాజ్యాన్ని కాపాడుకోవాలనే ధృడసంకల్పంతో, అకుంఠిత దీక్షతో సోవియట్ ప్రజలు సాగించిన ప్రతిఘటనతో అనుకున్నట్లు తేలికగా చొచ్చుకుపోలేకపోయారు. ఒక నెలరోజుల మెరుపు యుద్ధంతో సోవియట్ ప్రతిఘటన అంతమవుతుందని భావించిన ఊహలకు గండిపడింది.

ఒకవైపు భీకర యుద్ధం జరుగుతుండగానే, గట్టి ప్రతిఘటన ఇస్తూనే ఎప్పటిలాగే ఆ అక్టోబరులోనూ మాస్కో రెడ్‌స్క్వేర్‌లో విప్లవ వార్షికోత్సవం నిర్వహించారు. స్టాలిన్ ప్రసంగం, సైనిక కవాతు తర్వాత అక్కడినుండే సైనిక దళాలు సరాసరి యుద్ధభూమికి నడిచాయి. అంతటి నమ్మకం, ధైర్యంతో, దీక్షతో ఉన్నారు సోవియట్ సైనిక దళాలు, ప్రజలు. అంతవరకు యూరప్‌లో పెద్దగా ఎదురులేకుండా చొచ్చుకుపోయిన జర్మన్ సైన్యం ఇంత బలంగా సోవియట్లు ప్రతిఘటిస్తారని ఊహించలేదు.

మాస్కోమీద దండయాత్రలో గట్టి ప్రతిఘటన ఎదురుకావడంతో హిట్లర్ ఎత్తుగడ మార్చాడు. ఉన్నచోటు నుంచే మాస్కో మీదికి దూసుకుపోయే ప్రయత్నం విరమించుకుని, అక్కడ యుద్ధం కొనసాగిస్తూనే ఉత్తరాన విప్లవ



సారధి లెనిన్ పేరుగల మహానగరం లెనిన్‌గ్రాడ్‌ను, అలాగే దక్షిణాన చమురుక్షేత్రాలు, ఓల్గానది ఒడ్డున ఉన్న పారిశ్రామిక నగరం, పైగా సోవియట్ నాయకుడు స్టాలిన్ పేరుతో ఉన్న స్టాలిన్‌గ్రాడ్, పక్కనే రష్యా దిగువ ప్రాంతాలకు ధాన్యం, వ్యవసాయ యంత్రాలు, రసాయనాలు లాంటి నిత్యావసరాలు చేరవేసే ఓల్గానది రవాణా వ్యవస్థను స్వాధీనం చేసుకోవడం ఆ ఎత్తుగడ.

ఆ విధంగా ఎక్కువ భూభాగాన్ని ఆక్రమించుకుని, చమురు గనులు లాంటి ఆర్థిక, అత్యవసర వ్యవస్థలను, ప్రతిష్ఠాత్మకమైన ప్రధాన నగరాలను చేతిలో పెట్టుకుని మాస్కోమీదకి వెళ్తే కుంగుబాటుతో సోవియట్ ప్రభుత్వం లొంగిపోక తప్పదని తప్పుడు భావనకు వచ్చాడు.

అలాగే స్టాలిన్‌గ్రాడ్ పతనం తర్వాత దిగువనుంచి కూడా మాస్కోను చుట్టుముట్టడానికి మార్గం దొరుకుతుంది. బాకూ నూనెగనులకు, భారతదేశానికి, ఇరాన్‌కు, చైనాకు చెందిన టర్కిస్తాన్‌లో జపాన్ వాళ్లనూ కలుసుకునేందుకు అది కవాటం తెరుస్తుందనేది కూడా ఒక ఆలోచన.

హిట్లర్ కొత్త పథకం ప్రకారం ముందు లెనిన్‌గ్రాడ్ (ఇప్పుడు సెయింట్ పీటర్స్‌బర్గ్) మీదకి దండయాత్ర సాగించాడు. అయితే నగరాన్ని ఆక్రమించుకుని, మళ్లీ వాళ్లకు ఆహారం అందించే అవసరం లేకుండా, ఆహారం, నిత్యావసర వస్తువులు అందకుండా నగరాన్ని దిగ్బంధం చేసి తన నగర సర్వనాశన పథకంలో భాగంగా ఆకలితో, శీతాకాలపు గడ్డకట్టే చలితో చనిపోయేలా, అలా నగరాన్ని ఖాళీ చేసేలా ఆలోచన చేశాడు. అలా 900 రోజులు సాగిన ఆ దిగ్బంధంలో ఆహార కొరతతో, వ్యాధులతో, చలితో 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు.

ఈలోగా స్టాలిన్‌గ్రాడ్ వద్ద ఉన్న 1500 వరకు కర్మాగారాలు, వాటితోబాటు అవసరమైన కార్మికులు, చిన్నపిల్లలు, అక్కడ అంత అవసరం లేని పౌరులను తరలించడం ప్రారంభించారు. అటు తరలింపు, అదే రైలులో ఇటు సైనికులరాక జరిగింది. కర్మాగారాలను దూరాన ఉన్న యూరల్సుకు తరలించి అక్కడ ఉత్పత్తి ప్రారంభించారు. యుద్ధానికి అవసరమైన ట్యాంకులు, సైనిక సామాగ్రి కూడా ఉత్పత్తి జరిగి అక్కడి నుండి యుద్ధ రంగానికి సరఫరా అవుతున్నాయి.

అక్కడే కాకుండా స్టాలిన్‌గ్రాడ్‌లోనే ఉన్న ఫ్యాక్టరీలలో కూడా యుద్ధసామగ్రి యుద్ధం చివరివరకు తయారయ్యింది. జర్మన్ సైన్యం ఫ్యాక్టరీగేట్ల వరకు వచ్చేవరకు కూడా ట్యాంకులు తయారవుతూనే ఉండి వెంటనే రంగంలోకి దిగిన సందర్భాలు ఉన్నాయి. ఒక్కోసారి తయారుచేసిన కార్మికులే వాటితోబాటుగా వచ్చి యుద్ధంలో పాల్గొన్న సందర్భాలు అనేకం.

1942 జూలైలో భారీ బాంబుదాడులతో స్టాలిన్‌గ్రాడ్ వద్ద యుద్ధం ప్రారంభమైంది. జర్మన్ సైనికదళాలు చేరుకునేలోగా ముందుగా జర్మన్ విమానాలు బాంబులతో స్టాలిన్‌గ్రాడ్‌ను ముంచెత్తాయి. ఒక్క 48 గంటల వ్యవధిలోనే వెయ్యి టన్నుల బాంబులు కురిపించి, వేలకొలది ప్రజల ప్రాణాలు తీస్తూ నగరాన్ని రాళ్లగుట్టలుగా మార్చారు.

ఇంతటి ఉధృతమైన వైమానికదాడి ప్రపంచంలో మరెక్కడా జరగలేదు. ఆఖరికి లండన్‌మీద సాగిన 'బిల్జిక్రిగ్' దాడి కూడా ఇంత ఉధృతం కాదు. ఆ తరువాత కూడా ఉధృతమైన విమానబాంబుదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్కోరోజు 3000 విమాన సార్టీలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఆ వెంటనే సెప్టెంబరు మొదటిలో జర్మన్ సైన్యాలు నగరంలో అడుగుపెట్టిన తరువాత విమానదాడులు కొనసాగినా, మామూలు యుద్ధానికి కొంత భిన్నంగా అక్కడ ఒక నూతన పట్టణ యుద్ధం ప్రారంభమైంది.

జర్మన్ యుద్ధతంత్రంలో అన్ని రకాల సైనిక విభాగాలు ట్యాంకులు, సైనికులు, ఫిరంగులు వాటికి అవసరమైనచోట బాంబులు వేసే యుద్ధవిమానాలు అన్నీ కలిసికట్టుగా పరస్పర సహకారంతో మెలగడం పద్ధతి. కానీ ఎప్పుడైతే వైమానిక దాడులలో నగరం రాళ్లగుట్టలుగా తయారైందో అప్పటినుండి జర్మన్ శకటాలు వేగంగా అనుకున్నచోటికి చేరడానికి అవరోధం ఏర్పడింది.

ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకుని, ఈ జర్మన్ యుద్ధతంత్రాన్ని నిర్వీర్యం చేయడానికి అక్కడి సోవియట్ సేనాని జనరల్ చుయ్‌కోవ్ తన సేనలను మామూలు యుద్ధపద్ధతులకు భిన్నంగా వీలైనప్పుడల్లా జర్మన్ సైన్యంతో దగ్గరదగ్గరగా ఉండి ముఖాముఖీ పోరాడమని ఉత్తర్వులు ఇచ్చాడు. దీనివలన జర్మన్ కమాండర్లు వాళ్ల సైనికులకు కూడా ముప్పు కలిగే విధంగా విమానాలను బాంబులు వేయడానికి ఉపయోగించరు. దానివలన ప్రాణనష్టం తక్కువగా ఉంటుంది. ఆ తర్వాత అక్కడ యుద్ధం చాలాభాగం ఇలానే సాగింది. దాంతో జర్మను సైనికుల రోజువారీ పురోగమనం మందగించి ఎంతదూరం పురోగమించారో మైళ్లలో చెప్పడంపోయి గజాలలో చెప్పే పరిస్థితి ఏర్పడింది.

ఇలా సోవియట్ సైనికులు, పౌరులు కూడా పట్టుదలతో, ధృడసంకల్పంతో గట్టిపోటీ ఇస్తూ పోరాడుతూనే ఉన్నారు. నగరం పూర్తిగా జర్మన్ బలగాల చేతిలోకి పోకుండా అదనపు సైనిక బలగాలు కూడా ఎప్పటికప్పుడు ఓల్గా నదిని దాటివచ్చి చేరుతూనే ఉన్నాయి. ప్రతి కట్టడంకోసం భీకర పోరాటం జరుగుతూనే ఉన్నది. ఒక్కోసారి రోడ్లపక్కన మురుగుకాల్వలపై ఆధిపత్యం కోసం కూడా పోరాటం జరిగింది. జర్మన్ సైనికులే ఈ పోరాటాలకు ఆశ్చర్యపోయి వీటికి 'ఎలుకల పోరాటం' అని పేరు కూడా పెట్టుకున్నారు.

ఒక్కోసారి ఒక్క ఇంటికోసం 15 రోజుల పోరాటం కూడా జరిగింది. వంటిల్లు గెలుచుకుంటే, బాత్రూం కోసం, హాలుకోసం పోరాటం, హాలు గెలుచుకుంటే సామాన్ల గది కోసం పోరాటం ఇలా మరోచోట అంతస్తు అంతస్తుకూ పోరు. బాంబుల దాడిలో పైకప్పు పోయిన భవనంలో ఒకరు పై అంతస్తులో, మరొకరు క్రింది అంతస్తులో మధ్యస్లాబుకు పడిన చిల్లుల నుండి కాల్పులు, చేతిబాంబుల దాడులు ఇలా అటూఇటూ చేతులు మారడం, సెంట్రల్ రైల్వేస్టేషనులో అయితే ఇలాంటి యుద్ధంలో స్టేషను బిల్డింగు 15సార్లు చేతులు మారింది. ఒక్కరోజులోనే నాలుగుసార్లు కూడా!

అలాంటి మరో ప్రదేశం స్టాలిన్‌గ్రాడ్ సెంటరులో ఉండి చుట్టూ ఉండే చాలా ప్రాంతపు స్టెప్పీ మైదానాలు కనిపించే 'మమయేవ్ కూర్గాన్' గుట్ట. ఇది ఎన్నిసార్లు చేతులుమారిందో లెక్కలేదు. ఎంతగా ఇక్కడ బాంబుదాడులు జరిగాయంటే బాంబుదాడుల తాలూకు ఇనపముక్కలు, రజను చొచ్చుకుని నేలంతా నిండిపోయింది యుద్ధం ముగిసిన తర్వాత కొంతకాలం వరకు అక్కడ గడ్డి కూడా మొలవలేదు. ఇప్పటికీ ఇంకా అక్కడ తవ్వకాలలో మనుషుల ఎముకలు కనబడుతున్నాయని చెబుతారు. అంతలా అక్కడ భారీ పోరాటం జరిగింది. ఇక్కడ ఒక ఇంటిని గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటారు. దానిపేరే 'పావ్లావ్' ఇది వోల్గానదీ తీరానికి 300 మీటర్ల దూరంలోనే నాలుగురోడ్ల సెంటరు ఎదురుగా నాలుగు అంతస్తుల భవనం. అక్కడ ఒక ప్లాటూన్ సైన్యం సార్జంట్ పావలోవ్ నాయకత్వంలో మొక్కవోని పట్టుదలతో 59 రోజులపాటు అదనపు బలగాలు వచ్చేవరకు ఆ ఇంటిని కాపాడుకుంటూ వచ్చారు. బిల్డింగ్‌పైన ట్యాంకులను పేల్చే ఫిరంగి పెట్టారు. క్రింది నుంచి దానిని పేల్చాలన్నా అక్కడ ట్యాంకుల గొట్టాలు అంతపైకి తిరగలేవు. దాంతో పేల్చే సాహసం చేయలేదు. కిటికీలలో మెషీన్‌గన్నులు పెట్టారు. చుట్టూ నేలలో మైన్సు ఏర్పాటు చేశారు. దాంతో ఎవ్వరూ దానిని ఆక్రమించడానికి సాహసం చేయలేదు. దాన్ని అప్పుడు 'దుర్గం' అని పిలుచుకునేవారు. ఇప్పుడు ఆ భవనం అక్కడ పర్యాటక ప్రదేశాలలో ఒకటి.

ఇలా జర్మన్ సైన్యాలకు అడుగడుగునా గట్టిపోటీ ఇస్తూ సోవియట్ సైన్యాలు పోరాడుతూనే ఉన్నారు. తమ ఆధీనంలో ఉన్నది ఒకచోట శత్రువశమైతే వెంటనే శిధిలాలలో మరో ప్రదేశం నుండి పోరాటం జరుపుతూనే ఉన్నారు. అయినా అక్టోబరు చివరినాటికి దగ్గరదగ్గర 90 శాతం శత్రు ఆధీనంలో ఉన్నది. జర్మన్లు ఇంకా సోవియట్ సైన్యాలమీద మరింత ఒత్తిడి పెంచడానికి తమ సైన్యాలను మధ్యలో కొద్ది ప్రదేశంలోనే మొహరించి, అటూఇటూ పార్శ్వాలలో ఇటాలియన్, రొమేనియన్ సైన్యాలను రప్పించి మొహరించారు. ఇక యుద్ధం ముగింపు కోసం చివరగా సోవియట్లు ఆధీనంలో ఉన్న ఫ్యాక్టరీలు ఉన్న ప్రాంతం మీద నవంబరు 11న దాడి ప్రారంభించారు.

ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటే సోవియట్ రష్యా అధినాయకత్వం మరోచోట నుండి ఎదురుదాడికి చురుకుగా, పకడ్బందీగా సన్నాహాలు ప్రారంభించింది. స్టాలిన్‌గ్రాడ్ వద్ద ఎదురుదాడికి సిద్ధం చేయడానికి స్టాలిన్ తమ ఉపసైన్యాధ్యక్షుడు మార్షల్ ఝుకోవ్‌ను దక్షిణ ప్రాంతానికి పంపించారు. అయన అక్కడి సేనాధిపతి జనరల్ వాసిలోవిస్కీతో కలిసి అక్కడ పరిస్థితులననుసరించి యుద్ధరంగంలో అనుసరించాల్సిన పద్ధతిపై అవసరమైన ప్రణాళిక సిద్ధం చేసుకుని స్టాలిన్‌గ్రాడ్ వెలుపల ఉన్న స్టెప్పీ బయళ్లలో మొహరించారు. నవంబరు 19న ఒకవైపు నుండి, నవంబరు 20న మరోవైపు నుండి సైనిక చర్య ప్రారంభించి జర్మన్ సైన్యాలకు రెండు పార్శ్వాలలో ఉన్న ఇటాలియన్, రొమేనియన్ సైన్యాలను ఛేదించి నవంబరు 23 కల్లా 2,50,000 మంది జర్మన్ సైనికులను దిగ్బంధం చేశారు. అదే సమయంలో మరో ప్రాంతం నుండి అక్కడకు జర్మన్ అదనపు సైన్యాలను తరలించకుండా ఆయా ప్రాంతాలలోనూ ఏకకాలంలో దాడులు ప్రారంభించారు. అయినా దిగ్బంధాన్ని ఛేదించడానికి డిసెంబరు 12న జర్మన్ సైన్యాలు ప్రయత్నించినా సాధ్యంకాలేదు. డిసెంబరు 16వ తేదీన మరొకసారి సోవియట్ సైన్యాలు మరో ఎదురుదాడి ప్రారంభించి అది కూడా సాగకుండా చేశాయి.

అంతటితో స్టాలిన్‌గ్రాడ్‌లో ఉన్న జర్మన్ సైనికుల పరిస్థితి పూర్తిగా తిరగబడింది. ఇప్పుడు వాళ్లమీద సోవియట్ విమానాలు దాడులు జరుపుతున్నాయి. ట్యాంకులు గర్జిస్తున్నాయి. రష్యన్ వీరుల గజం గజంకు పోరాటం, మందుగుండు సామాగ్రి నిండుకుంది. ఇంధనం కొరత, తిండి లేదు. ఈ పరిస్థితిలో ఇక లాభం లేదని వాళ్ల కమాండ్ జనరల్ పౌలస్ లొంగిపోవడానికి హిట్లర్‌ను పర్మిషన్ కోరాడు. హిట్లర్ అందుకు ఒప్పుకోకుండా జనవరి 30న పౌలస్‌ను ఫీల్డ్‌మార్షల్‌గా ప్రమోట్ చేశాడు. ఇంతవరకు ఎక్కడా జర్మన్ ఫీల్డ్‌మార్షల్ స్థాయి మిలిటరీ అధికారి పట్టుబడడం జరుగలేదు. కనుక పౌలస్ లొంగకుండా చనిపోయేవరకు పోరాడడంగానీ లేదా ఆత్మహత్య చేసుకుంటాడని హిట్లర్ ఊహ. కానీ మర్నాడే సోవియట్ రక్షణ దళాలకు తను కార్యకలాపాలు జరిపే ప్రధాన స్థానంలో (ఒక మార్కెట్ బిల్డింగులో) పట్టుబడ్డాడు. ఫిబ్రవరి 2వ తేదీన చివరి జర్మన్ పోరాటం ఆగిపోయింది. ఫీల్డ్‌మార్షల్ పౌలస్ మరో 23 మంది జనరల్స్, 2,500 మంది ఇతర మిలిటరీ అధికారులు, 90 వేలమంది సైనికులతో అధికారికంగా లొంగిపోయాడు.

అలా పశ్చిమదేశాల సైనిక మేధావులు ఊహించినట్లు 6 నుండి 8 వారాలలో రష్యా జర్మన్ వశమవలేదుగానీ సోవియట్ రష్యా కూడదీసుకుని 5 నెలల్లో స్టాలిన్ గ్రాడ్ వద్ద చావుదెబ్బ తీసి రెండవ ప్రపంచ యుద్ధాన్ని మలుపుతిప్పి జర్మనీలోని బెర్లిన్‌లో ముగింపు పలికింది. ఈ మారణహోమంలో స్టాలిన్‌గ్రాడ్ రష్యన్లు 5 లక్షల వరకు చనిపోయారు. 6 1/2 లక్షలు గాయపడ్డారు. జర్మన్లు, వారితోటి సైన్యాలు 6 1/2 నుండి 7 1/2 లక్షల వరకు చనిపోవడమో, గాయపడడమో జరిగింది. 90,000 మంది లొంగిపోయారు.

దేశాన్ని కాపాడడంలో స్టాలిన్‌గ్రాడ్ నగర ప్రముఖపాత్రకు గాను 1945లో 'హీరోసిటీ ఆఫ్ సోవియట్ యూనియన్' ప్రకటించారు. ఆ యుద్ధంలో అసువులు బాసిన యుద్ధవీరుల స్మృతిగా ఒక పెద్ద స్మృతి చిహ్నసముదాయాన్ని మమయేవ్ కూర్గాన్ కొండ వద్ద నిర్మించారు. అందులో 'సోవియట్ మాత' తనవాళ్లను మాతృభూమిని రక్షించడానికి సమాయత్తంకండి అని పిలుస్తున్నట్లుగా 172 అడుగుల ఎత్తు భారీ మహిళ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 85 అడుగుల ఎత్తుకు గాలిలో లేచే ఆమె చేతిలోని ఖడ్గం మొన అక్కడి ప్రత్యేకత.

ఇక్కడ మహిళా సైనికుల గురించి, శిక్షణ తీసుకుని యుద్ధంలో ప్రవేశించిన మహిళల గురించి కూడా ప్రత్యేకంగా చెప్పకోవాలి. యుద్ధరంగంలో పురుషులు పోరాడుతుంటే మహిళలు లోతట్టున ఫ్యాక్టరీలలో, పంట పొలాల్లో ఉత్పత్తి చూసుకోవడంతోబాటు అనేకమంది ట్రైనింగ్ తీసుకుని యుద్ధరంగంలో పనిచేశారు. ట్యాంకులు నడిపారు. మెషీన్‌గన్నులు ఉపయోగించారు. విమాన విధ్వంసక శతఘ్నుల దళాలుగా పనిచేశారు. యుద్ధ విమానాలు నడిపారు. గురిచూచి కాల్చడంలో నేర్పు చూపించారు. యుద్ధరంగం నుండి క్షతగాత్రులను తీసుకువచ్చి సేవచేసే నర్సులుగా పనిచేశారు. అలా అన్నీ యుద్ధానికి సంబంధించిన అన్ని విభాగాలలోనూ రాణించారు.

స్టాలిన్‌గ్రాడ్ పేరును తర్వాత వోల్గోగ్రాడ్ అని మార్చినా గత కొంతకాలంగా స్టాలిన్‌గ్రాడ్ విజయోత్సవదినం, రష్యా విప్లవదినం లాంటి ఆరు ప్రత్యేకమైన రోజులలో ఆ నగరాన్ని స్టాలిన్‌గ్రాడ్ అని అధికారికంగా వ్యవహరిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధాన్ని గతితప్పిన స్టాలిన్‌గ్రాడ్ వద్ద యుద్ధం ముగిసి 75 సంవత్సరాలు నిండాయి. ఆనాడు యుద్ధాల వలన జరిగిన అపార నష్టాన్ని చూసి, స్వయంగా అనుభవించి ప్రపంచ ప్రజలంతా మరోసారి ఇలాంటి పరిస్థితులు రాకూడదని, ప్రపంచం శాంతి, సౌభాగ్యాలతో మెలిగే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. కానీ ఇప్పటికీ అందుకు భిన్నంగానే జరుగుతున్నది. మళ్లీ నాజీ అనుకూల శక్తులు బయటకు వచ్చే సాహసం చేస్తున్నాయి. కొన్నిచోట్ల విజృంభిస్తున్నాయి కూడా. గత సోవియట్ యూనియన్‌లో భాగమైన కొన్ని దేశాలలో తమను విముక్తి చేసిన వారిని మరిచి నాజీలకు సహకరించిన వారికి జేజేలు పలుకుతున్నారు. వారికి పరోక్షంగా ఆయా ప్రభుత్వాల మద్ధతూ లభిస్తోంది.

దేశభక్తియుత మహాయుద్ధంలో జర్మనులకు సహకరించిన బందెరాకు, నాజీసైన్యం ఊచకోత ప్రత్యేక దళాలలో గతంలో పనిచేసిన రోమన్ ఝుకోవిచ్‌కు 'ఉక్రెయిన్ వీరుడు' బిరుదులు ఇవ్వడం, కుంటిసాకులతో జార్జియాలో యుద్ధంలో అమరులైన జార్జియన్ వీరుల స్మారకార్థం నిర్మించిన స్మారక చిహ్నాన్ని కుంటిసాకులతో మరోచోటికి తరలించడం కొన్ని ఉదాహరణలు మాత్రమే.

వీటితోబాటు చాలాదేశాలలో ఆధిపత్యం కోసం మతం పేరుతో, జాతులపేరుతో కవ్విస్తూ ఘర్షణలు లేవనెత్తడం ఈ కాలంలో పెరిగింది. ఇవి ఇలాగేసాగి మరో ప్రపంచయుద్ధం గనుక అనివార్యమైతే ఈసారి ఏ ప్రాంతం అందుకు అతీతంగా ఉండదు. అందులో అందరూ సమిధలు కావడం తథ్యం. అందుకే ప్రతి ఒక్కరూ ఈ మహాసంక్షోభాన్ని నివారించుకోడానికి విజ్ఞతతో నడుం బిగించవలసిన సమయం ఆసన్నమైంది.

– చంద్ర ప్రసాద్







డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఈ కొత్త అతన్ని మధిరవాడ జమీతాలూకు పాతబిల్లు మక్తాకౌలు కదపాలు చదవమన్నాను - వెట్టి చాకిరీలు మేము విధిగా జమిందారుగారి దివాణంలో చేయగలవారము అని, రైతుల వద్దనుంచి వ్రాయించి పుచ్చుకున్నారేమో చూదాం అని. తెలుగునే ఉన్నాయి కాగితాలు- "రాముని తోక- పివరుం డిట్లనియే" అన్నట్టు చదివేడు. "ఏమిటండీ- మీరు చదువుతున్న భాష?" అని అడిగేను. "గొలుసుకత్తు దస్తూరీఅండీ-పాలకొండ శిష్ఠకరణం ఎవడో వ్రాసినట్టున్నాడు" అన్నాడు! అక్కడితో అయిందా? నేనేదో వ్రాసుకుంటుంటే - పని గట్టుకువచ్చి బారిష్టరుగారూ! 'స్పేస్ సక్సెషనిస్' అన్నాడు - స్పెల్లింగు తప్పా - అచ్చు పిశాచమా - ఏమిటండీ ఇది?" అన్నాడు.

(నిన్నటి సంచిక తరువాయి)

ఏమిటి అనడం? రేపు స్వరాజ్యం వస్తే శాస్త్రకారులూ వీరే - న్యాయాధిపతులూ వీరే ! నేను రామయ్యగారికి జూనియరుగా ఉన్నప్పుడా - వేళ్ళు అరిగిపోయినట్టు వ్రాయించేవాడు కదూ- పిటిషనులేమిటి, షెడ్యూళ్ళేమిటి, ప్లెయింటు లేమిటి - చిన్నతనంలో ఓనమాలు ఇటికె గుండంలో దిద్దిదిద్ది వేళ్ళు అరిగిపోయినట్టు! ఇక- తెలుగు టైపు మెషీనులు వస్తే మా బాబిగాడు గుణింతమే వద్దంటాడు !- బాబిగాడు అంటూ మాకుంటే !

కట్ట తీసి జూనియరు తయారుచేసిన తాత్పర్యం చదివేను.

తల్లికి ఆస్తిలో కొడుక్కి ఎంత హక్కుందో, దాయాదికి కూడా అంతమాత్రమే హక్కు. ఇది పైవాళ్ళకి వ్రాసి ఇవ్వడానికి హక్కు విభక్తం చేయడానికిగాని వీలులేదు. విధవ స్త్రీ మరణించిన తరువాతనూ, ఆమె మరణానంతం దాయాది బ్రతికివుంటేన్నూ అతనికి యీ హక్కు ప్రాప్తం అవుతుంది. నామకాగా ఈ హక్కును మరొకరికి త్రిప్పి వ్రాయడంగాని వదులుకోవడంకాని చెల్లదు. కాని ఇటువంటి హక్కును బదిలీ చేయడం కుటుంబ ఆస్తుల పారీభత్తులప్పుడుగాని, ఒక అస్తి విషయమైన తగాదాలో రాజీ పరిష్కారమప్పుడు గాని జరిగిన ఎడల తప్పనిసరిగా చెల్లదు అని చెప్పడానికి మాత్రం వీలులేదు."

"రెండో మాటు చదివేను - కొరుకుడుబడలేదు. ఇదేమిటి - ఏకసంతగ్రాహిని అంటారే నన్ను - బుర్రలోకి ఎక్కడం లేదేమిటి? - పొరుగువారింటికి సంగీతాచార్యులు ఇప్పుడే రావాలా? "సస-రిరి-గగ్గమ- సరిగ -సరిగ" - ఆ హార్మోనియం మెట్లు నా తలమీద సమ్మెట్లులాగున్నాయి- ఆ! అదేమిటి? ఓహో చిన్నమ్మాయిగారి గాత్రం తరువాత పెద్దమ్మాయిగారి వీణాగానం ! - "శాంతమూ లేక సౌఖ్యమూ లేదూ - సారసదళనయనా!"

శ్రీరామచంద్రమూర్తీ!-నాకు మనసులో శాంతం లేదోయ్! ఏం చెయ్యమన్నావు? ఎక్కడ వెతకమన్నావు? కలకత్తా నుంచి టెలిగ్రాం వచ్చి వారం రోజులు పైగా అయిపోయిందే! ఎక్కడ కలకత్తా - ఎక్కడ చెన్నపట్నం? ఆ దేశం వేరు, ఈ దేశం వేరు. ఆ భాష వేరు - ఈ భాష వేరు. ఆ తిండి వేరు. శాంతానికి గులాబీజాము తప్పితే మిఠాయి అంటే కిట్టదు. ఆ రసగొల్లా సందేషు సయిస్తుందో లేదో? వాళ్ళ తిళ్ళు బంగారంగానూ - పెరుగులో పంచదార పోసుకుంటారు!... యేడుపులో నుంచి అపభ్రంశంలోకి దిగిపోతున్నానే !

శాంతం మాత్రం ఎక్కడికి వెళ్ళుతుంది? ఎన్నాళ్ళు వెళ్ళుతుంది? నా బ్యాంకీ చెక్కులన్నీ సరీగానే వున్నాయి. నగలన్నీ ఇక్కడే వదిలేసింది. తన ప్రావిడెంటు ఫండు మొత్తం తన బ్యాంకులోనుంచి తీసి పట్టికెళ్ళి వుంటుంది. ఎన్నాళ్ళొస్తాయి- ఐదువేలు? అందులోకి ముగ్గురు మనుష్యులాయె? పరాయిదేశం పరాయివాళ్ళు అంటే అసలు భయం శాంతానికి. ఎంతసేపూ నేనుండాలి దగ్గర!

అప్పుడా లాఠీఛార్జీలో ఎలా జొరబడిందో? ఆవేశంలో చేసిన పని అది. ఆ స్త్రీలందరూ ఇప్పుడు ఇళ్ళలో యథాస్థానం అలంకరిస్తున్నారు. ఆడవాళ్ళకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలి -



అని పూతపదం అయింది శాంతానికి. ఇప్పుడు తిరిగిరానీ తెలుస్తుంది! చదువుకున్నది శాంతం కూడా యీ మూర్ఖమే. నన్నడిగితే - స్త్రీల అభిప్రాయం తీసుకుంటే నూటికి తొంభై తొమ్మిదిమంది ఇల్లాళ్ళు "మాకు స్వతంత్రం వద్దూ ఏమీ వద్దూ ఇంట్లో పడివుండనిద్దురూ" అంటారు. ఇంగ్లాండులో నేను ఎరుగుదును గదా! స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం అంటూ స్త్రీలని మభ్యపరచి - మగవాడిని - ఆడదాన్నీ కూడా మిల్లులో బానిసలుగా చేసేశారు - ఇంగ్లాండులో పెట్టుబడిదార్లు, సరి - రష్యాలో చెప్పనే అక్కరలేదు. ఆడది ఉమ్మడి ఆస్తి అన్నారు! మనుష్యులో - రాక్షసులో - మరి. "... రాజాధిరాజు - సంపద కలిగిన - శాంతము లేక - సౌఖ్యములేదు - సారసదళనయన." సిరి సంపదలకి ఏంలోటు - శాంతానికి? బంగారంతో తులాభారం తూగవచ్చు. నిక్షేపంలాగు - మూడు కార్లు, రత్నం లాంటి కూతురు, మహారాజు లాంటి పెనిమిటాయె. ఎందుకు వెళ్ళిపోయినట్టు?

ఏదో పంతానికి నాలుగు రోజులు పుట్టింటికి వెళ్ళివస్తూందనుకున్నా - ఆ వుత్తరం చదివినప్పుడు. నాలుగు రోజులల్లా - పదిహేను రోజులు అయిపోతూంది. ఆ డబ్బు రవంత అయిపోయాక వచ్చేస్తుంది. ఇహ ఎన్నాళ్ళో అక్కర్లేదు.

నాకు కోపం వస్తూంది - శాంతం మీద - నామీద నాకే కూడాను. శాంతం అంటే నాకు అపరిమితపు ప్రేమ. కాని నా పని ఇప్పుడు - ముండా కాదు - ముత్తైదువా కాదు లాగుంది.

కోపం ఉపశమించడానికి - భాష్యం లేడీ అయ్యంగారు దగ్గరికి వెళతాను. వెళితే వాళ్ళు అన్నీ ప్రశ్నలు వేస్తారు. నాకు ఏడుపు వస్తుంది. వెళ్ళను. ఎవరి ఖర్మం వాళ్లే అనుభవించాలి. నా వృత్తి వుంది. నాలా రిపోర్టులున్నాయి. నా కోర్టు కట్టలున్నాయి. వాటితోనే - ములగానాం - తేలానాం. నాకంతే రాసిపెట్టాడు దేవుడు. శాంతం మళ్ళీ నా కళ్ళబడేవరకూ !

79 ఆమె

ఢిల్లీ, కాశ్మీరీ దర్వాజా - కాట్రా రుచీరాం గల్లీలో ఈ హొటేలులో దిగేం - హొటేలేమిటి? పూటకూళ్ళ ఇల్లు!

కాశీలో రైలెక్కాం ప్రొద్దున్న సత్రంలో భోజనంచేసి. మూడవ తరగతి ప్రయాణం - అబ్బ? వళ్ళుహూనం అయిపోయింది. పాపాయి నలిగి ముద్ద అయిపోయింది. ఆ తొడతొక్కిడిలో సుభ వెనక్కి దిగబడిపోయింది. నోటిలో నాలుక వున్న పిల్ల కనుక - హిందీ కాస్త వుండడం చేత బండి అందుకుంది.

పాపం - మార్వడీ ఆవిడ చంటి పిల్లలతో ప్రయాణం. మగవాళ్ళు సామానంతటినీ ఆవిడనీ ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కించేశారు. ఉబ్బసం - దాంతోడు చంటిపిల్ల రాగాలు - ఆవిడ మొహం ఏమి సర్దుతుంది? అందరూ ఆవిడను చూసి చీంచుకోవడం! పాపాయిని ఆవిడ తెచ్చిన పాతసామాను బస్తామీద కూర్చోబెట్టి - నేను, సుభ సర్దిపెట్టాం - మూడు ఇనప్పెట్టెలు - రెండు రాగి హండాలు - రెండు బాల్చీలు - నాలుగు పెద్ద లోటాలు - మిఠాయిలతో రెండు కిరసనాయిలు డబ్బాలు - పెద్ద మంచం పరుపుచుట్ట - ఒక పీకుదాను - గంగాజలంతో అన్నపూర్ణ చెంబు!

పిల్ల ఏడుస్తూంది. పూరుకుంటుందేమో అని - సుభ పెప్పరింటి బిళ్ళలు రెండిచ్చింది. "బిలాయతీ నకో-" వద్దు - అంది. అలాగే దగ్గుతూ రోజుకుంటూ కదుల్చుకుంటూ - చెంగున వెండి తాళాల గుత్తితీసి కెరసనాయలు పెట్టెలోనుంచి - అరడజను దూద్‌పేడాలు - బర్ఫీలు - గుప్పెడు రేవిడీలు - పది నవాతు పొంగులు - నాలుగు హల్వా అచ్చులు - పిడికెడు పిస్తా - ఆక్రోటు - ఆల్ బొఖరా - ఇంత సాలామిశ్రి - ఒక సీసాడు గుల్కందు - తీసి ఇచ్చింది! "బహీన్‌జీ - ఖావ్" అంది. నాకు - తీపి సయించదు. అందులోకి శుచిశుభ్రం? ఆవిడని చూసి భయం వేసింది. కాని - ఆవిడ ఎంతో ఆప్యాయంగా ఇస్తోంది -తన ధన్యవాదం తెలపడానికి. సుభ కళ్ళు పెద్దవి పెట్టుకుని నోరు లొట్టలేస్తూంది. సరే - ఇదీ అన్నపూర్ణ ప్రసాదమే - అనుకుని తిన్నాను. పాపాయి వేళ్ళూ - మూతీ ముక్కూ మొహం అంతా ముద్ద చేసుకుంది.

ఆవిడా పిల్లా షహరాన్‌పూర్‌లో దిగిపోయారు. దిగిపోయే ముందు - మళ్ళీ కెరసనాయిలు డబ్బా తీసి - అరవీసెడు పటికబెల్లం - బాదం గింజలు - జీడిపప్పు - యాలక్కాయలు పొట్లం కట్టి ఇచ్చి మరీ దిగిపోయింది! పరాయి మనిషి - పరాయి భాష - అయితేనేం ఇద్దరిదీ ఆడజన్మే - ఇద్దరం గంగామాయి పిల్లలమే!...

అప్పుడే ఒక రాత్రి, ఒక పగలు గడిచిపోయాయి. జారు, చమ్మ, చీకటి. మేడమీదికి ఎరుపు రాతిమెట్లు నిచ్చనలాగున్నాయి. నిత్యకృత్యాలకి కష్టంగా వుంది. భోజనానికి ఫరవాలేదు - మీగడపాలు - పుల్కాలు - సబ్జీ - షాక్ - అల్లప్పచ్చడి - వూరబెట్టిన పచ్చిమిరపకాయలు. అబ్బా - వీళ్ళు కూడా ఇంత ఖారం తింటారూ?

కాని వూరులో తిరగడానికి భయం వేస్తుంది; నాకు తలమీద ముసుగు వేసుకోవడం అలవాటు లేదు - తలలో పువ్వులు పెట్టుకుంటే కానీ తోచదు- ఇక్కడ ఇవి మహా తప్పట! విజయనగరం పెద్దాపురం బొబ్బిలి పిఠాపురం - వీటికి ఆంధ్ర రాజుల సాంప్రదాయం ఇప్పటికీ ఎలా అంటుకుపోయి వుండిపోయిందో - అలాగే యీ ఢిల్లీకి ఆ మొగల్ దర్బారు వాసన అలా అంటుకుపోయి వుండిపోయింది పూర్వసువాసన !

ఈ గల్లీ! సూర్యుడు చొరబడడానికి సందులేదు. ఇందులోనే ఎడ్లబళ్ళు - బరువు మోసే కూలీలు - బుడ్డీదీపం పెట్టుకుని మిఠాయి రథాలు - ఒంటెలులాగే బళ్ళు - చెత్తకుప్పలలో మూతులుపెట్టి అరిటాకులులాగి తింటూవున్న ఆవులు - గుజ్జుపు జక్కాలు - వీళ్ళ కాళ్ళలో పడుతూ ఆడుకుంటున్న పిల్లలు!...

ప్రొద్దున్న చూచాను - రెండు గల్లీల తరువాత - పెద్ద కోఠీ. సుప్రసిద్ధుడైన యునానీ వైద్యుడిదట. శుక్రవారం జుమ్మా బిచ్చం అందుకోవడానికి వరుసలుతీర్చి దర్వాజా ఎదురుగా కూర్చున్నారు బిచ్చం అడుక్కునేవారు - గుడ్డివారు - కుంటివారు - గూండాలు - సోమరిపోతులు.

- ఇంకా వుంది.

మేధస్సుకు ప్రతి సృష్టే.. కృత్రిమ మేధస్సు

శాస్త్ర, సాంకేతికతల సహాయంతో ప్రపంచాన్నే గుప్పిట్లోకి తెచ్చిన శాస్త్రవేత్తలు.. ఇప్పుడు మానవ మేధస్సుకే సవాల్ విసురుతున్నారు. సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ కృత్రిమ మేధస్సుకు ప్రాణం పోస్తున్నారు. ఇందులో భాగంగానే అన్ని రంగాల్లో స్వయం నియంత్రిత -రోబోలు, యంత్రాలు ప్రవేశిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో దూసుకెళ్తున్న ఇరవై ఒకటో శతాబ్దం.. సైన్స్ చరిత్రలో కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ నేపథ్యంలో.. కృత్రిమ మేధస్సు, దాని ప్రత్యేకతల గురించి తెలుసుకుందాం...





ప్రపంచంలోనే అత్యంత తెలివైన జీవి మనిషి. మేధాశక్తి అతడిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతోపాటు యావత్ ప్రపంచంపై పట్టు సాధించేలా చేసింది. సృష్టి అనేక అద్భుతాల సమాహారం.. అయితే ఆ సృష్టికే ప్రతిసృష్టి చేస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు శాస్త్రవేత్తలు. 'అసాధ్యం' అనే మాటకు తావులేకుండా ఊహలకు వాస్తవరూపం ఇస్తున్నారు. మరమనుషులకు మేధాశక్తి ప్రసాదించి సైన్స్ చరిత్రలో కొత్త అధ్యాయానికి తెరతీస్తున్నారు.

కృత్రిమ మేధస్సు

జ్ఞాపకాలను గుర్తుంచుకోవడం, నెమరువేయగలగడం, సమస్యలను పరిష్కరించడం, తార్కిక-గణన శక్తి, సాంకేతిక పదాలతోపాటు సాధారణ భాషలను అర్థంచేసుకోవడం, నూతన పరిస్థితులకు అనుగుణంగా ప్రతిస్పందించడం వంటి సామర్థ్యాల సమాహారమే మేధస్సు. దీనికి ప్రతిసృష్టే.. కృత్రిమ మేధస్సు.

కృత్రిమ మేధస్సుపై పరిశోధనల్లో భవిష్యత్ తరాలకు మార్గ నిర్దేశం చేసిన జాన్ మెక్‌కార్తీ.. కృత్రిమ మేధస్సు పితామహుడిగా గుర్తింపు పొందారు. ఇతడి నిర్వచనం ప్రకారం- సైన్స్, ఇంజనీరింగ్‌ల కలయికతో రూపుదిద్దుకున్న తెలివైన యంత్రాలు, కంప్యూటర్ ప్రోగ్రామ్‌లనే 'కృత్రిమ మేధస్సు' అంటారు. ఇంతకాలం కంప్యూటర్లు వాటికిచ్చిన ప్రోగ్రామ్‌ల ఆధారంగా పనిచేస్తున్నాయి. స్వతహాగా ఆలోచించి సమస్యలకు పరిష్కారం చూపించగలిగే సామర్థ్యం వాటికి లేదు. ఇకపై కృత్రిమ మేధస్సుతో చాలా సమస్యలకు స్వతహాగా స్పందించి సమాధానాలు ఇవ్వగల, పనులను చక్కదిద్దగల రోబోలు, కంప్యూటర్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ దిశగా.. ఆలోచన, తార్కిక విశ్లేషణ వంటి విషయాల్లో మనిషి మెదడు పనితీరును అధ్యయనం చేసి అచ్చం అలాగే పనిచేసేలా సాఫ్ట్‌వేర్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. కంప్యూటర్ సైన్స్, సైకాలజీ, న్యూరాన్ సైన్స్, బయాలజీ, మ్యాథ్స్, సోషియాలజీ, ఫిలాసఫీల కలయికతో కృత్రిమ మేధస్సు రూపుదిద్దుకుంటోంది. ఈ పరిజ్ఞానాన్ని ఇప్పటికే పలు రంగాల్లో వినియోగిస్తున్నారు.

లక్ష్యాలు:

'ఆలోచించడం, అర్థం చేసుకోవడం, సమస్యలను విశ్లేషించడం, సందర్భానుసారం ప్రవర్తించడం' వంటి మానవ సామర్థ్యాలను యంత్రాలకు కల్పించడమే శాస్త్రవేత్తల లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధిస్తే మనిషి చేయలేని అనేక పనులను యంత్రాలు చక్కదిద్దగలవు. అదే జరిగితే మనిషి జీవితం మరింత సౌకర్యవంతంగా మారుతుంది.

ప్రత్యేకతలు :

కంప్యూటర్లు కేవలం కోడ్ భాషలను మాత్రమే అర్థంచేసుకుంటాయి. ప్రస్తుతం వాటిని కృత్రిమ మేధస్సు సహాయంతో వివిధ భాషలను అర్థంచేసుకుని.. సంభాషించేలా తీర్చి దిద్దుతున్నారు. ఆధునిక యంత్రాలకు దృష్టి జ్ఞానం అందిస్తున్నారు. ఇందులో భాగంగా రికార్డుల్లోని నేరస్తుల ఛాయాచిత్రాలను పోల్చి..వారు సీసీ కెమెరాలకు చిక్కిన వెంటనే పోలీసులను అప్రమత్తం చేసే వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే వైద్యరంగంలో కొన్ని రకాల వ్యాధులను గుర్తించేందుకు కృత్రిమ మేధస్సును వినియోగిస్తున్నారు.

ఇప్పటివరకు వివిధ రకాల ఎలక్ట్రానిక్ మెషీన్లు వాటికి అందించిన సమాచారం ఆధారంగా కొన్ని స్వరాలను మాత్రమే గుర్తించగలవు. వీటిని కృత్రిమ మేధస్సు సహాయంతో భాష, యాస, మాండలికాలు, స్వరంలో మార్పు వచ్చినా పూర్తి కచ్చితత్వంతో స్వరాలను గుర్తించేలా రూపొందిస్తున్నారు.

కృత్రిమ మేధస్సుతో చేతిరాతను గుర్తించొచ్చు. అక్షరాల ఆకృతిని అర్థంచేసుకొని.. ఎలా రాసినా చదవగలగే, స్క్రిప్టును ఎడిటింగ్ చేయగలిగే సామర్థ్యం దీనికి ఉంది. శాస్త్రవేత్తలు కృత్రిమ మేధస్సును మేధోపరమైన క్రీడల్లో విజయవంతంగా వినియోగించారు. చెస్, పోకర్, టిక్-టాక్ వంటి క్రీడల్లో ఎత్తులకు పైఎత్తులు వేసి ప్రత్యర్థిని ఓడించగలిగే సామర్థ్యం దీనికి ఉందని ఇప్పటికే నిరూపితమైంది. రోబోలు కాంతి, చీకటి, వేడి, చల్లదనం, కదలికలు, శబ్దాలు, ఎత్తుపల్లాలను గుర్తిస్తాయి. ఒకసారి ఏదైనా తప్పిదం జరిగితే మళ్లీ వాటంతటవే సరిదిద్దుకుంటాయి. పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తన, పని విధానాలను మార్చుకుంటాయి.

దిగ్గజ సంస్థల సేవల్లో

సాంకేతిక రంగంలోని దిగ్గజ సంస్థలు కృత్రిమ మేధస్సును ఎక్కువగా వినియోగిస్తున్నాయి. కిందిస్థాయి ఉద్యోగులు చేసే అన్ని పనులకు ఏఐని వినియోగించేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ఆయా సంస్థలు అవి ఉపయోగిస్తున్న ఏఐ ఆధారిత సాంకేతికతలకు పలు పేర్లు పెట్టాయి.

వాటిలో కొన్ని....

సిరి : ప్రముఖ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ యాపిల్ 'సిరి' పేరుతో వ్యక్తిగత సహాయ సేవలు అందిస్తోంది. ఇది రోజువారీ సలహాలు, సూచనలు ఇవ్వడం, నిర్ధారించిన కార్యక్రమ వివరాలను గుర్తుచేయడంతోపాటు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది. ఇది పూర్తిగా మనిషిలానే మాట్లాడుతూ యాపిల్ వినియోగదారులకు సేవలు అందిస్తోంది.

టెస్లా : కార్లను స్వయంచోదితంగా నడపడానికి కృత్రిమ మేధస్సును వినియోగిస్తోంది.

అమెజాన్ : ఆన్‌లైన్ షాపింగ్ సంస్థ అమెజాన్ వినియోగదారుల అభిరుచులను గుర్తించి వారికి తగిన సేవలందించేందుకు కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తోంది.



నెస్ట్ : ఇళ్లు, కార్యాలయాల్లో మనకు అనుకూలమైన ఉష్ణోగ్రతను మన ప్రమేయం లేకుండా సరిచేసే టెక్నాలజీని గూగుల్ అభివృద్ధి చేసింది. ఇది వ్యక్తిగత అలవాట్లను అధ్యయనం చేసి, ఏ సమయంలో ఎలా ఉండాలని కోరుకుంటామో అలాంటి ఉష్ణోగ్రతలను కొనసాగిస్తుంది.

ప్రయోజనాలు

ప్రస్తుతం ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో టెక్నాలజీ కీలకపాత్ర పోషిస్తోంది. ఉద్యోగార్థులు అప్లికేషన్‌లో పేర్కొన్న సమాచారం సరైందో కాదో చిటికెలో చెప్పేస్తోంది. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా అకౌంట్లను వడపోసి అభ్యర్థుల సామర్థ్యంపై నివేదిక ఇస్తుంది. మొదటిదశ ఇంటర్వ్యూలను కృత్రిమ మేధస్సుతో అనుసంధానించిన కంప్యూటర్లే చేస్తున్నాయి.

వినియోగదారుల సేవలకు సంబంధించి కార్పొరేట్ సంస్థలు, బ్యాంకులు కృత్రిమ మేధస్సును వినియోగిస్తున్నాయి. కస్టమర్ కేర్ సెంటర్‌లో మనుషులకు బదులు కంప్యూటర్లే సమాధానాలు ఇస్తున్నా యి. స్వర రూపంలోనే కాకుండా చాటింగ్ ద్వారా కూడా సేవలంది స్తున్నాయి. వోక్స్‌వేగన్, బీఎండబ్ల్యూ వంటి కార్ల తయారీ సంస్థలు స్వయం నియంత్రిత రోబోలను వినియోగిస్తున్నాయి.

మానవ వనరులను ఉపయోగించడం వల్ల కార్పొరేట్ సంస్థలు అధిక మొత్తంలో వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. కృత్రిమ మేధస్సు వినియోగంతో మానవ వనరులపై చేసే ఖర్చు చాలావరకు ఆదా అవుతుంది.

యుద్ధ క్షేత్రం : ప్రపంచవ్యాప్తంగా దేశాలు భద్రతపై లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. సైనికులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని రోబోలకు కృత్రిమ మేధస్సును జోడించి రణక్షేత్రంలో ప్రవేశపెట్టేందుకు అమెరికా, రష్యా, ఇజ్రాయెల్, యునైటెడ్ కింగ్‌డమ్, చైనా, దక్షిణ కొరియాలు విస్తృత పరిశోధనలు చేస్తున్నాయి. ఇప్పటికే రక్షణ రంగానికి సంబంధించి నిఘా విమానాలు తమకు తాముగా ఛాయాచిత్రాలు తీస్తున్నాయి.

బ్యాంకింగ్ లక్ష్మీ : భారత బ్యాంకింగ్‌కు సంబంధించి సిటీ యూనియన్ బ్యాంక్ తొలిసారి రోబో సేవలను వినియోగంలోకి తెచ్చింది. 'లక్ష్మీ'గా పేర్కొనే ఈ రోబో ఖాతాదారులకు బ్యాలెన్స్, రుణాలపై వడ్డీరేట్లు, ఇతరత్రా వివరాలను అందిస్తుంది. ఇది ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంది. ప్రస్తుతం ఇది 125 రకాల సందేహాలకు సమాధానాలు ఇస్తుంది. గోప్యత పాటించాల్సిన అంశాలను తెరపై మాత్రమే చూపిస్తుంది. రోబోలను భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేసి బ్యాంకింగ్ కార్యకలాపాల్లో విస్తృతంగా వినియోగించాలని భావిస్తున్నారు.

రోబోకి పౌరసత్వం : సౌదీ అరేబియా తొలిసారి ఒక మహిళా రోబోకు పౌరసత్వం కల్పించింది. కృత్రిమ మేధస్సుతో ప్రాణం పోసుకున్న 'సోఫియా' అనే రోబో.. రియాద్‌లో జరిగిన 'ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్' సదస్సులో తనకు తాను ప్రపంచానికి పరిచయం చేసుకుంది. శాంతియుత ప్రపంచమే తన ధ్యేయమని చెప్తోన్న 'సోఫియా'.. మనుషుల్లానే రకరకాల హావభావాలను పలికించగలదు.

ప్రతికూలతలు-విమర్శలు

కృత్రిమ మేధస్సుతో ప్రపంచంలో విప్లవాత్మక మార్పులు వస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. రాబోయే మార్పు సామాజికంగా పెను ప్రభావం చూపనుంది. అల్పస్థాయి నైపుణ్యం, తక్కువ సాంకేతిక పరిజ్ఞానాలు కలిగిన అనేక మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

కృత్రిమ మేధస్సు కలిగిన యంత్రాలు పక్కదోవపడితే కంప్యూటర్లను హ్యాక్ చేస్తాయి. నెట్‌వర్క్‌లను దెబ్బతీస్తాయి.

మానవ రహిత కార్ల గురించి గొప్పగా చెప్పుకుంటున్నాం. కానీ, అలాంటి వాహనాల వల్ల ప్రమాదాలు జరిగితే ఎవరిని బాధ్యుల్ని చేయాలనే ప్రశ్నకు సమాధానం లేదు.

వైద్య, ఆర్థిక, వాణిజ్యాలకు సంబంధించిన పౌర కార్యకలాపాల్లో కృత్రిమ మేధస్సును అనుమతించొచ్చు. కానీ, భద్రతకు సంబంధించిన రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

కృత్రిమ మేధస్సు అభివృద్ధిని నియంత్రించలేకపోతే చరిత్రలో దాన్ని అత్యంత చెత్త విషయంగా చెప్పుకునే రోజులొస్తాయని.. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే మూడో ప్రపంచ యుద్ధానికి కృత్రిమ మేధస్సే కారణం అవుతుందంటున్నారు ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్.

కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఆయుధాలను అనుమతించడమంటే సమస్యలను కొనితెచ్చుకోవడమేనని బిలియనీర్ ఎలాన్ మస్క్‌తోపాటు మరో వందమంది ఐరాసకు లేఖ రాశారు.

ఈ టెక్నాలజీతో ధనిక, పేద మధ్య అంతరాలు మరింత పెరుగుతాయని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ అభిప్రాయపడుతుంటే.. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు జుకర్‌బర్గ మాత్రం కృత్రిమ మేధస్సుతో మనిషి జీవితం మరింత సుఖవంతంగా మారుతుందంటున్నారు.

కీలక మైలురాళ్లు

- లండన్‌కు చెందిన కారెల్ కాపెక్ 1923లో తొలిసారిగా 'రోబో' అనే పదాన్ని ఉపయోగించాడు.
- 1945లో కొలంబో యూనివర్సిటీకి చెందిన ఇసాక్ అసిమోవ్ 'రోబోటిక్స్' అనే పదాన్ని వాడాడు.
- 1950లో అలెన్ ట్యూరింగ్, క్లాడ్ షానన్‌లు రోబోలు చెస్ ఆడగలవని వివరించారు. ట్యూరింగ్‌ను పలువురు కృత్రిమ మేధస్సుకు పితామహుడిగా పేర్కొంటారు.
- 1956లో జాన్ మెక్‌కార్తీ తొలిసారిగా 'కృత్రిమ మేధస్సు' అనే పదాన్ని వాడుకలోకి తెచ్చాడు.
- 1979లో కంప్యూటర్ సహాయంతో స్వయం చోదితంగా నడిచే వాహనాన్ని రూపొందించారు.
- 1997లో అప్పటి ప్రపంచ చెస్ ఛాంపియన్ గారీ కాస్పరోవ్‌ను కృత్రిమ మేధస్సుతో కంప్యూటర్ ఓడించింది.
- 2000లో భావోద్వేగాలను పలికిస్తూ ప్రతిస్పందించగలిగే పెంపుడు జంతువుల్లాంటి రోబోలను వాణిజ్య స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు.

ఎన్ఈఐఎస్‌టీలో ప్రాజెక్టు అసిస్టెంట్లు



నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్‌ఈఐఎస్‌టీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు :

- **మొత్తం పోస్టుల సంఖ్య :** 6
- **అర్హత :** ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ, అగ్రికల్చర్, బాటనీ, బయోటెక్నాలజీ, టిష్యూ కల్చర్, లైఫ్ సైన్స్, బయోఇన్ఫర్మాటిక్స్)లో ఉత్తీర్ణత.
- **పే స్కేల్ :** రూ.25,000. అదనంగా హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారు
- **ఎంపిక :** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు :** ఆఫ్‌లైన్ ద్వారా.
- **ఇంటర్వ్యూ తేదీ :** ఫిబ్రవరి 7
- **వెబ్‌సైట్ :** www.neist.res.in.

ఓషియన్ టెక్నాలజీలో ఎస్‌ఆర్‌ఎఫ్

తమిళనాడులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియన్ టెక్నాలజీ (ఎన్‌ఐఓటీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఎస్‌ఆర్‌ఎఫ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టుల సంఖ్య :** 21

విభాగాలవారీగా ఖాళీలు :

- రిసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ)-6
- సీనియర్ రిసెర్చ్ ఫెలో (ఎస్‌ఆర్‌ఎఫ్)-11
- జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్)-4
- **అర్హత :** పీహెచ్‌డీ (ఓషియనోగ్రఫీ, ఫిజికల్ ఓషియనోగ్రఫీ, మెరైన్ జియోఫిజిక్స్, మెరైన్ జియాలజీ), ఎంటెక్ (ఓషియన్ టెక్నాలజీ/ఓషియనోగ్రఫీ/ ఫిజికల్ ఓషియనోగ్రఫీ, మెరైన్ జియోఫిజిక్స్, మెరైన్ జియాలజీ, బయోటెక్నాలజీ, జెనెటిక్స్), సంబంధిత బ్రాంచిలో బీఈ/ బీటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, లైఫ్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ/ పీహెచ్‌డీ ఉండాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- **వయస్సు :** 28 ఏళ్లు, (ఆర్ఏకు 35 ఏళ్లు, ఎస్‌ఆర్‌ఎఫ్‌కు 32 ఏళ్లకు మించరాదు.)
- **ఎంపిక :** రాత పరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా.
- **దరఖాస్తు :** ఆన్‌లైన్
- **చివరితేదీ :** ఫిబ్రవరి 9
- **వెబ్‌సైట్ :** http://www.niot.res.in

ఏఎల్ఐఎంసీవోలో 64 ఉద్యోగాలు

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ కేంద్రంగా పనిచేసే ఆర్టిఫీషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఐఎంసీవో).. ప్రధాన కార్యాలయంతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న తన శాఖల్లోని 64 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు - ఖాళీలు : సీనియర్ మేనేజర్ (మార్కెటింగ్)-1, మేనేజర్-2 (ఫైనాన్స్-1+ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ (సివిల్)-1), డిప్యూటీ మేనేజర్-2 (మార్కెటింగ్-1+ మెటీరియల్ మేనేజ్‌మెంట్-1), అసిస్టెంట్ మేనేజర్-2 (ప్రొడక్షన్-1+ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్-1), మార్కెటింగ్ ఆఫీసర్-1, ఆర్ అండ్ డీ ఇంజనీర్-1, స్టోర్ ఆఫీసర్-1, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-2, క్యూసీ అసిస్టెంట్ (మెకానికల్/ ఎలక్ట్రికల్)-3, స్టెనోగ్రాఫర్-1, జూనియర్ క్లర్క్/ అసిస్టెంట్-8, జూనియర్ స్టోర్ కీపర్-1, అసెంబ్లర్-3, ఫిట్టర్-9, మెషినిస్ట్-2, ఎలక్ట్రీషియన్-3, టర్నర్-3, మిల్‌రైట్-2, ప్లాంట్ ఆపరేటర్-6 (బాయిలర్-5ండీజీ సెట్-1), ప్రెస్ ఆపరేటర్-1, ఎలక్ట్రోప్లేటర్-2, ఉడ్ వర్కర్/ కార్పెంటర్-4, వెల్డర్-1, పైప్ ఫిట్టర్ (ప్లంబర్)-1, పాలిషర్-2.

వేతనశ్రేణి : సీనియర్ మేనేజర్-రూ.32,900-58,000; మేనేజర్-రూ.29,100-రూ.54,500; డిప్యూటీ మేనేజర్-రూ.24,900-రూ.50,500; అసిస్టెంట్ మేనేజర్-రూ.20,600-రూ.46,500; మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్), -రూ.12, 600-రూ.32,500; క్యూసీ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ క్లర్క్/అసిస్టెంట్, జూనియర్ స్టోర్ కీపర్-రూ.7,300-రూ.16,300; పాలిషర్-రూ.6,720-రూ.14,950; మిగిలిన పోస్టులకు రూ.7,010-రూ.15,600.

అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ/ సీఏ/ ఐసీఏ/ ఇంజనీరింగ్ డిప్లొమా/ డిగ్రీ/ ఐటీఐ/ పదోతరగతి. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితర అర్హతలుండాలి.

వయసు : సీనియర్ మేనేజర్‌కు 49 ఏళ్లు; మేనేజర్-46 ఏళ్లుటీ; డిప్యూటీ మేనేజర్-43 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్-40 ఏళ్లు; మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-34 ఏళ్లు; క్యూసీ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ క్లర్క్/అసిస్టెంట్, జూనియర్ స్టోర్ కీపర్-32 ఏళ్లుటీ; మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : పోస్టులను బట్టి రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ.

దరఖాస్తు రుసుం : 'మేనేజర్', మార్కెటింగ్ ఆఫీసర్, ఆర్ అండ్ డీ ఇంజనీర్, స్టోర్ ఆఫీసర్, ఆఫీసర్ (క్వాలిటీ కంట్రోల్)-రూ.500; మిగిలిన పోస్టులకు రూ.250టీ; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 28, 2018.

వెబ్‌సైట్ : www.alimco.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం) / ప్రొద్దుటూరు	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం) / ప్రొద్దుటూరు	డాలరు Vs రూపాయి
-58.36	-21.95			200		
35,906.66	11,016.90	28,750	28,950 / 28,550	40,300	42,600 / 40,400	64.02
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఎం&ఎం	797.35	4.44
లార్సెన్	1,455.80	2.77
ఇండస్ఇండ్ బ్యాంక్	1,797.00	2.44
బజాజ్ ఆటో	3,418.25	2.12
ఏషియన్ పెయింట్స్	1,155.10	1.89

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఓఎన్‌జీసీ	195.10	-4.06
సన్‌ఫార్మా	556.25	-3.99
రెడ్డీ ల్యాబ్స్	2,156.95	-3.07
ఎస్‌బీఐ	317.45	-2.30
ఐసీఐసీఐ బ్యాంక్	355.70	-2.04

ముడి చమురు	69.05

'ఉజ్వల' 'గ్యాసే'నా..?



న్యూఢిల్లీ : దారిద్ర్య రేఖకు దిగువనున్న గ్రామీణ పేద కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు 2016, మే నెలలో ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' కింద ఇప్పటి వరకు 3,30,00,000 కనెక్షన్లు ఇచ్చామని, తన ప్రభుత్వం కాలపరిమితి ముగిసేలోగా ఐదు కోట్ల లక్ష్యాన్ని అలవోకగా అందుకుంటామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇటీవల ఓ పత్రికకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఘనంగా చెప్పుకున్నారు. కట్టె పుల్లలు, పిడకలతో పొయ్యి రాజేసి అనారోగ్యం పాలవుతున్నా ఆడపడుచులను ఆదుకునేందుకు, వారి సాధికారికతకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతున్నందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని కూడా మోడీ భావోద్వేగంతో చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం విజయాన్ని ప్రస్తావించినప్పుడు ప్రధాని మోడీ సహా పాలకపక్ష పార్లమెంట్ సభ్యులు బల్లలు చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉజ్వల యోజన పథకం కింద ఉచిత ఎల్పీజీ కనెక్షన్ల టార్గెట్‌ను ఎనిమిది కోట్లకు పెంచుతున్నట్లు గర్వంగా ప్రకటించారు కూడా. నిజంగా ఈ పథకం విజయవంతమైందా? ప్రధాని మోడీ, అరుణ్ జైట్లీ చెబుతున్నట్లు అంత మంది గ్రామీణ పేదలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం నిజమేనా? తద్వారా ప్రధాని ఆశించిన పథకం లక్ష్యం నెరవేరుతుందా?

కనెక్షన్లు ఇవ్వడం మాత్రం అక్షర సత్యం. పథకం లక్ష్యం మాత్రం 'పక్కన' పడిపోయింది. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్యాస్ కనెక్షన్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌తో సహా 1600 రూపాయల సబ్సిడీని ప్రభుత్వ చమురు కంపెనీలకు అందజేస్తోంది. పథకం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 'ప్రభుత్వ పెట్రోలియం ప్రణాళిక, విశ్లేషణా విభాగం' లెక్కల ప్రకారం అదనపు గ్యాస్ కనెక్షన్లు 16.26 శాతం పెరగ్గా, సిలిండర్ల విక్రయ సంఖ్య మాత్రం 9.83 శాతం మాత్రమే పెరిగింది. ఈ సిలిండర్ల పెరుగుదల ప్రధాని ఉజ్వల పథకం అమల్లో లేనప్పుడు అంటే, 2014-15 సంవత్సరానికి పెరిగిన సిలిండర్ల సంఖ్య కన్నా తక్కువగా ఉండడం ఆశ్చర్యకరం. ప్రభుత్వ సంస్థ అంచనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో ఓ పేద కుటుంబం సంవత్సరానికి సగటున కనీసం 5 సిలిండర్లను వాడాలి. అప్పుడు సిలిండర్ల వినిమయ సంఖ్య భారీగా పెరగాలి. మరి ఎందుకు తగ్గింది?

కనెక్షన్ తీసుకున్నప్పుడు వచ్చిన సిలిండర్‌ను మినహాయిస్తే ఎక్కువ కుటుంబాలు మళ్లీ సిలిండర్‌ను రీఫిల్ చేయడం లేదని స్పష్టం అవుతుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారం 2015-16 సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాల్లో ఓ గ్యాస్ కనెక్షన్‌కు సరాసరి ఏడాదికి 6.27 సిలిండర్లు వాడగా, ఉజ్వల పథకం అమల్లోకి వచ్చాక 2016-17 సంవత్సరానికి ఏడాదికి సిలిండర్ల వినిమయ సంఖ్య 5.6 శాతానికి పడిపోయింది. అంటే గ్యాస్ కనెక్షన్లు తీసుకున్న పేదలు తమ గ్యాస్ కనెక్షన్ల పక్కన పడేయడమే కాకుండా, వారిలో కొందరి కనెక్షన్లను ఇతరులు వాడుకుంటున్నట్లు స్పష్టం అవుతుంది. టూకీగా చెప్పాలంటే ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు తీసుకున్న పేదల్లో కేవలం 18 శాతం మంది మాత్రమే గ్యాస్ స్టౌలు ఉపయోగిస్తున్నారని, 32 శాతం మంది గ్యాస్ స్టౌవ్‌లను పక్కన పడేస్తున్నారని, 50 శాతం మంది తమ సిలిండర్లను ఇతరులకు అమ్ముకుంటున్నారన్నది ఓ అంచనా.

గ్యాస్ కనెక్షన్‌ల కోసం డబ్బు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది కనుక తీసుకోవడం లేదని 86 శాతం మంది చెప్పగా, ప్రస్తుతం ఉచితంగా దొరికే వంట చెరకుతో వంట చేసుకుంటున్నామని, గ్యాస్ సిలిండర్ల కోసం డబ్బులు ఎక్కడ పెడతామని 83 శాతం మంది చెప్పారు. గ్యాస్ కనెక్షన్ కోసం 15 రోజులకు పైగా గ్యాస్ రీఫిల్లింగ్ కోసం నిరీక్షించాల్సి వస్తోందని దాదాపు 90 శాతం మంది చెప్పారు. ఈ నివేదిక ముందు వెలువడి ఉంటే ప్రధాని మోడీ ఉజ్వల పథకాన్ని ప్రవేశపెట్టడానికి ముందు అమలు తీరు గురించి ఆలోచించే వారేమో! ఈ నివేదిక 2016 డిసెంబర్‌లో విడుదలైంది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ పొయ్యిల నుంచి వచ్చే పొగవల్ల ఏటా దాదాపు లక్ష మంది భారతీయులు మరణిస్తున్నారనే ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలకు మన ప్రధాని మోడీ స్పందించినట్లున్నారు.



అమల్లోకి ఈ-వే బిల్లు

న్యూఢిల్లీ : వార్షిక బడ్జెట్ వెలువడనున్నరోజే దేశవ్యాప్తంగా జీఎస్టీ ఈ-వే బిల్లు విధానం కూడా అమలులోకి వచ్చింది. జీఎస్టీని అనుసరించి ఏవేనీ రెండు రాష్ట్రాల మధ్య రూ.50 వేలకు మించి విలువ కలిగిన సరకులను రవాణా చేయాలంటే ఫిబ్రవరి 1 నుంచి ఎలక్ట్రానిక్ వే (ఈ-వే) బిల్లు తప్పనిసరి. ఒక ఇ-వే బిల్లు 100 కిలోమీటర్ల కంటే తక్కువ దూరానికి ఒక రోజు చెల్లుతుంది. దీని తరువాత ప్రతి 100 కిలోమీటర్లకి, సంబంధిత తేదీ నుండి ఒక రోజుకు చెల్లుబాటు అవుతుంది. ఈ-వే బిల్లును 24 గంటలలో రద్దు చేయవలసి ఉంటుంది. పన్నుల ఎగవేతను నిరోధించడం కోసమే రూపొందించిన ఈ-వే బిల్లు విధానం.. జీఎస్టీ రూపకల్పనలో కీలక అంశంగా పేర్కొన్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నేతృత్వంలో జరిగిన 24వ జీఎస్టీమండలి సమావేశంలో ఈ-వే బిల్లులను తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు జనవరి 15 నుంచే ఈ-వే అమలును ప్రయోగాత్మకంగా చేపట్టారు. పలు రాష్ట్రాల్లో ఈ విధానం విజయవంతమైనట్లు జీఎస్టీ నెట్‌వర్క్ సీఈవో ప్రకాశ్ కుమార్ తెలిపారు. గడిచిన 15 రోజుల్లో సుమారు 2.84 కోట్ల ఈ-వే బిల్లులు జారీ అయ్యాయని, జనవరి 30న గరిష్టంగా 3,40,000 ఈవే బిల్లులు జారీ అయినట్లు కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు ట్రాన్స్‌పోర్టర్లు, పన్నుచెల్లింపుదారులు అంతా కలిపి 6.70లక్షల మంది ఈ-వే బిల్లు విధానంలో పేర్లను నమోదు చేసుకున్నారు. ఫిబ్రవరి 1 నుంచి అంతర్రాష్ట్ర రవాణాకు ఈ-వే బిల్లు తప్పనిసరి అయినట్లే.. జూన్1 నుంచి రాష్ట్రంలో అంతర్గత రవాణాలకూ ఈ-వే బిల్లు వర్తించనుంది.

పారిశ్రామిక వర్గాల ఆందోళన

కాగా, రూ.50 వేలకు మించి విలువ కలిగిన సరకుల రవాణాకు ఈ-వే బిల్లును తప్పనిసరి చేసిన ప్రభుత్వ నిర్ణయాన్ని పారిశ్రామిక వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. రూ.5 లక్ష లకు మించి విలువ కలిగిన సరకులకు మాత్రమే వర్తింప జేయాలని, ఈ-వే బిల్లు చెల్లుబాటు గడువును 24 గంటలు (ఒక రోజు) కాకుండా ఐదు రోజులకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.



టెలికాం రంగానికి రూ.10వేల కోట్లు

న్యూఢిల్లీ : టెలికాం రంగ మౌలిక సదుపాయాల కోసం రూ.10 వేల కోట్లను కేటాయించారు. బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ఈ విషయాన్ని వెల్లడించారు. వేర్వేరు ప్రభుత్వ ప్రాజెక్టుల కింద టెలికం రంగాన్ని అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. 2018-19 సంవత్సరానికి ఆ మొత్తాన్ని కేటాయినట్లు ఆయన చెప్పారు. భారత్ నెట్ ప్రాజెక్టు కింద అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. భారత్ నెట్ ప్రాజెక్టు ద్వారా మార్చి 2019 వరకు సుమారు 2.5 లక్షల గ్రామ పంచాయతీలకు కనెక్షన్లు ఇవ్వనున్నారు. భారత్ నెట్ మొదటి దశలో సుమారు లక్ష గ్రామ పంచాయతీలకు హైస్పీడ్ ఆప్టిక్ ఫైబర్ నెట్‌వర్క్‌ను కల్పించారు. అయిదు కోట్ల గ్రామీణ పౌరుల కోసం సుమారు 5 లక్షల వైఫై స్పాట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచించారు. ఐఐటీ మద్రాస్ సాయంతో దేశవ్యాప్తంగా 5జీ సెంటర్స్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌కు కేంద్రం సుమారు 3073 కోట్లను కేటాయించింది.

నష్టాల్లో ముగిసిన సూచీలు
బడ్జెట్ ఎఫెక్ట్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం బడ్జెట్ రోజు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. బడ్జెట్ ప్రారంభానికి ముందు సుమారు 100 పాయింట్లకు పైగా లాభంలో ట్రేడయినప్పటికీ బడ్జెట్ ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే మార్కెట్ నష్టాల్లోకి జారుకుంది. ఒకానొక దశలో సెన్సెక్స్ 463 పాయింట్లు నష్టపోయింది. వచ్చే ఏడాది జమిలీ ఎన్నికలు జరగవచ్చుననే ఊహాగానాలు వస్తుండటంతో ప్రభుత్వం వ్యవసాయం, గ్రామీణ రంగాలపై దృష్టి సారించింది. ఫలితంగా కార్పొరేట్ సెక్టార్‌కు అనుకూలించకలేదు. మార్కెట్ వర్గాలు వ్యవసాయ, గ్రామీణ రంగాలపై పెద్దగా ఆసక్తి చూపక పోవడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 58 పాయింట్ల నష్టంతో 35,907 వద్ద, నిఫ్టీ 11 పాయింట్లు కోల్పోయి 11,017 వద్ద స్థిరపడ్డాయి. బడ్జెట్ మార్కెట్ ఆశలకు అనుగుణంగా లేకపోవడంతో మదుపరులు అమ్మకాలకు దిగారు. 2005లో తొలగించిన లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును మళ్లీ వెలికి తీసుకురావడం కూడా మార్కెట్ వర్గాలను నిరాశకులోను చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ సంస్థాగత పెట్టుబడిదారులకు కొంత ఇబ్బందికరమైన విషయమే.

పెట్రోలు, డీజిల్ గుడ్డిలో మెల్ల..!
ఎక్సైజ్‌డ్యూటీ 2 శాతం తగ్గింపు



న్యూఢిల్లీ : పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో కుంగిపోతున్న సామాన్యుడికి ఊరట కలిగించే ప్రకటన చేశారు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ. బడ్జెట్‌లో ఎక్సైజ్ డ్యూటీని తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. బ్రాండెడ్, అన్‌బ్రాండెడ్ పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీని తగ్గిస్తున్నట్లు జైట్లీ స్పష్టంచేశారు. అన్‌బ్రాండెడ్ పెట్రోల్‌పై ప్రస్తుతం లీటర్‌కు రూ.6.48 బేసిక్ ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. ఇప్పుడు దానిని రూ.4.48కి తగ్గించారు. బ్రాండెడ్ పెట్రోల్‌పై రూ.7.66గా ఉన్న డ్యూటీని రూ.5.66కు తగ్గించారు. అటు అన్‌బ్రాండెడ్ డీజిల్‌పై రూ.8.33గా ఉన్న ఎక్సైజ్ డ్యూటీ రూ.6.33కి తగ్గించగా.. బ్రాండెడ్ డీజిల్‌పై రూ.10.69గా ఉన్న బేసిక్ ఎక్సైజ్ డ్యూటీ రూ.8.69కు తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.2 మేర తగ్గే అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం వల్ల పెట్రోల్, డీజిల్ ధరలు ఆల్‌టైమ్ హైని తాకుతున్న విషయం తెలిసిందే. గురువారం ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పుణె, చెన్నై, నోయిడాలలో పెట్రోల్ రూ.80ని తాకింది. డీజిల్ ధర రూ.68.17గా రికార్డయింది. నెల రోజులుగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో సామాన్యుడు బెంబేలెత్తుతున్నాడు. గతేడాది అక్టోబర్‌లోనూ ఎక్సైజ్ డ్యూటీని లీటర్‌కు రూ.2 తగ్గించిన విషయం తెలిసిందే. అయితే పెట్రోల్, డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే అంశంపై మాత్రం ఇప్పటివరకు ఆర్థిక మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వలేదు.

ధరలు పెరిగేవి



ధరలు తగ్గేవి



- ముడి జీడిపప్పు
- సోలార్ స్వభావిత గ్లాసు, సోలార్‌ప్యానెల్స్, మాడ్యూల్స్ తయారీకి వినియోగించే గ్లాసు
- ముడిపదార్థాలు, కాక్లియర్ ఇంప్లాంట్స్‌కు సంబంధించిన పార్టులు
- గుర్తించిన ఎలక్ట్రానిక్స్ వంటి బాల్ స్క్రూలు,కాపిటల్ గూడ్స్

బిట్‌కాయిన్స్‌కు నో



న్యూఢిల్లీ : బిట్‌కాయిన్స్ వంటి క్రిప్టో కరెన్సీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపనుంది. వీటి వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ క్రిప్టో కరెన్సీల వాడకాన్ని ప్రస్తావించారు. వీటిని నిరోధించేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. చెల్లింపు వ్యవస్థల్లో బ్లాక్‌చైన్ టెక్నాలజీని పెద్దఎత్తున ప్రోత్సహిస్తామన్నారు. మరోవైపు బిట్‌కాయిన్స్‌పై మదుపుదారులు అప్రమత్తంగా ఉండాలని, వీటి ఒడిదుడుకులకు ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోవాలని ఆర్‌బీఐ ఇప్పటికే హెచ్చరించింది.

విమానయానంపై బాదుడు



దేశంలో ప్రస్తుతం ఉన్న 124 ఎయిర్‌పోర్ట్‌లను 5 రెట్లు పెంచుతామని ఏడాది వంద కోట్ల విమాన రాకపోకలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. ఉడాన్ పథకం ద్వారా 56 అన్‌రిజర్వ్‌డ్ ఎయిర్ పోర్ట్‌లు, 31 అన్‌సర్వ్‌డ్ హెలిప్యాడ్ల అనుసంధానం చేపడతామని చెప్పారు. పౌరవిమానయాన రంగం కొత్తపుంతలు తొక్కేలా పలు చర్యలు చేపడతామన్నారు. ఎయిర్ ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణపై ఆర్థిక మంత్రి ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం.

ఎప్పటి మాదిరిగానే...



కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వ చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌ను నేడు(ఫిబ్రవరి 1న) ప్రవేశపెట్టారు. అయితే ఈసారి ఆర్థిక మంత్రి సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తారని, తొలిసారి హిందీలో బడ్జెట్‌ను ప్రసంగిస్తారని వార్తలు వచ్చాయి. కానీ అంచనాలకు భిన్నంగా ఆయన సంప్రదాయాన్నే కొనసాగించారు. అందరికీ అర్థమయ్యేలా జైట్లీ ఎప్పటిలాగనే, ఆంగ్లంలోనే బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక ప్రవేశపెట్టనున్న తొలి బడ్జెట్ కావడం మరో విశేషం. జీఎస్టీ అమలుతో పేదలకు మేలు జరిగిందన్నారు. అంచనా వేసిన విధంగా బడ్జెట్ ప్రసంగంలో మొట్ట మొదట రైతుల కోసం తీసుకోయే సంస్కరణలపై ప్రసంగించడం ప్రారంభించారు. ఈ ఏడాది అగ్రకల్చర్ రూరల్ ఎకానమీపై ఎక్కువగా దృష్టిసారించనున్నట్టు మంత్రి చెప్పారు. ప్రపంచంలో అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ ఉందన్నారు.

మొబైల్ ఫోన్లకు షాక్



మొబైల్ ఫోన్లకు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ షాకిచ్చారు. గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 20 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారు. స్థానిక తయారీని ప్రోత్సహించడానికి అరుణ్‌జైట్లీ ఈ ప్రకటన చేశారు. 2017 డిసెంబర్‌లోనే దిగుమతి చేసుకునే స్మార్ట్‌ఫోన్లపై 15 శాతం కస్టమ్స్ డ్యూటీ చెల్లించాలంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. మరో నెల వ్యవధిలోనే మరోసారి మొబైల్ ఫోన్లకు కేంద్రం షాకిచ్చింది. ఈ ప్రభావం ఎక్కువగా ఆపిల్ వంటి కంపెనీలపై ప్రభావం చూపనున్నట్టు టెక్ వర్గాలు చెప్పాయి. చైనా ఫోన్లపై మరింత ప్రభావం ఉంటుందన్నారు. గత నెలలోనే మొబైల్ ఫోన్లపై కస్టమ్ డ్యూటీతో పాటు టీవీలు, మైక్రోవేవ్ అవెన్లపై కూడా కస్టమ్స్ డ్యూటీని కేంద్రం 20 శాతానికి పెంచింది. తద్వారా విదేశీ దిగుమతులు తగ్గి దేశీయ కంపెనీలకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో ఫోన్లను భారత్‌లో తయారు చేసే విధానాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం చూస్తున్నట్టు పరోక్ష పన్నుల కన్సల్టెన్సీ ఈవై హెడ్ బిపిన్ సప్రా తెలిపారు. కొన్ని వాహనాల పరికరాలపై కూడా కస్టమ్స్ డ్యూటీని పెంచారు. ఆరెంజ్ జ్యూస్‌లు కూడా కూరగాయలు. పండ్ల జ్యూసుల ధరలు కూడా 50 శాతం పెరగనున్నాయి. గోల్డ్, సిల్వర్‌పై సాంఘిక సంక్షేమ సర్‌ఛార్జీని విధించారు. స్మార్ట్‌వాచస్, ఫుట్‌వేర్ భాగాలపై కూడా కస్టమ్స్ డ్యూటీని పెంచారు.

ఆహార శుద్ధి రంగానికి రూ.1400 కోట్లు



రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్నది ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని అరుణ్ జైట్లీ తెలిపారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధి కోసం రూ.2వేల కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ ధర తక్కువగా ఉన్నప్పటికీ రైతుల నుంచి మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మార్చి నాటికి 585 మార్కెట్లను ఈనామ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. ధాన్యం, పప్పు దినుసుల మద్దతు ధర ఒకటిన్నర రెట్లు పెంచినట్లు తెలిపారు. వ్యవసాయ ఎగుమతుల్లో సరళీకరణకు పెద్దపీట వేస్తున్నామని, సేంద్రియ వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు జైట్లీ తెలిపారు. పాడిరైతులు, ఆక్వా రైతులు సహా దేశంలోని రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇస్తామన్నారు. ఆహార శుద్ధి రంగానికి రూ. 1,400కోట్లు కేటాయించామని, దేశవ్యాప్తంగా ఆహారశుద్ధి, వాణిజ్య శాఖలతో కలిసి వ్యవసాయ ఉత్పత్తుల క్లస్టర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

బడ్జెట్ తయారీ ఇలా...

బడ్జెట్. అనగానే చాలామంది లెక్కల చిక్కులే అనుకుంటారు! కానీ ఈ మూడక్షరాల వెనుక ఆరునెలల కృషి దాగుంటుంది. ఎంతో కసరత్తు. లెక్కకు మించి భేటీలు. ఆద్యంతం గోప్యత. అబ్బో చాలా తతంగమే ఉంటుంది. అదేంటో మీరే ఓ లుక్కేయండి!

ఆగస్టు చివర్లో...

రానున్న ఆర్థిక సంవత్సరంలో ఏయే రంగానికి ఎంత ఖర్చు పెట్టాలన్న కసరత్తు మొదలవుతుంది. దేశంలో మొత్తం జనాభా తమ తిండి కోసం ఏడాది అంతా ఎంత ఖర్చు చేస్తున్నారో దాదాపు ఆంత మొత్తాన్ని ప్రభుత్వం బడ్జెట్టు కేటాయిస్తుంది.

సెప్టెంబరు చివర్లో...

తమకు కావాల్సిన నిధులపై వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు ఆర్థికశాఖతో చర్చల్లో తలమునకలవుతారు.

అక్టోబర్



ముసాయిదా బడ్జెట్ కాపీలను అధికారులు ఆర్థిక మంత్రికి నివేదిస్తారు. ఈ ముసాయిదా పత్రాలన్నీ నీలం రంగులో ఉంటాయి.

నవంబర్

పారిశ్రామిక, బ్యాంకింగ్ రంగాలకు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు ఆర్థికమంత్రిని కలసి తమ సమస్యలను సలహాలను, సూచనలను అందజేస్తారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి అందరి వాదనలు వింటారుగానీ ఎవరికీ నిర్దిష్టమైన హామీ ఇవ్వరు.

ముద్రణ ప్రక్రియ




బడ్జెట్‌కు సంబంధించిన అన్ని వివరాలను అత్యంత రహస్యంగా ఉంచేందుకు జనవరి నుంచి ఆర్థికమంత్రిత్వశాఖ కార్యాలయాల్లోకి జర్నలిస్టుల ప్రవేశాన్ని నిషేధిస్తారు.

ఫోన్ ట్యాపింగ్

బడ్జెట్ ప్రతిపాదనలు ఏమాత్రం లీక్ కాకుండా చూసే బాధ్యతను ఇంటెలిజెన్స్ విభాగం చూసుకుంటుంది. ఇందుకు కొందరు ఉన్నతాధికారుల ఫోన్లను సైతం ట్యాప్ చేస్తుంటుంది.

సందర్శకులపై మూడో కన్ను



ఆర్థిక కార్యాలయానికి వచ్చే సందర్శకులపై సీసీటీవీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంటుంది. ఈ కెమెరాల పరిధిని దాటి వారు కనీసం కుర్చీలపై కూర్చోవ డానికి కూడా అనుమతి ఉండదు.


జనవరి చివర్లో..

బడ్జెట్ పత్రాలను తయారు చేసే 'ప్రింటింగ్ ప్రెస్' సిబ్బందిని ఎవరితో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంచుతారు. వీరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుతారు.

ఆహారంపై ఎంత జాగ్రత్తో...

ప్రింటింగ్ ప్రెస్ సిబ్బందికి అందించే తిండిపై అత్యంత జాగ్రత్త తీసుకుంటారు. ఏ ఆహారాన్నైనా పరీక్షించిన తర్వాతే వారికి ఇస్తారు.

అత్యవసర సమయాల్లో..





ముద్రణ విభాగంలో పనిచేసే సిబ్బంది ఎవరైనా అత్యవసరంగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే... సదరు వ్యక్తి వెంట ఓ ఇంటెలిజెన్స్ అధికారి, ఓ పోలీసు ఉంటారు. వారు అనుక్షణం ఆయనను నీడలా అనుసరిస్తారు.

సూర్యకాంతి ..



జీవులన్నిటికి సూర్యకాంతి ప్రాణాధారం. సూర్యకాంతి లేనిదే జీవుల మనుగడలేదు. సూర్యకాంతిని ఉపయోగించుకొని మొక్కలు కిరణజన్యసంయోగక్రియ ద్వారా ఆహారం తయారుచేసుకుంటాయి. అయితే సూర్యకాంతి ఏడువర్ణాల కలయిక అని వైజ్ఞానికులు చెబుతారు. అలాగే సూర్యునికి వాహనం ఏడు గుర్రాలున్న రథం అని చెబుతారు వేదాలలో. దానినే సప్తాశ్వములు కూర్చబడిన రథం అని అంటారు. అయితే ఆ ఏడుగుర్రాలకు ఏడు పేర్లున్నాయి. అవి 1. గాయత్రి, 2. త్రిష్టుప్పు, 3. అనుష్టుప్పు,4. జగతి, 5. పంక్తి, 6. బృహతి, 7. ఉష్ణిక్కు. వీటి రూపాలు కూడా సూర్యునికాంతిలో ఉండే ఏడురంగులకు సరిపోతాయి.





కృతజ్ఞత

రామయ్య పొలంపని చూసుకొని భోజనం చేద్దామని ఇంటికి తిరిగి వస్తున్నాడు. దారిలో ఒక చెట్టు కింద ఉచ్చులో చిక్కుకున్న పావురాన్ని చూశాడు. అది ప్రాణభయంతో గిలగిల కొట్టుకుంటుంది. అయ్యో పాపం! అనుకుంటూ రామయ్య దాన్ని ఉచ్చు నుండి బయటకు తీసి పైకి ఎగరవేశాడు. మరునాడు ఉదయం పొలం పని చూసుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు రామయ్య. మార్గమధ్యంలో ఉండగా వర్షం ప్రారంభమయింది. తడవకుండా ఎక్కడన్నా తలదాచుకుందామని చూస్తే ఓ పాడుబడ్డ సత్రం కనిపించింది. గబగబా ఆ సత్రం లోపలికి వెళ్ళాడు. గోడకానుకుని నిలబడి ఈ వర్షం ఎప్పుడు తగ్గుతుందో, నేను ఎప్పుడు ఇంటికి వెళ్ళి భోజనం చేయాలో అని అనుకుంటూ ఆలోచిస్తూ నిలుచున్నాడు. ఆ సత్రంలో ఎత్తయిన కోటలో గూటిని నిర్మించుకుని ఒక పావురం నివసిస్తుంది. ఆ పావురం గూటిలో నుంచి బయటికి వచ్చి నిలబడిన వ్యక్తిని తన ప్రాణాన్ని కాపాడిన ప్రాణదాత రామయ్యగా గుర్తించింది. దాని మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. ఇంతలో వానకు నాని మెల్లగా కూలబోతున్న గోడను గమనించింది పావురం. ఇక ఆలస్యం చేస్తే ఆ గోడకూలి రామయ్య మరణించటం జరుగుతుందని రివ్వున ఎగురులూ వచ్చింది. రామయ్య తలగుడ్డ తన్నుకుని వెళ్ళి ముందు పడేసింది. రామయ్య తన తలగుడ్డ కొరకు ముందుకు వెళ్ళి వంగి దానిని తీసుకున్నాడు. రామయ్య ముందుకు రాగానే వెనుక పెద్ద శబ్దం కావటంతో వెనక్కి తిరిగి చూశాడు. అంత వరకు తను నిలబడిన చోటున గోడ కూలిపోయింది. తన ప్రాణాలు కాపాడిన పావురం వైపు కృతజ్ఞతగా చూస్తూ నెమ్మదిగా ఇల్లు చేరాడు.



పసివయసు - పెద్ద మనసు



విద్యానంద్ పదకొండేళ్ళ అమ్మాయి. అమెరికాలోని లారల్ స్ప్రింగ్స్ స్కూల్‌లో ఆరోతరగతి చదువుకుంటోంది. వయసుకు మించి సాయం చేసింది. ఆ సాయం ఏమిటి అనుకుంటున్నారా! తను అందమైన పెయింటింగ్‌లను వేస్తుంది. తను వేసిన పెయింటింగ్‌లను ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో పెట్టి దాదాపు 3లక్షల రూపాయలు సంపాదించింది. ఆ వచ్చిన సొమ్ముతో తను సరదాగా ఖర్చుపెట్టుకోలేదు. ఆ డబ్బును మనదేశంలోని శంకర్ ఐ ఫౌండేషన్‌కి విరాళంగా అందించింది. ఆ సంస్థవారు ఆ పాప ఇచ్చిన విరాళంతో 150మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. దీనికి స్ఫూర్తి మా నాయనమ్మ అంటుంది ఈ చిన్నారి. సమయానికి చికిత్స చేయించుకోకపోవడంతో తన నాయనమ్మ కంటిచూపును కోల్పోయిందని బాధపడుతుంది. మరెవ్వరికి అలాంటి పరిస్థితి కలగకూడదని తాను ఈ పనిచేసానని అంటుంది. అలాగే కంటిసమస్యలతో బాధపడుతున్న పేదవారికి సహాయం చేయాలనుకుంది. చూశారా! చిన్నపిల్ల అయినా ఎంత పెద్దమనసో కదా!

సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి వదిలేస్తున్నారా..



సెల్‌ఫోన్‌లో వాడే బ్యాటరీని రీచార్జబుల్ బ్యాటరీ అంటారు. అందులో సాధారణంగా లిథియంను వాడతారు. చార్జింగ్ అయిపోయిన తర్వాత కూడా అలాగే ఉంచేస్తే పెద్దగా ప్రమాదం ఉండకపోయినా, బ్యాటరీ వేడెక్కి తన జీవితకాలాన్ని కోల్పోతుంది. కొన్ని నాసిరకం బ్యాటరీలైతే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. కాబట్టి సెల్‌ఫోన్‌కు రాత్రిళ్లు చార్జింగ్ పెట్టి నిద్రలోకి జారిపోవడం మంచిది కాదు. చార్జింగ్ అయిపోగానే చార్జర్ నుంచి సెల్‌ను, ప్లగ్ నుంచి చార్జర్ పిన్నును కూడా తొలగించడం మంచిది. కొన్ని కొత్త మొబైల్స్‌లో చార్జింగ్ అయిపోగానే సర్క్యూట్ బ్రేక్ అయ్యే సదుపాయం ఉంది.

చెప్పుకోండి చూద్దాం..

ఒక కార్పెంటర్ లావుగా ఉన్న ఒక మొద్దును పదకొండు సమాన భాగాలుగా చేయాలనుకున్నాడు. ఒక్కో భాగం కట్ చేయడానికి ఒక్కో నిమిషం పడుతుంది. ఆ మొద్దును పదకొండు భాగాలు చేయడానికి ఎంత సమయం పడుతుంది?

సమాధానం : పది నిమిషాలు పడుతుంది. ఎందుకంటే, 10వ భాగం కట్ చేస్తున్నప్పుడే 11వ భాగం కూడా కట్ అవుతుంది.

విధేయత లేని స్వేచ్ఛ అరాచకం, స్వేచ్ఛలేని విధేయత బానిసతనం
- విలియం పెన్



2018లో సెకండాఫ్‌లో రాజమౌళి మూవీ?



బాహుబలి సినిమా తరవాత రాజమౌళి డైరెక్షన్‌లో తెరకెక్కనున్న మూవీ ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ స్టేజ్‌లో ఉంది. టాలీవుడ్ టాప్ స్టార్స్ జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్‌లు హీరోలుగా నటించనున్న ఈ సినిమాపై ఇప్పటి నుంచే విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ప్రస్తుతం 'రంగస్థలం' సినిమాతో సెట్స్‌పై ఉన్న రామ్‌చరణ్, త్వరలో బోయపాటి శ్రీను సినిమాతో బిజీ కానున్నాడు. మరోపక్క తారక్ కూడా రేపో మాపో త్రివిక్రమ్ సినిమాతో సెట్స్ పైకి రాబోతున్నాడు. ఈ షెడ్యూల్స్ ఇలా ఉంటూనే రాజమౌళి సినిమా కోసం ఇద్దరు స్టార్స్ ఎదురుచూస్తున్నారు. అయితే రాజమౌళి టీమ్, 2018 సెకండాఫ్‌లో సినిమాను సెట్స్ పైకి తీసుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమాను డివివి దానయ్య నిర్మిస్తున్నారు.

ప్రతిభావంతుడికి సాయిధరమ్ తేజ్ సాయం

సూర్యాపేట జిల్లాకు చెందిన రంగుల నరేష్ యాదవ్ దివ్యాంగుడు. పారా అథ్లెట్ నరేష్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికైనా అక్కడికి వెళ్లేందుకు డబ్బులు లేక అనేక ఇక్కట్లు పడుతున్నాడు. ఈ విషయమై ఈ నెల 31న ఓ ప్రముఖ పత్రికలో వచ్చిన కథనం చదవి వెంటనే హీరో సాయిధరమ్ తేజ్ స్పందించారు. గురువారం నరేశ్ యాదవ్‌కు లక్ష రూపాయిల చెక్కును స్వయంగా అందజేశారు. అనంతరం నరేష్ గురించిన వివరాలు, వాలీబాల్ ప్రాక్టీస్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించాలని కోరుతూ నరేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నరేష్ యాదవ్ సాధించిన విజయాలు

చిన్నప్పుడే నరేష్ ఎడమ కాలికి పోలియో సోకింది. వైకల్యాన్ని అధిగమించి ఎంతో పట్టుదలతో పారా అథ్లెట్‌గా అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ఒకవైపు ఎంటెక్ చదువుతూనే పారా బ్యాడ్మింటన్, వాలీబాల్, అథ్లెటిక్స్ మూడింటిలోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. గతేడాది హైదరాబాద్‌లో జరిగిన జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో కాంస్య పతకం, శ్రీలంకతో జరిగిన పారా వాలీబాల్ టోర్నీలో స్వర్ణం, 2015 నేషనల్ సిట్టింగ్, స్టాండింగ్ వాలీబాల్ టోర్నీల్లో కాంస్య పతకాలు, జాతీయ అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లో రజతంతో సత్తా చాటాడు. ఇప్పుడు భారత్, శ్రీలంక, థాయ్‌లాండ్ మధ్య జరగనున్న సిట్టింగ్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జాతీయ జట్టుకు ఎంపిక య్యాడు. ఈ టోర్నీ బ్యాంకాక్‌లో ఫిబ్రవరి 24 నుంచి 26 వరకూ జరగనుంది. అయితే, ఈ టోర్నీకి ఎంపికైన సభ్యులు.. బ్యాంకాక్ ప్రయాణంతో పాటు వీసా, లైసెన్స్, ఎంట్రీ ఫీజు, ఏడు రోజులకు గాను భోజన, వసతి, స్పోర్ట్స్ కిట్, కోచింగ్ ఫీజులను ఎవరికి వారే భరించాలని భారత పారా ఒలింపిక్ వాలీబాల్ సమాఖ్య తెలిపింది. ఇందుకుగాను దాదాపు లక్ష రూపాయలు ఖర్చవుతుంది. ఆ మొత్తం



ఫిబ్రవరి 15వ తేదీలోపు చెల్లిస్తేనే నరేష్ ఈ టోర్నీలో పాల్గొంటాడు. పేద కుటుంబానికి చెందిన తాను ఇంత మొత్తం భరించలేని స్థితిలో ఉన్నానని నరేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. సాయం చేయాలని శాట్స్‌కు అర్జీ పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. రాష్ట్ర క్రీడా పాలసీలో పారా ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన వారికే తప్ప మిగతా పారా అథ్లెట్లకు సహాయం చేసే జీవో లేదని అధికారులు చెబుతున్నారని నరేష్ చెప్పాడు. దాంతో అంతర్జాతీయ టోర్నీలో దేశానికి ప్రాతినిథ్యం వహించే అవకాశం వచ్చినా.. డబ్బు లేక దాన్ని కోల్పోయేలా ఉన్నానని వాపోతున్నాడు. క్రీడా అధికారులతో పాటు దాతలు ఎవరైనా సాయం చేస్తే బ్యాంకాక్ వెళ్లి టోర్నీలో సత్తా చాటుతానని నరేష్ చెబుతున్నాడు. తనకు సాయం చేయాలనుకునే వారు 96665 93696, 97002 85868 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కథనానికి స్పందించి నరేష్ బ్యాంకాక్ ప్రయాణంతో పాటు వీసా, లైసెన్స్, ఎంట్రీ ఫీజు, ఏడు రోజులకుగాను భోజన వసతి, స్పోర్ట్స్ కిట్, కోచింగ్ ఫీజులకు సహాయం చేసిన సాయిధరమ్‌కు నరేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

పాంబన్‌గా శరత్ కుమార్



'చెన్నైయిల్ ఒరునాల్ 2' తర్వాత శరత్‌కుమార్ నటిస్తున్న కొత్త చిత్రానికి 'పాంబన్' అని పేరుపెట్టారు. ఎ. వెంకటేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను తాజాగా ఆవిష్కరించారు. ఎస్ఎస్‌కే ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దేవా సంగీతంలోని ఈ సినిమా పాటల రికార్డింగ్ పనులు ఆరంభమయ్యాయి. ఈ చిత్రంలో శరత్‌కుమార్ వైవిధ్యమైన పాత్ర పోషిస్తున్నారు. పాము రూపంతో ఉన్న ఫస్ట్‌లుక్‌ను ఆయనే తన ఫేస్‌బుక్ ఖాతాలో విడుదల చేశారు. భిన్నమైన కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నామని, ఇతర నటీనటుల ఎంపిక జరుగుతోందని చిత్రయూనిట్ పేర్కొంది. త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.

నాకు ఆమెకూ పెళ్లా? : నాగశౌర్య

నాగశౌర్య, నిహారికలకు పెళ్ళి అంటూ మీడియాలో వస్తున్న కథనాలపై క్లారిటీ ఇచ్చాడు నాగశౌర్య. "నిహారికతో నాకు పెళ్లంటూ వార్తలు వస్తున్నాయి. నాకు ఏ సంబంధం లేదు. వేరే ఫ్రెండ్స్ కూడా నాకు చెప్పారు. నేనే షాక్‌లో ఉన్నాను. ఏం జరుగుతుందో చూడాలి. నాకు హీరోయిన్లు ఎవరితో సంబంధం లేదు. నా దృష్టి మొత్తం సినిమాలపైనే ఉంది. మా అమ్మ బలవంతం చేస్తే మరో నాలుగేళ్లలో పెళ్లి చేసుకుంటానేమో. అమ్మ చూసిన ఏ అమ్మాయి అయినా నాకు ఓకే." అని చెప్పాడు నాగశౌర్య. మీడియాలో వస్తున్న పుకార్లకు ఈ ప్రకటనతో చెక్ పెట్టారు నాగశౌర్య. 'ఛలో' సినిమా తరవాత వెంటనే ఈ సినిమాకు కెమెరామెన్‌గా పనిచేసిన సాయి శ్రీరామ్ డైరెక్షన్‌లో నటించనున్నాడు నాగశౌర్య. ఆ తర్వాత తన సొంత నిర్మాణంలో 'నర్తనశాల' అనే సినిమాలో నటించనున్నాడు.

తారక్ సరసన పూజా హెగ్డే?



యంగ్ టైగర్ ఎన్టీఆర్ తదుపరి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలో చేయబోతున్న సంగతి తెలిసిందే. మార్చి నుండి సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్రివిక్రమ్ ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రద్ధాకపూర్ పేరుని పరిశీలించారు. అయితే శ్రద్ధా కపూర్ ఒప్పుకోలేదో మరేదైనా కారణమో కానీ.. ఇప్పుడు దర్శక నిర్మాతలు హీరోయిన్‌గా పూజా హెగ్డేను ఓకే చేశారని సమాచారం. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్ చిత్రంలో నటిస్తున్న పూజా హెగ్డే మహేష్ 25వ చిత్రంలో నటించనుంది.

మార్చి 1 నుంచి థియేటర్ల మూసివేత?


- **దక్షిణ భారత చలనచిత్ర మండలి హెచ్చరిక**
- **డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల దోపిడీ నియంత్రించాలని డిమాండ్**



డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల గురించి చర్చించేందుకు తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి కార్యాలయంలో బుధవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. దీనికి సంబంధించిన వివరాలు పత్రికా ప్రకటనలో విడుదల చేశారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ వసూలు చేస్తున్న ఛార్జీలపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. "మనం తీసే సినిమా ప్రతిఫలం మనం అందుకోకుండా డిజిటల్ ప్రొవైడర్స్ అన్యాయంగా దోచుకుంటున్నారని" అందరూ అభిప్రాయపడ్డారు. ఈస్ట్ ఇండియా కంపెనీలా తయారై అధికంగా డబ్బు గుంజుతున్నారని అందరూ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌ని రాకుండా కొందరు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు సిండికేట్ అయి ఆపేస్తున్నారని సభ్యులందరూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో ఒక వారంలోగా సమావేశం ఏర్పాటు చేసి ధరల తగ్గింపు, ఇతరత్ర విషయాలపై చర్చించాలని సమావేశంలో నిర్ణయించారు. వారం రోజుల్లోగా ఈ సమస్యకు పరిష్కారం లభించకపోతే మార్చి 1 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని థియేటర్లను మూసివేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షులు పి. కిరణ్, సెక్రటరీలు ఎమ్ . రామదాసు, కె. శివప్రసాదరావు, తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు కె. మురళీ మోహన్, సెక్రటరీ సునీల్ నారంగ్ , దక్షిణాది ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు ఎల్. సురేష్, జాయింట్ సెక్రటరీ శ్రీ రవి కొట్టరాకర, తమిళ సినిమా నిర్మాతల సంఘం అధ్యక్షుడు విశాల్ కృష్ణ, సెక్రటరీ కతీర్ సేన్, కర్ణాటక ఫిలిం ఛాంబర్ సెక్రటరీ ఎన్.ఎమ్ సురేష్, కేరళ ఫిలిఛాంబర్ అధ్యక్షులు కె. విజయ్ కుమార్, కేరళ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ సంఘం అధ్యక్షులు సియ్యాద్ కొక్కెర, కేరళ ఫిలిం నిర్మాతల సంఘం అధ్యక్షులు జి. సురేష్ కుమార్ , నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు.

రూపాయి రాక(పైసల్లో)

అప్పులు : 19
కార్పొరేషన్ పన్ను : 19
ఆదాయపు పన్ను : 16
కేంద్ర ఎక్సైజ్ పన్ను : 8
జీఎస్టీ, ఇతర పన్నులు : 23
పన్నేతర ఆదాయం : 8
క?స్టమ్స్ : 4
రుణేతర మూలధన వసూళ్లు : 3





రూపాయి పోక(పైసల్లో)

ఇతర ప్రణాళికేతర వ్యయాలు : 8
పెన్షన్లు : 5
పన్నులు, డ్యూటీల్లో రాష్ట్రాల వాటా : 24
రక్షణ రంగం : 9
సబ్సిడీలు : 9
రాష్ట్రాలు, యూటీలకు ప్రణాళిక సహకారం : 24
కేంద్రం అందించే పథకం : 9
కేంద్ర రంగ పథకం : 10
వడ్డీ చెల్లింపులు : 18
ఫైనాన్స్ కమిషన్ ఇతర ట్రాన్స్‌ఫర్స్ : 8

రక్షణకు రెండు పారిశ్రామిక కారిడార్లు

న్యూఢిల్లీ : రక్షణ రంగాన్ని బలోపేతం చేసేందుకు 'ఇండస్ట్రీఫ్రెండ్లీ మిలటరీ ప్రొడక్షన్ పాలసీ-2018'ని తీసు కొస్తున్నట్టు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. రెండు పారిశ్రామిక కారిడార్లనూ అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఈశాన్యంలోనూ, జమ్మూకాశ్మీర్ సరిహద్దు వద్ద ఎదురవుతున్న సవాళ్లను సైన్యం సమర్థవంతంగా ఎదుర్కొంటోందని జైట్లీ కొనియాడారు. మూడున్నరేళ్లలో భద్రతాపరమైన కార్యాకలాపాలను పెంపొందించేందుకు, సైనిక సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అత్యాధునిక వసతులను కల్పించామన్నారు. పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు ఎంఎస్‌ఎంఈల ద్వారా దేశీయ ఉత్పత్తులను పెంచేందుకు పరిశ్రమలకు అనుకూలమైన ఉత్పత్తి విధానాన్ని తీసుకురానున్నట్టు వివరించారు. ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ)తో సహా ప్రైవేటు పెట్టుబడులను రాబట్టే విధంగా చర్యలు తీసుకున్నామని జైట్లీ తెలిపారు.

ఇదేనా రైతు భారతం ?

- వ్యవసాయానికి రూ. 2,39,882 కోట్లు
- గతేదాది రూ.2,06,871.70 కోట్లు
- రూ.33 వేల కోట్లు మాత్రమే అధికం
- లక్ష కోట్ల మేర రుణ వితరణ
- కనీస మద్దతు ధర ఒకటిన్నర రెట్లు పెంపు
- రూ.2 వేల కోట్ల మూలధనంతో అగ్రి మార్కెట్లు



న్యూఢిల్లీ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీని కంగు తినిపించాయి. గ్రామీణ ఓటర్లు బీజేపీని చావుదెబ్బ తీశారు. పట్టణప్రాంతాల్లో పట్టు సాధించిన బీజేపీ... గ్రామీణ ప్రాంతంలో కనీస ఆదరణ లభించకపోవడంతో తాజా కేంద్ర బడ్జెట్ ఆ ప్రాంత ఓటర్లను లక్ష్యంగా చేసుకున్నది. త్వరలో జరగనున్న కర్నాటక, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించింది. గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక వృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు భ్రమలు కల్పించింది. ప్రత్యేకించి వ్యవసాయాన్ని ఆదుకునే ప్రయత్నం కనిపించినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. 2018-19 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.2,39,882 కోట్లు కేటాయించింది. గత కేటాయింపుల కన్నా ఇది కేవలం రూ.33 వేల కోట్లు మాత్రమే అధికం. గత బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.2,06,871.70 కోట్లు కేటాయించింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయాన్ని, రైతులను ఆదుకుంటామని చెప్పినప్పటికీ ఈ కేటాయింపులు నామమాత్రమే. దీని ద్వారా వ్యవసాయ రంగం అద్భుత ఫలితాలు సాధించేదేమీ ఉండదు. దీనికితోడు ప్రభుత్వాలు గొప్పల కోసం కేటాయింపులు మాత్రమే చేస్తాయి. వాటిని ఖర్చు పెట్టడంపై కనీస శ్రద్ధ వహించవు. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నరేంద్ర మోడీ సర్కారు గ్రామీణ భారతంపై ప్రత్యేక శ్రద్ధపెట్టింది. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసినట్టు కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంత రైతులు, వ్యవసాయ కూలీలు లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ను పెంచాలని నిర్ణయం తీసుకున్నది. బహుశా ఇదే ఈ ఏడాది అతిపెద్ద నిర్ణయం. ఇది కూడా అరకొర సాయం మాత్రమే. ఈ ఖరీఫ్ పంటల నుంచే కనీస మద్దతు ధర.. ఉత్పాదన వ్యయానికంటే ఒకటిన్నర రెట్లు (150శాతం ఎక్కువ) ఉండాలని నిర్ణయించింది. వ్యవస్థీకృత సాగు, సామూహిక వ్యవసాయ విధానాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జైట్లీ చెప్పుకొచ్చారు.

వచ్చే ఏడాది రూ. 11 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు అందచేస్తామని జైట్లీ వెల్లడించారు. గత బడ్జెట్‌లో రైతులకు వ్యవసాయ రుణాలు రూ. 10 లక్షల కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో రూ.11 లక్షల కోట్లు కేటాయించారు. భారత్ వ్యవసాయాధారిత దేశమని పదేపదే చెబుతున్న మోడీ సర్కారు...కంటితుడుపుగా కేవలం మరో లక్ష కోట్లు మాత్రమే పెంచింది. 2018-19 బడ్జెట్‌లో రూ. లక్ష కోట్ల మేర రుణ వితరణ పెంచారు. రైతులకు కనీసం 50 శాతం లాభాలు వచ్చేలా చూస్తామని.. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే చర్యలు చేపడతామని నమ్మబలికారు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతమే తమ ప్రాధాన్యతలని అన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ముఖ్యాంశాలను పరిశీలిస్తే...2022 నాటికి, అంటే 75వ స్వాతంత్ర్యవేడుకల నాటికి దేశంలోని రైతాంగాన్ని బలోపేతం చేస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు(150 శాతానికి) పెంచుతున్నామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ఇది అమలులోకి వస్తుందని జైట్లీ ప్రకటించారు. ఇందుకోసం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో నీతిఆయోగ్ చర్చలు జరిపి, స్పష్టమైన విధానాన్ని రూపొందిస్తుందని తెలిపారు. ఇప్పటికే ప్రవేశపెట్టిన ఈ-నామ్ విధానం విజయవంతంగా అమలవుతున్నదని పేర్కొన్నారు. రైతులను మరింత బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా 22 వేల గ్రామీణ అగ్రి కల్చరల్ మార్కెట్లు ప్రారంభించబోతున్నామని చెప్పారు. 2వేల కోట్ల మూలధనంతో ఈ అగ్రిమార్కెట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా క్లస్టర్లలో జరిగే గ్రామీణ ఉపాధి హామీ, ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేస్తూ, ఆన్‌లైన్ ద్వారా అగ్రిమార్కెట్లకు అనుసంధానం చేస్తామని ప్రకటించారు. 2019 మార్చి నుంచే క్లస్టర్ మోడల్‌ను అమలు చేస్తామన్నారు. అంటే అప్పటికి దేశం సార్వత్రిక ఎన్నికల కోలాహలంలో ఉంటుంది. మారుమూల గ్రామాల్లో పండించిన పంటలు మార్కెట్‌కు చేరేలా.. ప్రధాన మంత్రి గ్రామీణ యోజన ద్వారా పెద్ద ఎత్తున రోడ్లను నిర్మించబోతున్నామని చెప్పారు. కౌలు రైతులకు రుణాలజారీని మరింత సులభతరం చేయబోతున్నామని హామీలు గుప్పించారు.

వృద్ధులపై కొంచెం ఉదారత

- బ్యాంకు వడ్డీ ఆదాయంపై పన్ను పరిమితి రూ.50 వేలకు పెంపు
- వైద్య ఖర్చులపై పన్ను పరిమితి రూ.50 వేలు



న్యూఢిల్లీ : బడ్జెట్లో వయోవృద్ధులకు బాసటగా నిలిచే పలు సానుకూల చర్యలను ప్రకటించారు. ముఖ్యంగా, ఆరోగ్య భద్రత ఆదాయపన్ను పరిమితి తదితర విషయాల్లో స్వల్ప ఉదారత కనబరిచారు. వృద్ధుల బ్యాంకు డిపాజిట్ల నుంచి వార్షిక వడ్డీ రూపంలో లభించే ఆదాయంపై పన్ను పరిమితిని ఐదు రెట్లు- రూ.50వేలకు పెంచారు. ఐటీ సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియం, వైద్యఖర్చుల వ్యయంపై పన్ను పరిమితిని రూ.30వేల నుంచి రూ.50,000లకు పెంచారు. సెక్షన్ 80డీడీబీ కింద కొన్ని రకాల ప్రాణాంతక రోగాల నివారణకు చేయించుకునే వైద్య చికిత్సల ఖర్చులపై పన్ను పరిమితిని రూ.లక్షకు పెంచారు. ఈపెంపుదల వయోవృద్ధులందరకూ వర్తిస్తుంది. ఇవికాక, ప్రధాన మంత్రి వయ వందన యోజన పథకాన్ని 2022 వరకు పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. జీవిత బీమా సంస్థ ద్వారా ఈ పథకం కింద ఎనిమిది శాతం హామీ పూర్వక వడ్డీ చెల్లింపు జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈపథకం కింద మదుపు పరిమితి మొత్తాన్ని రూ.7.5లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచుతున్నామన్నారు మనలను సాకిన వయోవృద్ధుల సంక్షేమాన్ని, వారి హుందా జీవన హక్కును పరిరక్షించడం మన బాధ్యతగా ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన రాయితీల ద్వారా వయోవృద్ధులకు మొత్తం రూ.4,000లకోట్ల మేర ప్రయోజనాలు సమకూరతాయన్నారు.

కార్పొరేట్‌కు దన్ను

30 నుంచి 25శాతానికి తగ్గిన కార్పొరేట్ పన్నురేటు

న్యూఢిల్లీ: వేతన జీవులపై కాకుండా కార్పొరేట్లపై కేంద్రప్రభుత్వం ప్రేమను ఒలకబోసింది. రూ.250కోట్ల టర్నోవర్‌గల కంపెనీలకు 25శాతం కార్పొరేట్ పన్నురేటు విధించేలా బడ్జెట్ ప్రతిపాదించింది. నాలుగేళ్ల కిందట తొలిసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ కార్పొరేట్ పన్నును దశలవారీగా 30 నుంచి 25శాతానికి తగ్గిస్తామని హామీనిచ్చారు. ఆ హామీని జైట్లీ నిలబెట్టుకొన్నారు. 99శాతం కంపెనీల ట్యాక్స్ ఫైలింగ్‌కి దోహదపడే ఎంఎస్‌ఎంఈ రంగానికి లబ్ధిచేకూర్చే ఉద్దేశంతో కార్పొరేట్ పన్నురేటును 25శాతం చేసినట్టు తెలిపారు. తద్వారా 2018-19లో రూ.7వేలకోట్ల రెవెన్యూ అంచనా ఉంది. రూ.250కోట్లకు మించి టర్నోవర్ ఉన్న కంపెనీలకు 30శాతం పన్ను కొనసాగుతుందని తెలిపారు. కార్పొరేట్ పన్నురేటును తగ్గించడంతో పెట్టుబడి పెట్టదగిన అదనపు నిలువ ఉంటుందని, ఉద్యోగాల కల్పనకూ అవకాశం ఉంటుందని జైట్లీ అన్నారు.

ఎంపీల జీతాల పెంపునకు మాత్రం సానుకూలం

న్యూఢిల్లీ : ద్రవ్యోల్బణ ప్రభావంతో ధరలు పెరిగిపోయి సతమతమవుతున్న మధ్యతరగతి లేదా వేతన జీవుల విన్నపాలు మన్నించని సర్కార్ ఎంపీల జీతాల పెంపు విషయంలో సానుకూలంగానే స్పందించింది. అయితే ప్రజల విమర్శలకు భయపడిగా కాబోలు ఐదేళ్లకోమారు ఎంపీల జీతాల సవరణ (రివిజన్) జరపాలని నిర్ణయించారు.ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెంపుదల ఉంటుంది. ఎంపీల జీతభత్యాల విషయమై ప్రజల్లో విమర్శనాత్మక చర్చలు జరుగుతున్నాయని అరుణ్ జైట్లీ తెలిపారు. ఎపుడు వీలయితే అపుడు జీతాలను పెంచేసుకునే ఆనవాయితీ అమలవుతోందనే ఒక విమర్శ జనంలో ఉందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న విధానమూ ఇందుకు సహకరించేదిగానే ఉందన్నారు. దీనిపై జనంలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయని ఆయన అంగీకరించారు. అమల్లోవున్న విధానం స్థానంలో ఎంపీల జీతభత్యాల రివిజనును ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి స్వయంచలితం (ఆటోమేటిక్)గా జరుగుతుందన్నారు. ఈక్రమంలో జీతాలు, నియోజకవర్గభత్యం, కార్యాలయ వ్యయాలు, సమావేశాలకు ఎంపీలకు చెల్లించే భత్యాలన్నిటిని ఏప్రిల్1,2018 నుంచి అమలు జరిగే విధంగా నిర్దిష్ట విధానాన్ని ప్రతిపాదిస్తున్నట్లు జైట్లీ తెలిపారు. తమ ప్రతిపాదనను ఎంపీలు స్వాగతిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఎంపీలకు ప్రస్తుతం చెల్లిస్తున్న నెల జీతం రూ.50వేలు, నియోజకవర్గ భత్యం రూ.45వేలుగా మరి కొన్ని ఇతర భత్యాలు ఉన్నాయి. ఈలెక్కన ప్రతి నెలకూ ఒక్కో ఎంపీ మీద రూ.2.7లక్షల వంతున ప్రభుత్వం వ్యయం చేస్తోంది.

నల్లధనం కట్టడి పాత పాటే



న్యూఢిల్లీ: 2014ఎన్నికల హామీల్లో ఒకటైన నల్లధనం కట్టడి విషయంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గతంలో వినిపించిన పాత పాటనే వినిపించారు. విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కు రప్పిస్తామన్న హామీని బీజేపీ ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోయిన విషయం తెలిసిందే. నల్లధనం కట్టడికే పెద్దనోట్ల రద్దు అమలు జరిపామనీ తమ చర్యలను సమర్థించుకునేందుకు శత విధాలుగా ప్రయత్నించారు.. తాజా బడ్జెట్లోనూ నల్లధనం నిరోధానికి గట్టి ప్రయత్నం చేస్తామంటూ జైట్లీ ప్రకటించారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల కాలంలో పన్ను ఎగవేత దారుల నుంచి రూ.90,000లకోట్లను వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. నిజమైన పన్ను చెల్లింపుదారులను వేధింపులకు గురి చేయబోమన్నారు. పన్ను పరిధిని విస్తరించేందుకే నగదు లావాదేవీల నియంత్రణ మీద దృష్టి నిలిపామన్నారు. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో ప్రత్యక్ష పన్ను వసూళ్లను గణనీయంగా పెంచుకోగలిగినట్లు చెప్పారు. గత సంవత్సర పన్ను వసూళ్లు 12.6శాతంతో ముగిసాయన్నారు. జనవరి 15, 2018 నాటికి ప్రత్యక్ష పన్ను వసూళ్ల వృద్ధిరేటు 18.7శాతంగా ఉందన్నారు.

ముంబై, బెంగళూరు సబర్బన్లకు బొనాంజా

న్యూఢిల్లీ : ఈసారి బడ్జెట్‌లో ముంబై, బెంగళూరు సబర్బన్ రైల్వేనెట్‌వర్క్‌ను పెంచనున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. ముంబై సబర్బన్ రైల్వే నెట్‌వర్క్‌ను 465కి.మీలకుపైగా విస్తరించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.11వేల కోట్లు కేటాయిస్తామని, సిటీ రైల్వే నెట్‌వర్క్ కోసం రూ.40వేల కోట్లు కేటాయించాలని నిర్ణయించామన్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో లోకల్ రైల్వేనెట్‌వర్క్ కోసం రూ.17వేల కార్పస్‌ను జైట్లీ ప్రకటించారు. ఈ ఏడాది చివర్లో కర్ణాటకలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. కాగా, దేశానికి జీవనరేఖగా పరిగణించే ముంబై రవాణా వ్యవస్థ విస్తరణను మరింత పెంచాలని, రూ.11వేల కోట్లతో 90కి.మీల మేర డబుల్‌లైన్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్ట తెలిపారు. రూ.40వేల కోట్లతో సబర్బన్ నెట్‌వర్క్‌ను మరో 150 కి.మీలకు విస్తరించనున్నట్టు వెల్లడించారు. దీంతో 'సెలబ్రేట్ ముంబై' అంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ముంబైలోని సబర్బన్ రైల్వే ఆధ్వర్యంలో 2342 లోకల్ రైళ్లు సేవలందిస్తుండగా, వీటిలో ప్రతి రోజు 7.5మిలియన్ల మంది ప్రయాణిస్తుంటారు. అయితే, లోకల్ నెట్‌వర్క్‌ను విస్తరింపజేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. వచ్చే మూడేళ్లలో బెంగళూరు సబర్బన్ రైల్వే ప్రాజెక్టుల తొలిదశ పనుల కోసం రూ.17వేల కోట్ల కార్పస్‌ను జైట్లీ ప్రకటించారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇండియన్ రైల్వే మధ్య భాగస్వామ్యంతో కొనసాగుతుందని అన్నారు.

మౌలిక రంగానికి రూ.5.97లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థ, జీడీపి వృద్ధిరేటు పురోగమనానికి అత్యంత కీలకమైన మౌలికరంగానికి రూ.5.97లక్షల కోట్లను కేటాయించినట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. రహదారులు, విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వేలు, అంతర్గత జలవనరులు, ప్రజలకు నాణ్యమైన సేవలందించడం వంటి వాటిలో రూ.50లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమవుతాయన్నారు. వృద్ధికి ఊతం, ఉపాధి కల్పన లక్ష్యంగా గత సంవత్సర కేటాయింపులు రూ.4.97లక్షల కోట్ల కంటే ఈఏదాది అదనంగా రూ.లక్ష కోట్లను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ పర్యవేక్షణ విధానం ప్రగతిలోనే రూ.9.46లక్షల కోట్ల కేటాయింపులు జరిపినట్లు చెప్పారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 9,000ల కి.మీ. జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జైట్లీ తెలిపారు. దేశం నలుమూలలా అనుసంధానించేందుకు ఉద్దేశించిన భారత్‌మాల పథ కాన్ని ప్రస్తావంచారు. ఈపథకం తొలి దశ 35వేల కి.మీ. నిర్మాణానికి సుమారు రూ.5.35లక్షల కోట్లు వ్యయం అవుతుందని అంచనాగా ఆయన తెలిపారు.

పాత పథకానికే కొత్త పేరు

- పేదలకు 'ఆయుష్మాన్' గాలం
- రూ.330తో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల వైద్యం
- 10 కోట్ల మందికి ప్రయోజనం
- ఆరోగ్య రంగానికి రూ.1.38 లక్షల కోట్లు
- ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు రూ.1,200 కోట్లు



న్యూఢిల్లీ : బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య రంగానికి సంబంధించి తాజా బడ్జెట్‌లో తిమ్మినిబమ్మిని చేసే ప్రయత్నాలకు ఒడిగట్టింది. పాత పథకాలకే కొత్త పేరు పెట్టుకొచ్చి జాతీయ ఆరోగ్య సంరక్షణ(ఎన్‌హెచ్‌పీఎస్)ని ప్రకటించింది. ప్రపంచంలోనే ఇదే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకమంటూ జైట్లీ పేర్కొనగానే అధికార పక్ష సభ్యులు బల్లలు గుద్ది మరీ హర్షధ్వానాలు చేశారు. కేంద్ర బడ్జెట్‌లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018-19 సంవత్సరాలకు ఆరోగ్య రంగానికి రూ.1.38 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జాతీయ ఆరోగ్య బీమా పథకం ద్వారా నిరుపేదలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయు ష్మాన్ భారత్ కార్యక్రమం కింద ప్రపంచంలోనే ప్రభు త్వ నిధితో కూడిన అతిపెద్ద జాతీయ ఆరోగ్య రక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్)ను ఆయన ప్రకటించారు. 10 కోట్ల పేద ప్రజలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.330 ప్రీమియం చెల్లింపుతో ఏడాదికి రూ.5 లక్షల విలువ చేసే ఆరోగ్య బీమా ప్రకటించారు. ఈ కార్య క్రమం కింద సుమారు 50 కోట్ల మందికి ప్రయోజనం పొందుతారు. ద్వితీయ, తృతియ సంరక్షణా ఆస్పత్రుల్లో ఈ సేవలను పొందవచ్చు. క్షయ రోగులందరికీ పోషకాహారం ఏర్పాటుకు రూ.600 కోట్ల కేటాయించారు. రోగులకు పోషకాహారం కోసం నెలకు రూ.500 చొప్పున అందిస్తారు. ప్రభుత్వ కొత్త ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా 24 ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్లు జైట్లీ తెలిపారు. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇక ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన ద్వారా రూ.2 కోట్లకు పైగా కుటుంబాలు లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు. సమగ్ర ఆరోగ్య సంరక్షణ, పిల్లల సేవలు, మాతృ సంరక్షణ తదితర చికిత్సలు అందించేందుకు 1.5 లక్షల ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రాల వృద్ధి కోసం రూ.1200 కోట్లు కేటాయించారు.

పాత సీసాలో కొత్త సారా..

2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో 'ఆరోగ్యం, విద్య ద్వారా ప్రతి భారతీయుడికి సాధికారం కల్పించాలన్నదే లక్ష్యమని. పిల్లలకు సంబంధించి ఆరోగ్య, విద్య, నైపుణ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రకటించింది. అయితే ఆయా రంగాలకు సంబంధించి ప్రభుత్వం ఇంకా అస్పష్టంగానే ఉంది. జాతీయ ఆరోగ్య రక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్)లో కుటుంబానికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పథకం మొత్తాన్ని పెంచడం మాత్రమే కొత్త అంశమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ కొత్త పథకం బాగా తెలిసిందే. ఎందుకంటే 2016-17 బడ్జెట్‌లో కూడా ఇదే పథకాన్ని ఆర్థిక మంత్రి జైట్లీ ప్రకటించారు. 2016లో ప్రకటించినపుడు దీని మొత్తం ఏడాదికి ఒక కుటుంబానికి రూ.లక్ష వరకు వైద్య సేవల సౌకర్యం ఉంది. ఇందులో 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు మాత్రం మరో రూ.30 వేలు అదనంగా ప్యాకేజీని అప్పట్లో ప్రకటించారు. అయితే ఈ పథకానికి ఇప్పటి వరకు కేంద్ర కేబినెట్ ఆమోదం లేకుండా పోయింది. దానినే కొత్త అవతారంలో ఒక కుటుంబా నికి ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య సేవల మొత్తాన్ని ప్రకటించారు. జాతీయ ఆరోగ్య రక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్) వివిధ పేర్లతో ఏళ్లుగా మారుతూ వచ్చి ఇపుడు తాజాగా వెలుగులోకి వచ్చింది. 2015- 16లో ఆరోగ్య, సామాజిక భద్రతకు సంబంధించి రాష్ట్రీయ స్వాస్థ బీమా యోజన(ఆర్‌ఎస్‌బీవై) రెండు విభాగాలుగా విభజించబడింది. 2016లో రాష్ట్రీయ స్వాస్థ సురక్షా యోజన(ఆర్‌ఎస్‌ఎస్‌వై), 2017లో ఎన్‌హెచ్‌పీఎస్‌గా పేర్లు మార్చినట్లు సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ గవర్నెన్స్ అకౌంటబిలిటీ(సీబీజీఏ) విశ్లేషించింది. 2012వ సంవత్సరం నుంచి ఒకటి లేదా ఇతర రూపాల్లో ఉన్న ఈ పథకాన్ని సీబీజీఏ విశ్లేషించింది. దీనికి కేటాయింపు 2016-17లో బడ్జెట్ అంచనా రూ.1,500 కోట్లకు చేరుకుంది. సంవత్సరానికి సవరించిన అంచనా రూ.724 కోట్లుగా ఉండగా, 2017-18 సంవత్సరానికి బడ్జెట్ అంచనా రూ.1,000 కోట్లు. అయితే గురువారం జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో 2018-19 బడ్జెట్ అంచనాను ప్రకటించలేదు. అయితే ఒకవేళ ఆర్‌ఎస్‌ఎస్‌వై (ఆర్‌ఎస్‌బీవై) పథకానికి పేరు మార్పు చేసిందీలేనిదీ స్పష్టం కాలేదు. 2017-18 బడ్జెట్‌లోనూ స్పష్టం చేయలేదని సీబీజీఏ పేర్కొంది.

'విద్య'కు చాలీచాలని నిధులు

- 2 నుంచి 12వ తరగతి వరకు ఏకీకరణతో సంపూర్ణ విద్యకు ప్రణాళిక
- త్వరలో సమగ్ర బీఈడీ ప్రోగ్రామ్.. 13 లక్షల టీచర్లకు ప్రయోజనం
- గిరిజన చిన్నారులకు 'ఏకలవ్య' గురుకుల పాఠశాలలు
- వెయ్యి మంది బీటెక్ ఉత్తమ విద్యార్థులకు పీఎం రీసెర్చ్ ఫెలోషిప్
- ప్రతి నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల, కొత్తగా 24 కళాశాలలు
- వదోదరలో రైల్వే విశ్వవిద్యాలయం



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో విద్యకు చాలీచాలని నిధులే కేటాయించారు ఆర్థిక మంత్రి. ప్రభుత్వం ప్రధాన చెల్లింపునకు విద్యా రుణంపై వడ్డీ మినహా యింపును 2018 బడ్జెట్‌లో పొడిగిస్తుందని విద్యార్థులు భావించారు. అయితే అది నెరవేర్చకుండా విద్యార్థుల ఆశలపై నీళ్లు జల్లింది. విద్యా రంగంలో పరిశోధన, అభివృద్ధి కోసం వచ్చే నాలుగేళ్ల కాలంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ ప్రక టించారు. ప్రభుత్వం పిల్లలను పాఠశాలలకు తీసుకువచ్చినప్పటికీ విద్యా బోధనలో నాణ్యత లోపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 2 నుంచి 12వ తరగతి వరకు ఏకీకరణతో సంపూర్ణ విద్యను అందిం చేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తున్నదని వివరించారు. వచ్చే ఏడాది విద్యా వ్యవస్థ, మౌలిక సదుపాయాల పునరుద్ధరణ(ఆర్‌ఐఎస్‌ఈ)ను ప్రారం భించేందుకు ప్రతిపాదన చేశారు. విద్యలో డిజిటల్ తీవ్రతను పెంచడానికి డిజిటల్ మీడియంతో అతిపెద్ద సాంకేతిక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. బీఈడీ కోర్సుకు పెరుగుతున్న డిమాండును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయుల శిక్షణపై కూడా బడ్జెట్‌లో దృష్టిసారించారు. 13 లక్షల మంది శిక్షణ లేని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని సవరించింది. శిక్షణ పొందని ఉపాధ్యాయులకు అధికారిక శిక్షణ పొందేందుకు నూతన 'దీక్ష' కార్యక్రమాన్ని జైట్లీ ప్రకటించారు. 'ఉపా ధ్యాయుల కోసం సమగ్ర బీఈడీ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయనున్నాం' అని తెలిపారు. 2022 నాటికి గిరిజన చిన్నారుల కోసం నవోదయ విద్యాల యాల మాదిరిగా ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేయనున్నామని, ఎస్టీ జనాభా 50 శాతానికి మించి, కనీసం 20 వేల గిరిజనులు ఉన్న ప్రతి బ్లాక్‌లో వీటిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఐఐటీలు, ఇతర ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలలో పీహెచ్‌డీ చేసేందుకు వెయ్యి మంది ఉత్తమ బీటెక్ విద్యార్థులను గుర్తించి ప్రధాన మంత్రి రీసెర్చ్ ఫెలోషిప్ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. ఇక ప్రతి మూడు నియోజకవర్గాలకు ఒక వైద్య విద్య కళాశాలను ఏర్పాటును ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా 24 నూతన వైద్య విద్యా కళాశాలలను ప్రకటించింది. అలాగే జిల్లా స్థాయి ఆస్పత్రులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మరో 18 ఐఐటీలు, ఎన్‌ఐటీల ఏర్పాటుతో సహా ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నూతన విద్యా సంస్థల ఏర్పాటును ప్రకటించారు. గుజరాత్‌లోని వదోదరలో ప్రత్యేక రైల్వే విశ్వవిద్యాలయం ఏర్పాటును కూడా బడ్జెట్‌లో ప్రకటించారు. కాగా జాతీయ అచీవ్‌మెంట్ సర్వే ఫలితాల ఆధారంగా విద్యలో నాణ్యతను మెరుగుపరచడానికి, ప్రామాణిక అభ్యాసాల సాధనకు జిల్లా వారీ వ్యూహాన్ని ప్రకటించారు. సాంకేతిక పరిజ్ఞానానికి మరింత ఊతమిచ్చేలా, ఇంటర్నెట్, ఏ-1 రోబోటిక్స్‌పై ప్రత్యేకించి కృత్రిమ మేథస్సుకి సంబంధించి ఉన్నత విద్యా కేంద్రాలను ఏర్పాటును వెల్లడించారు. ఈ ఏడాది జాతీయ సామాజిక సహాయక కార్యక్రమంపై రూ.9,975 కోట్లు కేటాయింపు. అలాగే, పాఠశాలలు, గ్రామాలకు విద్యార్థులను అనుసంధానం చేస్తూ రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా బడ్జెట్‌లో కేటాయింపులను ప్రకటించారు.

ఉపరాష్ట్రపతి పర్యటనకు పటిష్ఠ బందోబస్తు



విశాలాంధ్ర - గుంటూరుక్రైం : ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ నెల 3వతేదీన గుంటూరు అర్బన్ పోలీసు జిల్లా పరిధిలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు అర్బన్ ఎస్పీ సిహెచ్ విజయారావు గురువారం తెలిపారు. బందోబస్తు చర్యలకు నియమించిన సిబ్బంది తమ విధులను బాధ్యతతో నిర్వర్తించాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్టచర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనుకోని ఘటనలు చోటుచేసుకున్న పక్షంలో ఉన్నతాధికారులకు తెలియజేయాలని, భద్రతా చర్యలలో భాగంగా వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో అనుసంధానం చేసుకోవాలని, గూఢచార వ్యవస్థను, బాంబ్ స్క్వాడ్‌ను, స్పెషల్ బ్రాంచి సిబ్బందిని, బాంబు డిస్పోజల్ సిబ్బందిని, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ టీం, సాయుధబలగాలను అనుక్షణం పర్యవేక్షిస్తూ పటిష్ఠ రక్షణ వలయంలో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 796 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 38 మంది సీఐలు, 36 ఎస్సైలు, 111 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు, 342 మంది కానిస్టేబుళ్లు, 23 సెక్షన్లు, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల వారితో అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు మందస విద్యార్థి



విశాలాంధ్ర - మందస : మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సిద్ధార్థ మహారణ ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో అనంతపురం జిల్లా రాయదుర్గంలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కిందని హెచ్ఎం తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థికి, ప్రత్యేక శిక్షణ అందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్ మహంతి, కార్తీకేశ్వర చౌదరిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రైలు కింద పడి ప్రేమికుల ఆత్మహత్య



విశాలాంధ్ర - పలాస / వజ్రపుకొత్తూరు : శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు ఫ్లైఓవర్ వంతెన దిగువ రైల్వేట్రాక్‌పై గురువారం ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్నారని పలాస జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం తండేవలస గ్రామానికి చెందిన అమలాపురం అప్పలరాజు(30), అదే గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని బుడుమూరు పద్మ(22) రైలు కిందపడి మృతి చెందారు. అప్పలరాజు ఇటుకల బట్టీలో పనిచేస్తున్నారు. వీరు ఆమదాలవలస రైల్వేస్టేషన్ నుండి బెండి గేటుకు చేరుకొని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా అప్పలరాజుకు ఇంతకుముందే వివాహం జరిగినట్లు సమాచారం. ఈ వివాహానికి ముందే వీరిద్దరూ ప్రేమించుకున్నారని తెలిసింది. జీఆర్‌పీ హెచ్‌సీ కోదండరావు ఘటనా స్థలికి చేరుకొని వివరాలను సేకరించారు.

రూటు మార్చిన అక్రమార్కులు

- కొలిమిగుండ్ల మీదుగా గ్రానైటుగుండ్ల తరలింపు
- సహకరిస్తున్న అధికారులు



విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : గ్రానైటుగుండ్ల తరలింపులో అక్రమార్కులు రూటు మార్చారు. ఇందుకు స్థానిక అధికారులు సహకరిస్తుండటంతో వారి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఇటీవల కర్నూలు జిల్లా విజిలెన్స్ అధికారులు అక్రమార్కులపై కొరడా ఝుళిపించడంతో వారు రోజుకో రూటు మారుస్తూ గ్రానైటు గుండ్లను తరలిస్తున్నారు. కొలిమిగుండ్ల మండల సరిహద్దులోని రాయల్టీ చెక్‌పోస్టు అధికారులతో పాటు ఇంకొంతమంది అధికారులు కూడా అక్రమార్కులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రకాశం జిల్లా నుంచి గ్రానైటు గుండ్లను లారీల్లో అధిక లోడులతో కర్నూలు జిల్లాలోని నంద్యాల, గోస్పాడు, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల మీదుగా అనంతపురం జిల్లా తాడిపత్రిలోని గ్రానైటు పరిశ్రమకు అక్రమంగా తరలించేవారు. కానీ, విజిలెన్సు దాడులతో రూటుమార్చి తాడిపత్రికి గ్రానైటు గుండ్లను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రకాశం జిల్లా నుంచి కడప జిల్లాలోని పోరుమామిళ్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కర్నూలు జిల్లాలోని కొలిమిగుండ్ల మీదుగా గ్రానైటు గుండ్లను అక్రమంగా తరలిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని ఆయా శాఖాధికారులు మామూళ్లు తీసుకుంటూ సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కర్నూలు జిల్లా విజిలెన్స్ అధికారులు ఎక్కువగా కొలిమిగుండ్ల మండలం మీదుగా దృష్టి కేంద్రీకరించడంతో అక్రమార్కులు తెల్లవారుజామున గ్రానైటు గుండ్లను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గ్రానైటు పరిశ్రమ ఇటీవల మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడంతో చాలా మంది అక్రమ మార్గంవైపు దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలుస్తున్నది. మూడు నెలల క్రితం అనంతపురం జిల్లా విజిలెన్స్ అధికారులు గ్రానైటు గుండ్లను తరలిస్తున్న లారీలపై తాడిపత్రి మండలంలోని బుగ్గ ప్రాంతంలో దాడులు నిర్వహించడంతో అక్రమార్కులు సరిహద్దులోని కొలిమిగుండ్ల మండలంలోకి గ్రానైటు లారీలు తరలించి విజిలెన్స్ అధికారులను బెదిరించినట్లు అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అధిక లోడులతో ఎలాంటి పన్నులు చెల్లించకుండా గ్రానైటు గుండ్లను అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కులపై సంబంధిత ఉన్నత అధికారులు ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.



రూ. మూడుకోట్ల ఎర్రచందనం స్వాధీనం

విశాలాంధ్ర - నెల్లూరు (టౌన్) : నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలోని మల్లెంకొండ అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి తమిళనాడుకు చెందిన అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. గురువారం స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో క్రైం ఓఎస్‌డీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ 138 ఎర్రచందనం దుంగలను, స్కార్పియో, ఇనోవా, మోటార్ సైకిల్, 20 సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. పట్టుబడిన ఎర్రచందనం 138 దుంగల విలువ రూ. మూడు కోట్లు ఉంటుందన్నారు. అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు తయారు చేయించి చెన్నైకు తరలిస్తూ, చెన్నై నుంచి కంటైనర్ల ద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తుంటారన్నారు. పోలీసులు స్మగ్లర్లను పట్టుకునేందుకు యత్నించినప్పుడు స్మగ్లర్లు పోలీసులపై రాళ్ళతో దాడికి పాల్పడ్డారు. తప్పించుకున్న స్మగ్లర్ల కోసం మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో రూరల్ డీఎస్పీ రాఘవరెడ్డి, ఎస్సై రఘునాథరావు పాల్గొన్నారు.



సమాచార హక్కు కమిషనర్లను నియమించాలి

విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : సమాచార హక్కు కమిషనర్లను వెంటనే నియమించాలని క్యాప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నర్రా పిచ్చయ్య డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద గురువారం సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక, క్యాప్ స్వచ్ఛంద సంస్థ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరాహార దీక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ గత 8 నెలలుగా రాష్ట్రంలో సమాచార హక్కు కమిషనర్లు లేకపోవటం వలన దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కమిషనర్లను నియమించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కమిషనర్ల నియామకం జరగలేదన్నారు. రాష్ట్రంలో 10 మంది సమాచార కమిషనర్లను వెంటనే నియమించాలని, జిల్లా పౌర సంస్థల్లో పనిచేస్తున్న వారిని జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీలో కనీసం ఇద్దరిని నియమించాలని, రాజకీయ నాయకులు, రిటైర్డు ఐఏఎస్, ఏపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ వారిని కాకుండా, పౌర సంస్థల్లో పనిచేస్తున్న అనుభవం ఉన్నవారినే కమిషనర్లుగా నియమించాలని, సమాచార హక్కు చట్టం కార్యకర్తలపై దాడులకు సంబంధించి కేసులు నమోదు చేసి, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరాహారదీక్షలో క్యాప్ సంస్థ వ్యవస్థాపకులు బాలకృష్ణ, కాంగ్రెస్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి సవరం రోహిత్, సాయికుమార్, శివశంకర్, తిరుమల, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల విక్రయ ఆదాయం రూ.25.33 కోట్లు

విశాలాంధ్ర - తిరుమల : శ్రీ వేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించిన తలనీలాల ఈ-వేలంలో టీటీడీ రూ.25.33 కోట్ల ఆదాయాన్ని గడించింది. ప్రతినెలా మొదటి గురువారం నాడు తలనీలాల ఈ-వేలం జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా టీటీడీ తిరుమల జేఈఓ కె.ఎస్.శ్రీనివాసరాజు పర్యవేక్షణలో తలనీలాల ఈ వేలం జరిగింది. మొదటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, తెల్లవెంట్రుకలు తలనీలాల రకాల ఈ-వేలం నిర్వహించారు. ఈ నెల నిర్వహించిన ఈ-వేలంలో మొత్తం 50,400 కిలోల తలనీలాలు అమ్ముడుపోయాయి.

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్ (భూ.సే), టిజిపి, నెల్లూరు వారి కార్యవర్తనములు

RC A3.09/2017 Dt.. 02-01-2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఫారం నెం. VII

(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి.

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణములను ఎ.0.97 ప్రజాప్రయోజనమునకై అనగా బాలెన్సింగ్ రిజర్వాయర్-1 నిర్మాణము కొరకు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం, చుంచులూరు గ్రామమునకు సంబంధించిన భూములు కావలెనని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు భావించినందున, 2013 సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములను విచారణ జరిపిన పిమ్మట వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజాప్రయోజనము నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2015-16నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించిన ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజాప్రయోజనమునకై అనగా బ్యాలెన్సింగ్ రిజర్వాయరు-1 నిర్మాణము కొరకు అవసరమైనవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు   మండలం : మర్రిపాడు   గ్రామము: చుంచులూరు

క్రమ సంఖ్య	సర్వే నెంబరు సబ్ డివిజన్ నెం.	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెం	తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడాలు పంట వివరాలు
01.	339-1	0.17	పట్టా మెట్ట	యల్లంరాజు పెద వెంకటయ్య తండ్రి లక్ష్మయ్య	338	340	340,	పి.యస్. పల్లి	బీడు
		0.17	పట్టా మెట్ట	యల్లంరాజు కొండయ్య తండ్రి కొండయ్య					బీడు
		0.17	పట్టా మెట్ట	మద్దులూరు నారాయణ తండ్రి పిచ్చయ్య					బీడు
		0.17	పట్టా మెట్ట	మద్దులూరు వెంకటేశ్వర్లు తండ్రి తిమ్మయ్య					బీడు
02.	340-1	0.10	ఇనాం పట్టా	యల్లంరాజు కృష్ణంరాజు తండ్రి కొండ్రాజు	339	పి.యస్. పల్లి	340-2	పి.యస్. పల్లి	బీడు
		0.095	ఇనాం పట్టా	యల్లంరాజు కృష్ణంరాజు తండ్రి పెదకొండ్రాజు					బీడు
		0.095	ఇనాం పట్టా	కొండూరు కొండయ్య తండ్రి చెవిటయ్య					బీడు
	మొత్తం	0.97							

ఆభూముల ప్లాను శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసే) సోమశిల ప్రాజెక్టు, ఆత్మకూరు వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పనివేళలలో ఏ సమయములోనైనా తనిఖీ చేసుకోవచ్చును. ఈ భూసేకరణవలన నిర్వాసితులయిన వారు ఎవ్వరును లేరు.

బొగ్గు ఘనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలోగాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణము కొరకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వట గాని తొలగించుట గాని చేయవలెను.

శ్రీమతి పి. ప్రశాంతి, ఎం.ఎ., ప్రత్యేక కలెక్టర్, టిజిపి, నెల్లూరు

పాలకుల తీరుపై
20న దేశవ్యాప్త నిరసనలు : ఏఐఎస్ఎఫ్



విశాలాంధ్ర - కర్నూలు : విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో దేశవ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాల పేద పిల్లలకు చదువులను దూరం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు చేపట్టనున్నామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న తెలిపారు.

ఈ ఆందోళనల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక చంద్రరాజేశ్వరరావు భవన్‌లో గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీరాములుగౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా రంగన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు ఖాళీ అవుతున్నాయని, ఇందుకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. కనీస మౌలిక సదుపాయాలు సైతం లేని పాఠశాలలు దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నాయని, తరగతి గదుల్లో చదువుచెప్పే ఉపాధ్యాయులు లేక విద్యార్థులే టీచర్లవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాల్సిన ప్రభుత్వాలే అటువైపు చూడకపోవడంతో కార్పొరేట్‌వైపు వెళ్లేలా చేస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు కట్టలేక, ఒత్తిడి భరించలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వాలే ప్రభుత్వ విద్యాపతనానికి కారణమన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ దేశంలో మతోన్మాదులు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, సైన్స్‌ను కూడా తప్పుపడుతూ దేశంలో అలజడి సృష్టిస్తున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తున్న మేధావులపై దాడులు చేస్తూ నోరు మూయిస్తున్నారని ఆయన తెలిపారు. మతోన్మాదులు అరాచకాలను విద్యారంగంలోకి చొప్పించే యత్నాలకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్‌బేరర్‌లు శివశంకర్, మహేంద్ర, ధనుంజయ, విజేంద్ర, వేంకటేష్, రాజు, హనుమేష్, శ్రీనివాసులు, శివన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



కార్మికశాఖ స్థలంలో
వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర - గుంటూరు సిటీ : గుంటూరు నగరం మధ్యలోని కార్మికశాఖ స్థలంలో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణను కోరారు. గుంటూరు కాకుమానువారితోటలోని కార్మిక శాఖ స్థలాన్ని పరిశీలించడానికి వచ్చిన మంత్రిని సీపీఐ నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా డొంకరోడ్డు, మహబూబ్‌నగర్, వసంతరాయపురం, శారదాకాలనీలలో నివాసం ఉంటున్న ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ కార్మిక శాఖకు చెందిన 14 ఎకరాల స్థలం అనేక సంవత్సరాలుగా నిరుపయోగంగా పడి ఉందని, దీంతో ఆ ప్రాంతం అనేక అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందన్నారు. హత్యలు సైతం జరిగాయని ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్థలాన్ని వాడుకలోకి తీసుకువస్తే అద్దె భవనాలలో కొనసాగుతున్న కార్మిక శాఖ కార్యాలయాల్ని ఏర్పాటుచేసుకోవచ్చని, మరికొంతభాగంలో నగరంలోని 10 డివిజన్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టవచ్చని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి పితాని మాట్లాడుతూ స్థలం చుట్టూ ప్రహరీగోడను నిర్మిస్తామని, రెండు నెలల్లో కార్మిక శాఖ కార్యాలయాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి చెప్పిన మాటలు మాటలకే పరిమితం కాకుండా కార్యరూపం దాల్చాలని కోట మాల్యాద్రి కోరారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. టీడీపీ తూర్పు ఇన్‌ఛార్జి మద్దాళి గిరిధర్, సీపీఐ నగర నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు, ఎస్‌కే అమీర్‌వలి, గన్నీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్‌కె జైద్, టీడీపీ నాయకులు ఆర్‌వీఆర్, నాగేశ్వరరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

విజయనగరం క్రీడాభివృద్ధికి రూ.120 కోట్లు

శాప్ ఎమ్‌డీ బంగార్రాజు



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయ నగరం జిల్లా క్రీడాభివృద్ధికి ప్రభుత్వం రూ.120 కోట్లు మంజూరుచేసినట్టు శాప్ ఎమ్‌డీ బంగార్రాజు పేర్కొన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం క్రీడా మైదానాల అభివృద్ధి, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుపై అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ రాజీవ్ క్రీడా మైదానాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన అంచనాలు, ఆకృతులు సిద్ధం చేయాలని ఇంజ నీరింగ్ అధికారులకు సూచించారు. మార్చి 31 లోగా క్రీడా వికాస కేంద్రాల పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విజయనగరం పట్టణంలో రూ.3 కోట్లతో స్పోర్ట్స్ స్కూలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విజ్జీ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. సమావేశంలో జేసీ-2 నాగేశ్వరరావు, డీఈఓ నాగమణి, డీఎస్‌డీఓ సూర్యారావు, ఉద్యానవనశాఖ ఉప సంచాలకులు లక్ష్మీనారాయణ, పీఆర్ పీఐయూ ఈఈ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలను పరిష్కరించండి



విశాలాంధ్ర - గుంటూరు సిటీ : న్యాయవాదుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేసి త్వరితగతిన సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పల్లపు కృష్ణ కోరారు. జాయింట్ కలెక్టర్ కృతికా శుక్లాను కలిసిన న్యాయవాదులు తమ సమస్యలపై గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పల్లపు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మంది న్యాయవాదులు సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారు ప్రాక్టీస్ చేసే పరిధిలో అర్హత కలిగిన న్యాయవాదులందరికీ ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా న్యాయవాదులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, డెత్ బెనిఫిట్‌ను రూ.10 లక్షల వరకు పెంచాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ నెలకు రూ.5 వేలు చొప్పున మూడు సంవత్సరాలు మంజూరు చేయాలని, రాజధాని అమరావతిలో హైకోర్టు పరిధిలో న్యాయవాదులకు వసతి భవనం కోసం స్థలం కేటాయించాలని, ఎన్నికల సమయంలో ప్రభుత్వం న్యాయవాదులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు కొండవీటి శ్రీనివాస రావు, కార్యదర్శులు కె.వి.భాస్కర్, ఉప్పు దుర్గాభవాని, న్యాయవాది డి.సురేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ న్యాయవాదుల ఐక్య వేదిక కో-కన్వీనర్, మాజీ ఏపీపీ కల్లకుంట రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్సు రద్దు

విశాలాంధ్ర - గుంటూరు (జిల్లాపరిషత్) : సీజన్‌లో యార్డులో వ్యాపారం సవ్యంగా చేయాలని యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు తెలిపారు. యార్డు కార్యాలయంలో సిబ్బందితో గురువారం ఛైర్మన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మన్నవ మాట్లాడుతూ సీజన్‌లో మిర్చి పెద్ద ఎత్తున యార్డుకు వస్తుందని, మచ్చు, జీరో వ్యాపారము జరిగితే సంబంధిత సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలను అతి క్రమించిన వ్యాపారులకు జరిమానాతోపాటు లైసెన్సు రద్దు చేస్తామన్నారు. యార్డు కార్యదర్శి యన్.శ్రీనివాసరావు, గ్రేడ్-2 కార్యదర్శులు ప్రసన్న కుమారి పాల్గొన్నారు.

జలవనరులశాఖలో బదిలీలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖలో పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేశారు. ఈమేరకు ఆ శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం జీవో జారీ చేశారు. కృష్ణాడెల్టా సిస్టం (కేడీఎస్) చీఫ్ ఇంజనీర్‌గా చేస్తున్న కే శ్రీనివాస్‌ను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. ఆయనకు జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కమీషనర్ ఆఫ్ టెండర్స్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా చేస్తున్న వి శ్రీధర్‌ను పదోన్నతిని కల్పిస్తూ ఆంధ్రా రీజియన్, ధవళేశ్వరం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. విజయవాడ మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌గా చేస్తున్న ఆర్ సతీష్‌కుమార్‌ను కేడీఎస్ చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. శ్రీశైలం డ్యామ్ మెయింటనెన్స్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా చేస్తున్న ఏజీ మల్లికార్జునరెడ్డిని వెలగపూడి ఏపీ సెక్రటేరియట్‌లో ఉన్న జలవనరులశాఖ కార్యాలయం చీఫ్ టెక్నికల్ ఇంజనీర్‌గా నియమించారు. కడప చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్)గా చేస్తున్న కే వరదరాజును విజయవాడలోని హెచ్ఆర్డీ చీఫ్ ఇంజనీర్‌గా, ధవళేశ్వరం క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మక్బూల్ అహ్మద్‌ను కడప (ప్రాజెక్ట్స్) చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు.

నవ్యాంధ్రలో చారిత్రక కట్టడాలు అభివృద్ధి చేయండి

ఏఐపీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి జాస్తి ఆంజనేయులు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నవ్యాంధ్రలోని చారిత్రక కట్టడాలు, పురావస్తుశాఖల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(ఏఐపీపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి జాస్తి ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కేంద్ర పురావస్తుశాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ టి.శ్రీలక్ష్మికి ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో 129 చారిత్రక కట్టడాలున్నాయని, 3 కేంద్ర పురావస్తు సంగ్రహాలున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

ఏ రంగానికి ఎంత

- వ్యవసాయానికి రూ.2,39,882 కోట్లు
- రైల్వేలకు రూ. 1.48 లక్షల కోట్లు
- ఎస్సీల సంక్షేమం కోసం రూ. 56,619 కోట్లు
- ఎస్టీల సంక్షేమం కోసం రూ. 39,135 కోట్లు
- చిన్న, సూక్ష్మ తరహా పరిపరిశ్రమల కోసం రూ. 3,790 కోట్లు
- టీబీ రోగుల సంక్షేమం కోసం రూ. 600 కోట్లు
- గ్రామీణ పారిశుద్ధ్య పథకానికి రూ. 16,713 కోట్లు
- విద్య, ఆరోగ్య, సంక్షేమానికి రూ. 1.38 లక్షల కోట్లు
- రోడ్లు, మౌలిక వసతులకు రూ. 9.64 లక్షల కోట్లు
- ఇంటింటికీ తాగునీటి పథకానికి రూ. 77,500 కోట్లు
- ఆకర్షణీయ నగరాల కింద రూ. 2.04 లక్షల కోట్లతో 99 నగరాల ఆధునీకరణ
- చేనేత, జౌళి రంగానికి రూ. 7,500 కోట్లు
- టెక్స్ టైల్ రంగానికి రూ. 7,140 కోట్లు
- 2019 నాటికి మహిళా సంఘాలకు రూ. 75 వేల కోట్ల రుణాలు
- ఆహార శుద్ధి రంగానికి రూ. 1400 కోట్లు కేటాయించాం
- రూ. 2 వేల కోట్ల కార్పస్ ఫండ్ తో వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి చర్యలు
- ఆపరేషన్ గ్రీన్ కోసం రూ. 500 కోట్లు
- గంగా ప్రక్షాళనకు రూ. 16 వేల 700 కోట్లు
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 3 వేల కోట్ల మేర ముద్రా రుణాలు
- ప్రతి పౌరునికి సమీపంలో వెల్ నెస్ సెంటర్
- వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం రూ. 1200 కోట్లు
- జాతీయ జీవనోపాధి మిషన్ కోసం రూ. 5,750 కోట్లు
- వెదురు పరిశ్రమ ప్రోత్సాహం కోసం రూ. 1290 కోట్లు
- నీటి వసతి లేని 96 జిల్లాల కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు

బడ్జెట్‌పై నేడు నిరసనలు

రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఏపీకి మళ్లీ మొండి చెయ్యి చూపించారు. ముందస్తు ఎన్నికలొస్తే ఇదే ఆఖరి బడ్జెట్ కావడంతో ఈ సారైనా న్యాయం జరుగుతుందని భావించిన రాష్ట్ర ప్రజలకు నిరాశే ఎదురైంది. విభజన అంశాల్లోని విద్యాసంస్థల ప్రాజెక్టులకు తూతూ మంత్రంగా నిధులు విదిల్చి, ఏపీకి అభివృద్ధికి అత్యంత కీలకమైన పోలవరం, రాజధాని, కడప ఉక్కు పరిశ్రమ వంటి ప్రాజెక్టుల ప్రస్తావనే లేకపోవడం ప్రజల ఆశలను ఆవిరిచేసింది. నాలు గేళ్లుగా నవ్యాంధ్ర ప్రజలు ఎదురు చూస్తున్న విశాఖ రైల్వే జోన్ గురించి ప్రస్తావనే లేదు. రెవిన్యూలోటు భర్తీ, అభివృద్ధిలో వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్యాకేజీ అంశాలు బడ్జెట్‌లో కనీసం ఉచ్ఛారణకు కూడా నోచుకోలేదు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బెంగళూరు మెట్రోకి దాదాపు రూ.18వేల కోట్లు కేటాయించిన కేంద్రం, విభజన చట్టంలో పొందుపర్చిన విజయవాడ, విశాఖపట్నం నగరాల మెట్రో ప్రాజెక్టులను మాత్రం పూర్తిగా పక్కనబెట్టేసింది. చివరకు ఏపీలో కీలకమైన అరకు పర్యాటక ప్రాంత అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ చిన్నపాటి ప్రతిపాదనను కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. అలాగే ఇటీవల సీఎం చంద్రబాబు సుమారు 14పేజీలతో విభజన అంశాలు, రాష్ట్రానికి అవసరమైన సహాయంపై ప్రధాని నరేంద్ర మోడీకి అందజేసిన నివేదికనూ పట్టించుకోలేదు. కేవలం శంకుస్థాపనలు చేసిన పలు కేంద్రీయ విద్యాసంస్థలకు మాత్రం మళ్ళీ అరకొరగా మాత్రమే నిధులు కేటాయించారు. రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేసిన కేంద్ర బడ్జెట్‌పై రాజకీయపక్షాలు భగ్గుమన్నాయి. ఎన్డీఏలో భాగస్వామ్యపక్షంగా వున్న టీడీపీ నేతలు సైతం జైట్లీ బడ్జెట్‌పై తీవ్ర నిరాశకు గురయ్యారు.

మరోసారి మోసగించిన కేంద్రం-సీపీఐ రామకృష్ణ

ఏపీ ప్రజలను కేంద్రం మరోసారి మోసగించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు.



కార్పోరేట్ పన్ను విధించినట్టు చూపించి కార్పొరేట్ శక్తులకే ఈ బడ్జెట్‌లో కొమ్ముకాశారని విమర్శించారు పార్లమెంట్ సభ్యుల జీతాలను భారీగా పెంచిన సర్కారు, సాధారణ ఉద్యోగులను, మధ్యతరగతి వర్గాలను పూర్తిగా విస్మరించిందన్నారు. తెలుగు రాష్ట్రాలను కేంద్రం తీవ్రంగా దగా చేసిందన్నారు. ఏపీ విభజన హామీలను కనీసం పట్టించుకోలేదన్నారు. ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని, అమరావతి రాజధాని నిర్మాణం గురించి ప్రస్తావించలేదని, కడప ఉక్కు పరిశ్రమ గురించి కనీసం ప్రస్తావించలేదని మండిపడ్డారు. కేంద్ర విద్యా సంస్థలకు ముష్టి తరహాలో నిధులు విదిలించారన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు 1,2 తేదీల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రానికి తీరని ద్రోహమిది-సీపీఎం మధు




ఏపీ ప్రజలకు కేంద్ర బడ్జెట్ తీరని ద్రోహం చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రధాన ప్రాజెక్టుల ఊసే లేకుండా చేశారు. కీలకమైన అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగాల కల్పనకుగాని, రైతుల రుణభారం తగ్గించ దానికి గాని కేటాయింపులు లేవని, కార్పోరేట్లకు మాత్రం రాయితీలు ప్రకటించిందన్నారు. ఇది పూర్తి ప్రజా వ్యతిరేకమైన బడ్జెట్‌గా ఆయన పేర్కొన్నారు. దీనిపై ప్రజానుకూల మార్పుల కోసం ప్రజలంతా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఓట్ల గారడీ బడ్జెట్-కాంగ్రెస్ రఘువీరారెడ్డి

కేంద్ర బడ్జెట్టు పూర్తిగా ఓట్ల గారడీ బడ్జెట్‌గా పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఎద్దేవా చేశారు. .రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని చట్టబద్ధమైన ప్రధాన హామీలకు కేటాయింపులు లేవని పేర్కొన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాలకు రూ.11,500కోట్ల అవసరం కాగా, కేవలం రూ.385కోట్లు మాత్రమే కటాయించారని పేర్కొన్నారు.సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజల ప్రయోజనాల్ని కేంద్ర ముందు తాకట్టు పెట్టారని మండిపడ్డారు.ప్రత్యేక హోదాపై టీడీపీ, బీజేపీ పార్టీలు ఉమ్మడిగా రాష్ట్రానికి ద్రోహం చేశాయని విమర్శించారు.



దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చేలా బడ్జెట్-బీజేపీ హరిబాబు



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్.. ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చే విధంగా ఉందని బీజేపీ ఎంపీ హరిబాబు వ్యాఖ్యానించారు. బడ్జెట్‌పై స్పందించిన ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి నష్టం జరగలేదని అన్నారు. విభజన చట్టంలో రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలపైనే జైట్లీ ప్రస్తావించారని హరిబాబు పేర్కొన్నారు. అధికారుల నివేదికతో సంబంధం లేకుండా రైల్వేజోన్‌పై రాజకీయ నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తెస్తామని ఆయన అన్నారు.

కార్మిక సంక్షేమం విస్మరించిన బడ్జెట్-ఏఐటీయూసీ

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ మాత్రం కార్మిక సంక్షేమాన్ని పట్టించుకోలేదని, దేశంలో నూతన ఉద్యోగాల కల్పనకు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఎటువంటి ప్రతిపాధనలు చేయలేదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చలసాని వెంకట రామారావు, జి.ఓబులేసు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఆర్.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కేవలం రూ.3790 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారని, మూతపడిన పరిశ్రమలు తెరిపించేందుకు ఎటువంటి హామీలు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అసంఘటిత కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలను ప్రకటించలేదని, 14 ప్రభుత్వరంగ సంస్థలను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయడం కార్పోరేట్ వర్గాలకు మాత్రమే ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల కనీస వేతనాలు పెంపుదలకు ఎటువంటి హామీ ఇవ్వని ప్రభుత్వం రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్‌ల, పార్లమెంట్ సభ్యులు వేతనాల పెంపుదలకు పూనుకోవడం వీరి కార్మిక వ్యతిరేక వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

పేదల ఓట్లు దండుకునేలా వున్న కేంద్ర బడ్జెట్-వ్యవసాయ కార్మికసంఘం

కేంద్రబడ్జెట్ పేదల ఓట్లు దండుకునేలా, అంకెలగారడీగా వుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆవుల శేఖర్, జల్లి విల్సన్‌లు విమర్శించారు. పేదవారికి రూ.5లక్షల ఉచిత వైద్యం పేరుతో కార్పోరేట్ ఆసుపత్రులు, ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడానికేనని, విద్యా, వైద్యంపై 4శాతం సెస్సు విధించడం అన్యాయమన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు నిధులు పెంచినట్లు చూపించి మరోసారి మోసగించారని, ఇది పూర్తిగా ప్రజలను మోసగించే బడ్జెట్ అని వారు పేర్కొన్నారు.

రైతు వ్యతిరేక బడ్జెట్ : ఏపీ రైతుసంఘం

కేంద్ర బడ్జెట్ రైతులు అప్పుల నుండి బయటపడి స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే దిశగా లేదని అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, రైతుసంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. రామచంద్రయ్య, కె.వి.వి.ప్రసాద్‌లు తెలిపారు. విభజన హామీలకు నిధులు కేటాయింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు పెంచే ఆలోచన చేయ్యకపోగా ఖరీఫ్ పంటకు కేవలం 1.5 రెట్లు పెంచుతామంటూ చేసే ప్రకటనలు స్పష్టంగా లేవు. ప్రభుత్వం నుండి ఏ మాత్రం గ్యారంటీ లేదు. ఈ బడ్జెట్ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అంకెల గారడీని తలపిస్తున్నది తప్పితే రైతుకు వుపయోగకరం లేదని వారు విమర్శించారు.

వ్యవసాయం, ఆరోగ్యం, సంక్షేమం సరే..

ఏపీకి సాయమేదీ ? : యనమల

విశాలాంధ్ర, అమరావతి: వ్యవసాయానికి, సంక్షేమానికి పెద్దపీట వేసిన కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎటువంటి ప్రస్తావన లేకపోవడం ఇబ్బందికరమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పెదవి విరిచారు. గురువారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి వినిపించిన రూ.24.42 లక్షల కోట్లు బడ్జెట్ ప్రసంగంలో దేశంలో 73 శాతం మందికి ఆధారమైన వ్యవసాయ రంగానికి అగ్రతాంబూలం ఇవ్వడం హర్షణీయమన్నారు. ఆరోగ్యభద్రతకు మిక్కిలిభాగం కేటాయించడం వల్ల 50 శాతం మంది ప్రయోజన పొందుగలుగుతారని వివరించారు. 12 శాతం ప్రత్యక్ష పన్నులు పెరగడంతో గ్రామాల ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి జరుగుతుందన్నారు. సుదీర్ఘకాల జల ప్రయోజనాలకు పట్టం కట్టినట్లు బడ్జెట్ తేటతెల్లం చేస్తోందని అభిప్రాయపడ్డారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం బాగుందని, దీని వల్ల ఉపాధి కల్పన భారీగా ఉంటుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే 6వేల ఎంఎస్ఎంఈలు ఉన్నాయని, అవన్నీ ప్రయోజనం పొంది, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. మండలాల అనుసంధానం, గ్రామాల అనుసంధానం కోసం రోడ్లపై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. పేదలఇళ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారని, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ఎటువంటి ప్రస్తావన రాలేదని, పూర్తి బడ్జెట్ నివేదికలో ఉండే అవకాశం ఉంటుందేమోనని అన్నారు. ఏపీకి సంబంధించి విశాఖకు రైల్వే జోన్ కేటాయింపునకు సంబంధించి ఎటువంటి ప్రకటన వెలువడకపోవడంపై కాంగ్రెస్ నేతల చేస్తోన్న ఆరోపణలపై యనమల స్పందించారు. ఏపీని మోసం చేసి వెళ్లినవారు ఇప్పుడు ఆరోపణలు చేయడమేమిటని ఎద్దేవా చేశారు. 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికలను ఉద్దేశించి రూపొందించిన బడ్జెట్‌గా ఉందేమోనన్న ప్రశ్నకు అయివుండచ్చని మంత్రి యనమల అభిప్రాయం వ్యక్తం చేశారు.



ఏపీఎస్ఆర్టీసీ క్లాస్-2 సూపర్‌వైజర్ల అసోసియేషన్

డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ క్లాస్-2 సూపర్‌వైజర్ల అసోసియేషన్-2018 డైరీని విజయవాడ డీజీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి రాష్ట్ర డీజీపీ, ఆర్టీసీ వీసీ పి.మాలకొండయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ సంస్థ బలోపేతానికి సూపర్‌వైజర్ల పాత్ర కీలకమైందని ప్రశంసించారు.విధి నిర్వహణలో సమర్థత, నైపుణ్యాలను చాటుతున్నారని కొనియాడారు. ఆర్టీసీ సంస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.బసవయ్య, ప్రెసిడెంట్ ఎ.విష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ట్రెజరర్ రవీంద్రాబు, బెనర్జీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీటీడీ ఛైర్మన్‌గా సుధాకర్ యాదవ్ ఖరారు?

విశాలాంధ్ర-అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామి కవేత్త, మైదుకూరు టీడీపీ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ పేరును ఖరారు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నియామక ఉత్తర్వులు మరో రెండు రోజుల్లో వెలువడనున్నాయని సమాచారం. టీటీడీ పాలకమండలి నియామకం చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ఛైర్మన్ పదవిని పలువురు ప్రముఖులు ఆశించారు. కొద్ది నెలల క్రితమే సుధాకర్ యాదవ్‌కు ఛైర్మన్ కట్టబెట్టే ప్రయత్నం జరిగినప్పుడు ఆయన క్రైస్తవ మద్దతుదారుడుగా కొందరు హిందూ స్వాములు ఆక్షేపించారు. దీంతో టీటీడీ పాలకమండలి నియామకం వాయిదాపడుతూ వచ్చింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసే పనిని ప్రారంభించారు. అందులో ప్రధానంగా టీటీడీ, ఆర్టీసీ, పలు కార్పోరేషన్లు, రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాల పాలకమండళ్ళను నియమిం చేందుకు నిర్ణయించినట్లుగా తెలిసింది. అందువల్ల టీటీడీ ఛైర్మన్ పదవి సుధాకర్ యాదవ్‌కు అప్పగించేందుకు ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నట్లు తెలిసింది.ఇక రాష్ట్రం లోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎస్ఆర్టీసికి ఛైర్మన్‌గా నియ మించాలన్న నిర్ణయానికి వచ్చి సీఎం ఆ పదవికి పలువురు పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

దుర్గ ఫ్లైవోవరు పనుల వేగవంతం కోసం

3న కాంగ్రెస్ ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ దుర్గ ఫ్లైఓవరు నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండు చేస్తూ ఈ నెల 3న గాంధీ నగర్‌లోని అలంకార్ సెంటరులో ధర్నా నిర్వహించనున్నామని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు.ఈ మేరకు గురువారం పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దుర్గ ఫ్లైవోరు జాప్యంతో ప్రజలు అనేక ఇబ్బందు లకు గురవుతున్నారన్నారు. దీంతో రాజధాని కేంద్రమైన విజయవాడ పరిసర ప్రాంతాలు పూర్తిగా ట్రాఫిక్‌లో చిక్కుకు పోయాయని వివరించారు. స్వీకరించిన సోమా కంపెనీ నత్తనడకన వ్యవహరిస్తోందని, ప్రాజెక్టు పనులపై ఆ కంపెనీ శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండు చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ధర్నాకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఏపీకి అన్యాయం చేశారు : సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

విశాలాంధ్ర-అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం చేశారు. ఈ విషయ ంపై శుక్రవారం జరిగే కేబినెట్‌లో చర్చిస్తాం. ఆదివారం ఎంపిలతో సమావేశమవుతాం. నాలుగేళ్ళ పరిపాలన తరువాత ఆఖరి బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన కేటాయిం పులపై చర్చిస్తాం. ఆ తర్వాత మా భవిష్యత్తు కార్యాచరణ తెలియ జేస్తామని వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి చెప్పారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీని ఇతర రాష్ట్రాలతో ధీటుగా అభివృద్ధి చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అయితే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రాధ్యానత ఇవ్వలేదని మండిపడ్డారు. కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దుగ్గరాజుపట్నం పోర్ట్, అమరావతి అభివృద్ధి, రైల్వే జోన్, మెట్రో నిర్మాణం, పోలవరంకు కేటా యింపులు లేవు. ముంబై, బెంగుళూరులకు రైల్వేలో నిధులు ఇచ్చారు, ఏపికి మొండి చేయి చూపారన్నారు.

శాంతి, ఆధ్యాత్మిక కేంద్రంగా అమరావతి

విశాలాంధ్ర-అమరావతి : ప్రపంచంలోనే శాంతి, ఆధ్యాత్మికతకు అమరావతి కేంద్రంగా రూపొందించటమే లక్ష్యమని సీఎం చంద్రబాబు అన్నారు. అధికారుల సమావేశాలు, పార్టీ నేతల సమాలోచనలు, దేశ విదేశీయ వ్యాపార, పారిశ్రామిక సంస్థల అధిపతులు భేటీలతో నిరంతం నిమగ్నమయ్యే సీఎం చంద్రబాబు వాటిన్నటికీ దూరంగా ఆధ్యాత్మికత చింతనతో, భక్తి భావనతో ఆనంద పారవశ్యులైన ఘటన గురువారం రాజధాని ప్రాంతంలో చోటు చేసుకుంది. బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం యూనివర్సల్ పీస్ రీ ట్రీట్ కేంద్రానికి భూమి పూజ సందర్భంగా బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగం ఆధ్యాత్మిక ప్రవచనంలా సాగింది. బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రధాన ప్రతినిధి జానకిదాది రాజధాని ప్రాం తానికి రావటం ఈ ప్రాంతం పునీతమైందని, ఆమె పవిత్ర హృద యంతో సందేశాన్ని ఇచ్చి ఆశీర్వదించటం అదృష్టంగా భావిస్తున్నా మన్నారు. పవిత్రమైన బ్రహ్మ కుమారీస్ కార్యాలయానికి పూనుకో వటం పూర్వజన్మ సుకృతంగా అభివర్ణించారు. ప్రపంచానికి శాంతి, ఆనందాన్ని ఇచ్చే ఏకైక సంస్థ బ్రహ్మకుమారీస్ అని సీఎం కొనియాడారు. ఈ సంస్థ 147 దేశాలు, 9వేల సెంటర్లలో నడుస్తూ లక్షలాది మంది మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. మానవుని మానసిక ఒత్తిడులను దూరంగా ఉంచేందుకు ఈ సంస్థను ప్రారంభించామని, సత్యసాధనే ఈ సంస్థను ముందుకు నడిపిస్తుందన్నారు.

ఎక్సైజ్‌లో పలువురికి ఈఎస్‌లుగా పదోన్నతి

మరో ముగ్గురికి స్థాన చలనం

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌లో పలువురు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్)లకు సూపరింటెండెంట్‌లుగా (ఈఎస్) పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారితోపాటు మరో ముగ్గురు ఈఎస్‌లకు స్థాన చలనం కలిగింద. ఈ మేరకు మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డీ సాంబశివరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు ఈఎస్‌గా ఉన్న వై శ్రీనివాస చౌదరికి తిరిగి అక్కడే పోస్టింగ్ ఇవ్వగా, మెడికల్ లీవులో ఉన్న టాస్క్‌ఫోర్స్ ఈఎస్ ఎన్‌వీ రమణను అనకాపల్లిలోని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. విజయవాడలో ఈఎస్‌గా ఉన్న కె శ్రీనివాస చారిని స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఈఎస్‌గా నియమించారు. ఇక ఏఈఎస్ నుంచి ఈఎస్‌గా పదోన్నతి పొందిన మరో ఏడుగురికి కూడా పోస్టింగ్స్ ఇచ్చారు. ఎం జయ రాజును నిడమానూరు డిపో మేనేజర్‌గా, వై భీమ్‌రెడ్డిని కమిషనరేట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా, ఆర్ నాగేంద్రరావును స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఈఎస్‌గా, జీ మునిస్వామిని కడప ఈఎస్‌గా, కె శ్రీదేవిని గుంటూరు డిపో మేనేజర్‌గా, సీహెచ్ మధుమోహన రావును చిత్తూరుఈఎస్‌గా, కెరాజ్యలక్ష్మిని నరసరావుపేట డిపో మేనేజర్‌గా నియమించారు.


బడ్జెట్‌పై భగ్గుమన్న ఎంపీలు

ఎంపీలను శాంతింపచేసిన కేంద్ర మంత్రి సుజనా చౌదరి



విశాలాంధ్ర బ్యూరో- న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌పై తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. గురువారం ఉదయం 11గంటలకు లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018-19 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ఎంతో సాధించుకుంటామని ప్రకటించుకున్న టీడీపీ ఎంపీలకు కోలుకోలేని దెబ్బ తగిలింది. బడ్జెట్‌కు ముందే ఎంపీల బృందం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి అనేకసార్లు విన్నపాలు చేసింది. ఆఖరికి ముఖ్యమంత్రి కూడా వచ్చి ఢిల్లీలో అభ్యర్థించినా ప్రయోజనం లేకుండా పోయింది. రెవిన్యూ లోటుతో అష్ట కష్టాలు పడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఏ మాత్రం ఊరట నివ్వలేదు. కర్ణాటక రాష్ట్రానికి రూ.18వేల కోట్లతో మెట్రోను ఇచ్చినకేంద్రం అమరావతి మెట్రో అంశాన్ని ప్రస్తావనలోకి కూడా తీసుకోలేదు. కేంద్రం కావాలనే పొమన్న లేక పొగ పెట్టిందని, కేంద్రంపై పోరాటం చేయాలని సీఎం చంద్రబాబుపై ఆపార్టీ నేతలు ఒత్తిడి పెంచారు. ఎంపీలు ఎవరు ఏమన్నారో వారి మాటల్లోనే విందాం......

పొమన్నలేక పొగ పెట్టేశారు : టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ అభ్యర్ధనలను బుట్టదాఖలు టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి అన్నారు. పొమన్నలేకే కేంద్రం పొగ పెట్టిందని, ఇకపై ఎన్‌డీఏలో ఉండటం సరికాదన్నారు. రాష్ట్రానికి ఎంతో అన్యాయం చేశారని, రైల్వే జోన్ ఇస్తామని పార్లమెంటులో హామీ ఇచ్చినా దాన్ని నెరవేర్చ లేదన్నారు. కాళ్ళ చెప్పులు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజీనామాలకు సిద్ధం: ఎంపీ అవంతి శ్రీనివాస్



రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదని టీడీపీ ఎంపీ అవంతి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తమకు ఎంపీ పదవులు ముఖ్యం కాదని, రాజీనామాలు చేయటానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. విశాఖకు రైల్వే జోన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు చేతులేత్తేయటం ఎంతవరకు సబబు అని కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు నిధులు ఏమీ ఇవ్వలేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని ఆవేదన ,బాధ ఆంధ్రప్రదేశ్‌కు ఉందన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవటంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు.

అడిగినవాటికి ఇచ్చినవాటికి పొంతన లేదు : ఎంపీ రామ్మోహన్ నాయుడు



ఆంధ్రప్రదేశ్ అడిగిన వాటికి కేంద్రం ఇచ్చిన వాటికి ఏ మాత్రం పొంతన లేకుండా పోయిందని టీడీపీ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఏపీ విభజన హామీలను అమలు చేయటంలో కేంద్రం విఫలమైందన్నారు. పార్లమెంటులో ఇచ్చినహామీల ప్రస్తావనే బడ్జెట్‌లో లేదన్నారు. సమస్యలను సానుకూలంగా చర్చలతో పరిష్కరించుకుంటామని చెప్పారు. రాజీనామాల అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటామని, రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

బడ్జెట్‌తో నిరాశకు గురయ్యాం : వైకాపా ఎంపీ సుబ్బారెడ్డి



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ చూసి నిరాశకు గురయ్యామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. విభజన చట్టంలో హామీలు అమలు అవుతాయని భావించామని కానీ ఆవిధంగా జరగలేదన్నారు. ప్రత్యేక హోదా లేదని, పరిశ్రమలు కూడా రాలేదని, నిరుద్యోగ భృతీ ఇవ్వలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు మీద క్లారిటీ ఇవ్వకపోగా విశాఖ రైల్వే జోన్ ప్రస్తావన కూడా రాలేదన్నారు. దుగ్గరాజపట్నం 2018 నాటికి పూర్తి చేసి ఇవ్వాల్సి ఉండగా ఆ విషయాన్ని పట్టించు కోలేదన్నారు. రైతుల మద్దతు ధరను 1.5 రెట్లు పెంచుతామన్న హామీ కొంచెం ఊరట కలిగించిందని సుబ్బారెడ్డి వెల్లడించారు.

బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావనే లేదు : వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి




కేంద్ర బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావనే రాలేదని వైసీపీఎంపీ విజయ సాయి రెడ్డి చెప్పారు. ప్రత్యేక హోదా విషయంలో వెనుకడుగు వేసిన కేంద్ర సర్కారు, రైల్వే జోన్ అంశాన్ని కూడా మరిచి పోయిందన్నారు. పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 13లో11కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేస్తామని ప్రకటించాయన్నారు. ఇంత వరకు రెండు సంస్థలను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. నివేదికల ప్రకారం 9 కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఏర్పాటు చేయాలంటే రూ.11,267 కోట్లు నిధులు అవసరమవుతాయని, ఇప్పటి వరకు జరిగిన కేటాయింపులు మాత్రం రూ.421 కోట్లు మాత్రమే కేటాయించారని, దీంతో రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

బడ్జెట్‌లో తీరని అన్యాయం : ఎంపీ రాయపాటి



కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2018-19 సాధారణ బడ్జెట్‌లో ఏపీకి సరిగ్గా కేటాయింపులు జరగలేదని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు రాయపాటి సాంబశివరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లోటు బడ్జెట్‌తో ప్రారంభమైన ఆంధ్ర రాష్ట్రాన్ని ఆదుకొనే ప్రయత్నం కుపించలేదని, దీంతో రాష్ట్ర ప్రజలు తీవ్రమైన నిరాశ చెందారని వాపోయారు. రాష్ట్ర ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూసిన విశాఖకు రైల్వే జోన్, రైల్వే విశ్వవిద్యాలయం కేటాయించకపోవడంపై ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని రాయపాటి ఆవేదన వ్యక్తం చేశారు.

బడ్జెట్ ఆశాజనకంగా లేదు: టీఆర్ఎస్ ఎంపీ కవిత



కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని టీఆర్ఎస్ ఎంపీ కవిత పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే ప్రకటనలు ఏమీ కనిపించలేదన్నారు. పేద ప్రజలకు తగిన న్యాయం చేస్తారని ఆశించామని కానీ ఆ విధంగా జరగలేదన్నారు. ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాలకు కేంద్రం ఏమీ చేయలేదన్నారు. దశల వారీగానైనా ఏమైనా చేస్తారేమోనని తాను ఆశతో ఉన్నామన్నారు. తెలంగాణ సర్కారు భారీ ప్రతిపాదనలు ఇచ్చినప్పటికీ వాటి ఆనవాలు ఎక్కడా కనిపించలేదన్నారు.

ఎన్‌డీఏ బడ్జెట్‌కు ప్రశంస : కాంగ్రెస్ ఎంపీ రాపోలు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ నేతలంతా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్ ప్రసంశలు కురిపించారు. తాను ప్రతి పక్ష పార్టీకి చెందిన ఎంపీ అయినప్పటికీ కూడా కేంద్రం బడ్జెట్ ఆకర్షణీయంగా ఉందన్నారు. ముఖ్యంగా 'ఆయుష్మాన్ భారతి' ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకు నేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. భారతదేశంలో 50 కోట్ల మంది ప్రజలు 5లక్షల మేరకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం ప్రశంసనీయమన్నారు.

మార్చి 31లోగా రాష్ట్రమంతటా ఈ-ఆఫీస్

సీఎస్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర-అమరావతి : మార్చి 31 లోగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను (పేపర్ లెస్ కార్యాలయాలు) ఈ-ఆఫీస్ విధానం కిందకు తీసుకు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ వెల్లడించారు. గురువారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఐటి సలహాదారు జె.సత్యనారాయణతో కలిసి ఇంటిగ్రేషన్ ఆఫ్ (ఇ-నిధి) ఎస్‌ఎపి తో ఈ-ఆఫీస్ మరియు ఆధార్ అనుసంధానిత బయోమెట్రిక్ హాజరు అమలుకు సంబంధించి ప్రిలిమినరీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే మార్చి 31లోగా రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వరకూ గల అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఈ-ఆఫీసులు (పేపర్ లెస్ కార్యాలయాలుగా) తీర్చిదిద్దడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల సత్వర పరిష్కారానికి అవకాశం కలగడమేగాక ప్రభుత్వ ఉద్యోగులకు పనిభారాన్ని తగ్గించేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర సచివాలయంతో పాటు రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యాలయాలు కొన్ని జిల్లాల్లో జిల్లా కార్యాలయాలను ఇ-ఆఫీసు కిందకు తీసుకు రావడమేగాక బయోమెట్రిక్ విధానాన్ని కూడా అమలులోకి తెచ్చామన్నారు. మిగతా అన్ని కార్యాలయాలు పూర్తిగా ఈ-ఆఫీస్ పరిధిలోకి తెచ్చేందుకు మరియు ఆధార్ అనుసంధానిత ఎలబుల్డ్ బయోమెట్రిక్ హాజరు విధానం కిందకు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిఎస్ చెప్పారు. అంతేగాక అన్ని శాఖల్లో పనిచేసే ఉద్యోగులను వారికి సంబంధించిన వివరాలను హ్యూమన్ రిసోర్సు మేనేజిమెంట్ సిస్టమ్ కింద ఇంటిగ్రేట్ చేయడం జరుగు తుందని సిఎస్ చెప్పారు. మార్చి 31లోగా ఈ-ఆఫీస్ విధానాన్ని పూర్తిగా అమలులోకి తెచ్చేందుకు వీలుగా అవసరమైన సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్లను ఏర్పాటు చేసుకునేందుకు అన్నిశాఖలు ఒక ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.

నాకు విశ్రాంతి కావాలి

స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పాల్గొనేముందు విశ్రాంతి కావాలని భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ అంటోంది. తన వయసు పెరుగుతోందని దానికి తగినట్లుగానే విశ్రాంతి కావాలని చెప్పింది. ఇటీవలే ఇండోనేషియా ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన సైనా ఈనెల 6 నుంచి 11 వరకు జరిగే ఆసియా జట్టు చాంపియన్‌షిప్ నుంచి తప్పుకునేందుకు అనుమతి ఇవ్వాలని భారత బ్యాడ్మింటన్ సంఘానికి (బాయ్) లేఖ రాసింది. ఒకవేళ ఆసియా చాంపియన్‌షిప్‌లో ఆమె ఆడితే వరుసగా మూడు వారాల పాటు బ్యాడ్మింటన్ ఆడినట్లు అవుతుంది. ఇండోనేషియా ఓపెన్ అయిపోగానే ప్రస్తుతం జరుగుతున్న ఇండియా ఓపెన్‌లో ఆమె బరిలో దిగింది. మార్చిలో జరిగే ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ ప్రాక్టీస్ కోసం సమయం కావాలని ఆమె కోరుతోంది. 'ఇది శిక్షణ కోసం మాత్రమే కాదు. నా శరీరానికి విశ్రాంతి ఇవ్వడం కోసం. వరుసగా టోర్నీలు ఆడడం చాలా కష్టం. బయట నుంచి చూసేవాళ్లకు బాగానే ఉంటుంది. నేను ఏదో ఆడాలని ఆడట్లేదు. టోర్నీలకు పూర్తి స్థాయిలో సన్నద్ధమవ్వాలనే ఆలోచనతో ఉన్నా. నేను ప్రతి టోర్నీలో ఉండాలి, ఆడాలి అని ప్రజలు అనుకుంటారు. కానీ ఓడిపోతే 'సైనా ఓడింది', 'సైనా ఫామ్‌లో లేదు' అని అంటారు. ఆ మాటలు భరించాల్సింది నేనే. కొన్నిసార్లు అలాంటి మాటలు తట్టుకోలేక ఏడ్చేశా. ప్రస్తుత నా పరిస్థితిని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఎందుకంటే నా వయసు ఇప్పుడు 20 కాదు. నన్ను నేను ఫిట్‌గా ఉంచుకోవాలి. సుదీర్ఘకాలం పాటు బ్యాడ్మింటన్ ఆడాలి. మీరు మా క్యాలెండర్ చూశారా? ఎన్ని టోర్నీలు ఉన్నాయో. ఏ టోర్నీ ఆడాలో, ఆ తర్వాత ఏం జరుగుతుందో మాకు తెలీదు" అని సైనా తెలిపింది. మేలో జరిగే ఉబర్ కప్ ఫైనల్స్‌కు అర్హత కోసం ఆసియా చాంపియన్‌షిప్ ఆడాల్సి ఉంటుంది. అయితే భారత్ గెలిచేందుకు మెరుగైన అవకాశాల కోసం బాయ్ ఆసియా చాంపియన్‌షిప్‌లో సైనా ఆడాలని కోరుకుంటోంది. "నాకు సమయం కావాలని మీరు అర్థం చేసుకోండి. నేను దేశం కోసం ఆడనని అనట్లేదు. గతంలో ఉబెర్ కప్ మ్యాచ్‌లు చాలా ఆడాను. అన్ని మ్యాచ్‌లు గెలిచా. పెద్ద టోర్నీల్లో విజయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా. కామన్‌వెల్త్, ఆసియా క్రీడలపైనే ప్రస్తుతం నా గురి" అని సైనా చెప్పింది.



జాతీయ స్కేటింగ్‌లో ఫల్గుణికి రజతం

హైదరాబాద్: హైదరాబాద్ అమ్మాయి కైరవి ఫల్గుణి టక్కర్ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్‌లో పతకంతో మెరిసింది. రెండ్రోజుల క్రితం చెన్నైలో మొదలైన ఈ టోర్నమెంట్లో ఫల్గుణి ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ సోలో డ్యాన్స్ కేటగిరిలో రెండోస్థానంలో నిలిచి రజత పతకాన్ని అందుకుంది.

బీసీసీఐ సీఈవోతో టీసీఏ ప్రతినిధుల భేటీ

సభ్యత్వ ప్రక్రియపై చర్చ



హైదరాబాద్: తెలంగాణ క్రికెట్ సంఘానికి (టీసీఏ) సభ్యత్వం ఇచ్చే విషయంలో బీసీసీఐ సానుకూలంగా స్పందిస్తున్నదని టీసీఏ కార్యదర్శి గురువా రెడ్డి తెలిపారు. ఈ విషయంపై చర్చించేందుకు బోర్డు సీఈవో రాహుల్ జోహ్రీతో సమావేశం అయినట్టు చెప్పారు. జోహ్రీ ఆహ్వానం మేరకు ముంబైలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో ఆయనతో భేటీ అయినట్టు చెప్పారు. ఈ సమావేశంలో సభ్యత్వ ప్రక్రియను మొదలుపెట్టే విషయంపై చర్చించినట్టు తెలిపారు. 'మా దరఖాస్తు పరిశీలనలో ఉన్నదని జోహ్రీ చెప్పారు. ఈ విషయంపై బోర్డు పాలక మండలి (సీవోఏ)తో చర్చిస్తానని, త్వరలో జరిగే అడ్మినిస్ట్రేటర్ల సమావేశం అజెండాలోనూ ఉండేలా చూస్తానని హామీ ఇచ్చార'ని తెలిపారు. తెలంగాణ క్రికెట్‌లో ముఖ్యంగా హెచ్‌సీఏలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బీసీసీఐ పరిశీలిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో టీసీఏకు అనుబంధ లేదా శాశ్వత సభ్యత్వం ఇచ్చే అంశాన్ని రాబోయే సమావేశాల్లో బీసీసీఐ తేల్చనుందని చెప్పారు. మూడేళ్ల నుంచి తెలంగాణ జిల్లాల క్రికెటర్ల కోసం టీసీఏ చేస్తున్న కృషిని బోర్డు గుర్తించిందన్నారు. జిల్లాల క్రికెటర్లకు సమాన అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని బీసీసీఐ భావిస్తున్నదని చెప్పారు. అలాగే, హెచ్‌సీఏలో నెలకొన్న గందరగోళ పరిస్థితులతో క్రికెట్‌కు నష్టం కలిగిందని సీఈవో కూడా అంగీకరిం చారని గురువారెడ్డి చెప్పారు. తమ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన బీసీసీఐకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో గురువారెడ్డితో పాటు టీసీఏ సభ్యులు అంబర్ అబ్బాస్, జైపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్ ప్లేయర్లు రెడీ.. ఒక్కటే మిగిలింది : కోహ్లి



హైదరాబాద్: కోహ్లి నేతృత్వంలోని టీమిండియా ప్రస్తుతం దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-2తో చేజార్చుకున్న కోహ్లిసేన ప్రస్తుతం ఆరు వన్డేల సిరీస్‌కు సిద్ధమైంది. తొలి వన్డే నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరిగే ఐసీసీ వన్డే వరల్డ్ కప్‌కు కోర్ ప్లేయర్లను ఇప్పటికే గుర్తించామని, ఒకే ఒక్క స్థానం మాత్రమే మిగిలి ఉందని చెప్పాడు. సఫారీ గడ్డపై జరగనున్న ఆరు వన్డేల సిరీస్‌తో వరల్డ్ కప్‌కు భారత్ సన్నాహాలు ప్రారంభించిందని తెలిపాడు. 'వరల్డ్ కప్‌కు కోర్ ప్లేయర్లను గుర్తించాం. అయితే ఒక స్థానాన్ని మాత్రం ఎవరు భర్తీ చేస్తారో తెలియాల్సి ఉంది. ఈ విషయంపై జట్టు మేనేజ్‌మెంట్ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుంది. కోర్ ప్లేయర్లు మాత్రం ఇప్పటికే సత్తా చాటుతున్నారు. ఏ స్టేజిలోనైనా మార్పులు జరగొచ్చు' అని కోహ్లి తెలిపాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానం కోసం ఓ మంచి ఆటగాడి కోసం ఎదురు చూస్తున్నట్లు కోహ్లి చెప్పాడు. 'మిడిల్ ఆర్డర్(క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది). లోయర్ మిడిల్ ఆర్డర్‌ను ఇప్పటికే క్రమబద్ధీకరించాం. లోయర్ ఆర్డర్ బ్యాటింగ్ ఆర్డర్‌లో పాండ్యా, జాదవ్, ధోనిలతో ఇప్పటికే పరీక్షించాం' అని కోహ్లి తెలిపాడు. 'గత కొన్ని గేమ్‌ల నుంచి నెంబర్.4 స్థానంలో అనేక ప్రయోగాలు చేశాం. జట్టులో ఈ ఒక్క స్థానాన్ని పటిష్ఠం చేయాల్సి ఉంది. మిగతా జట్టంతా సమతూకంగా ఉంది' అని చెప్పుకొచ్చాడు. వన్డే జట్టులో కేఎల్ రాహుల్ తిరిగి చోటు దక్కించుకుంటాడా? అన్న ప్రశ్నకు గాను కోహ్లి తనదైన శైలిలో స్పందించాడు. 'ఏదైనా సాధ్యమే. కేఎల్ రాహుల్ క్వాలిటీ ప్లేయర్. వన్డే క్రికెట్ ఆడి చాలా రోజులైంది. టెస్టు క్రికెట్ లేదా టీ20 క్రికెట్‌లో రాణించినట్లుగా వన్డేల్లో అతడు అద్భుత ప్రదర్శన చేయలేకపోతున్నాడు. అయితే రాబోయే రోజుల్లో ఏదైనా జరగొచ్చు' అని విరాట్ కోహ్లి అన్నాడు.





మణికట్టు మాయ

- బంతితో రాణించిన చాహల్, కుల్దీప్
- భారత్ లక్ష్యం 270
- ప్రస్తుతం 46/1
- సెంచరీ చేసిన డుప్లెసిస్

దర్బన్: భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో దక్షిణాఫ్రికా పోరాడగలిగే స్కోర్ సాధించింది. ఒకానొక దశలో 134/5తో కష్టాల్లో పడ్డ ఆ జట్టును సారథి డుప్లెసిస్ (120, 112 బంతుల్లో 11×4, 2×6) ఆదుకున్నాడు. ఇన్నింగ్స్ భారాన్ని తన భుజస్కంధాలపై మోశాడు. అద్భుత శతకం సాధించి కోహ్లిసేన ముందు 270 పరుగుల లక్ష్యం నిలిపాడు. మ్యాచ్‌లో మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (3/34), యజ్వేంద్ర చాహల్ (2/45) చెలరేగారు. దక్షిణాఫ్రికా టాప్, మిడిలార్డర్‌ను కుదేలు చేశారు. పరుగుల వేగాన్ని నియంత్రించారు. కింగ్స్‌మీడ్ పిచ్‌పై సగటు స్కోరు 290 పరుగులు కాగా పటిష్ఠమైన బౌలింగ్ ఉన్న సఫారీ జట్టుపై టీమిండియా ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం!

అటు.. ఇటు

టాస్ గెలిచి బ్యాటింగ్ ఆరంభించిన దక్షిణాఫ్రికా నిలకడగా ఆడింది. ఓపెనర్ హషీమ్ ఆమ్లా (16, 17 బంతుల్లో 1×4)ను జట్టు స్కోరు 30 వద్ద బుమ్రా ఔట్ చేశాడు. అయితే మరో ఓపెనర్ డికాక్ (34, 49 బంతుల్లో 4×4) డుప్లెసిస్ (120)తో కలిసి స్కోరు వేగం పెంచాడు. రెండో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యం అందించాడు. నిలకడగా ఆడుతున్న అతడిని జట్టు స్కోరు 83 వద్ద చాహల్ ఎల్బీగా పెవిలియన్ పంపించాడు. అయితే రీప్లేలో అది నాటౌట్‌గా తేలింది. ఈ క్రమంలో వరుసగా మార్క్రమ్ (9), డుమిని (12), డేవిడ్ మిల్లర్ (7)ను మణికట్టు ద్వయం కుల్‌దీప్, చాహల్ వరుసగా ఔట్ చేయడంతో ఆ జట్టు కష్టాల్లో పడింది. ఈలోపు డుప్లెసిస్ అర్ధశతకం సాధించాడు.

విలువైన భాగస్వామ్యాలు

జట్టు తక్కువ పరుగులకే విలువైన వికెట్లు కోల్పోయినా దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ వెనక్కి తగ్గలేదు. అతడికి ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్ (27, 43 బంతుల్లో 4×4, 1×6), అండిలే ఫెహ్లుక్‌వాయో (27 నాటౌట్, 33 బంతుల్లో 1×4, 1×6) అండగా నిలిచారు. ముఖ్యంగా మోరిస్ చక్కగా షాట్లు ఆడాడు. డుప్లెసిస్‌తో కలిసి స్పిన్నర్ల బౌలింగ్‌లో నిలకడగా ఆడాడు. 35 ఓవర్ల తర్వాత పేసర్లు రంగంలోకి దిగగానే భీకరమైన షాట్లు ఆడాడు. మరోవైపు డుప్లెసిస్ వేగం పెంచాడు. వీరిద్దరూ 6వ వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి స్కోరును 200 దాటించారు. ఈ క్రమంలో భారీ షాట్ ఆడబో యిన మోరిస్‌ను కుల్దీప్ ఔట్ చేశాడు. అప్పుడు జట్టు స్కోరు 208. మోరిస్ పెవిలియన్ చేరినా ఫెహ్లుక్‌వాయోతో కలిసి డుప్లెసిస్ నిలకడగా ఆడాడు. శతకం సాధించాడు. ఆ తర్వాత చెలరేగి ఆడి వరుసగా బౌండరీలు, సిక్సర్లు బాదేశాడు. దీంతో స్కోరు 250 దాటేసింది. అయితే ధారాళంగా పరుగులి చ్చిన భువినే జట్టు స్కోరు 264 వద్ద డుప్లెసిస్‌ను ఔట్ చేశాడు. ఆ తర్వాత ఫెహ్లుక్‌వాయో రాణించడంతో దక్షిణాఫ్రికా 269 పరు గులు చేసింది. భువి 10 ఓవర్లు వేసి 71 పరుగులు ఇచ్చాడు.

ఆచితూచి

అనంతరం భారత్ ఆచితూచి బ్యాటింగ్ ప్రారంభించింది. ఇన్నింగ్స్‌ను రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ప్రారంభించారు. మంచి ఊపుమీదున్న రోహిత్ శర్మ(20)ను మోర్కెల్ పెవిలియన్‌కు పంపాడు. అప్పటికి టీమిండియా స్కోరు 33. అనంతరం సారథి విరాట్ కోహ్లి బ్యాటింగ్ దిగాడు. మరో ఓపెనర్ శిఖర్ ధావన్ ధాటిగా ఆడుతున్నాడు.

ఏపీ, తెలంగాణలకు కేంద్రం పంగనామాలు

- కేంద్రంపై టీడీపీ పోరాటానికి సహకరిస్తాం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు కేంద్రం పంగనామాలు పెట్టిందని విమర్శలు గుప్పించారు. కేంద్రంపై టీడీపీ పోరాటానికి పిలుపునిస్తే తాము కూడా సహకరిస్తామని నారాయణ పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలో కేంద్ర బడ్జెట్‌పై నారాయణ మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్ ప్రజానీకానికి ఏ మాత్రం ఉపయోగపడేది కాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అన్నారు అది కనపడలేదని, విశాఖపట్నానికి రైల్వే జోన్ వస్తుందని చెప్పారు కానీ అది కూడా కనపడలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పంగనామాలు, తెలంగాణకు మూడు నామాలు పెట్టారని నారాయణ కేంద్రాన్ని ఎద్దేవా చేశారు. దేశంలో నిరుద్యోగులకు, పేదలకు కూడా ప్రయోజనకరమైన బడ్జెట్ కాదని చెప్పారు. బడ్జెట్ కార్పొరేట్‌లకు అనుకూలంగాను, పేద ప్రజల వ్యతిరేక బడ్జెట్‌గా ఉందని విమర్శించారు. ఆరోగ్య బీమా ఒక్కటే ప్రజలకు మంచిగా ఉందన్నారు. అయితే ఇందులో కూడా మతలబు ఉందని, కార్పొరేట్ ఆస్పత్రులకు మేలు చేకూర్చే విధంగా ఉందని చెప్పారు. బీజేపీ ఎంపీ హరిబాబు చేస్తున్న వ్యాఖ్యలపై నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరిబాబు నియోజక వర్గంలోనే ప్రధాన మంత్రి మోడీ ప్రత్యేక హోదా హామీని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు అది అమలు కాలేదు. హరిబాబు ఎవరిని మోసం చేయాలని చూస్తున్నారు.. ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు హరిబాబు మాటలు విశ్వసించరని నారాయణ పేర్కొన్నారు.

చేనేతకు అన్యాయం



విజయవాడ: బడ్జెట్ కేటాయిం పులో చేనేత రంగానికి తీవ్ర అన్యాయం జరిగిం దని టీడీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత విమ ర్శించారు. కుంటుపడు తున్న ఈ రంగానికి చేయూతను ఇవాల్సిన కేంద్రం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపించిందని పేర్కొన్నారు. నిధులు అరకొర కేటాయించి సగటు చేనేత కార్మికుడి నడ్డి విరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత రంగంపై జీఎస్టీ విధించి నష్టాలపాలు చేసిన కేంద్రం ఇప్పుడు బడ్జెట్లో నిధులు కేటాయింపులు జరపకుండా చేనేత రంగాన్ని దివాళా తీసేలా చేశారని సునీత ఆరోపించారు. దేశ వారసత్వ సంపదైన చేనేతకు ఈ బడ్జెట్‌లో న్యాయం జరుగుతుందని చేనేత కార్మికులు ఆశ పడ్డారనీ, కానీ కేంద్రం వారిపై నీళ్లు చల్లిందని పేర్కొన్నారు. చేనేత సమస్యల సత్వర పరిష్కారానికి త్వరలో జరుగు 'హోట్ ఆన్ అకౌంట్'లో కేంద్రం చేనేతకు సరిపడ నిధులను కేటాయించి, తన చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు.

తెలుగు రాష్ట్రాల కన్నెర్ర

- బడ్జెట్‌లో దక్కని ప్రాధాన్యత
- అరకొరగా కేటాయింపులు
- నాయకుల్లో నైరాశ్యం

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ: సాధారణ బడ్జెట్‌తో పాటు రైల్వేబడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు పెద్దగా ప్రాధాన్యత లభించలేదు. పాత ప్రాజెక్టులే అసంపూర్ణంగా ఉండగా, కొత్త ప్రాజెక్టులూ దక్కకపోవడంతో రెండు రాష్ట్రాలూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రైల్వే బడ్జెట్‌లో అత్తెసరు కేటాయింపులు, ప్రాజెక్టులలో అరకొర నిధులతో కేంద్రం నిరాశ పరిచింది. విశాఖ రైల్వేజోన్‌పై కూడా ఎలాంటి ప్రకటన చేయకపోవడం కూడా నాయకుల్లో నైరాశ్యానికి కారణమైంది.

కొత్తలైన్లు, పాత ప్రాజెక్టులకు కేటాయింపులు...

కోటిపల్లి-నర్సాపూర్ కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టుకు రూ.430 కోట్లు, విజయనగరం-స్తంభాలపూర్ మూడో రైల్వేలైన్‌కు రూ.90 కోట్లు, నడికుడి-కాళహస్తి కొత్త రైల్వే లైన్‌కు రూ.340 కోట్లు, కాజీపేట-విజయవాడ మూడో రైల్వేలైన్‌కు రూ.100 కోట్లు, నల్లపాడు-గుంతకల్ లైను విద్యుదీకరణకు రూ.150 కోట్లు, విజయవాడ-గుడివాడ, మచిలీపట్నం-భీమవరం, నర్సాపూర్-నిడదవోలు రైల్వేలైన్ల డబ్లింగ్ పనులకు రూ. 122 కోట్లు, విజయనగరం-రాయగడ-రాయపూర్ విద్యుదీకరణకు రూ.120 కోట్లు, విజయవాడ-గూడురు మూడోలైన్‌కు రూ.100 కోట్లు, ఓబులవారి పల్లె-కృష్ణపట్నం కొత్త రైల్వేలైన్‌కు రూ.100 కోట్లు, గుంతకల్-బళ్లారి హోస్పేట్ విద్యుదీకరణకు రూ.70 కోట్లు, కడప-బెంగళూరు రైల్వేలైన్ ప్రాజెక్టుకు రూ.240 కోట్లు, కాకినాడ-పిఠాపురం కొత్త రైల్వేలైన్‌కు రూ.150 కోట్లు, మునీరాబాద్-మహబూబ్‌నగర్ కొత్త రైల్వేలైన్‌కు రూ.300 కోట్లు, మనోహరాబాద్ (మేడ్చల్)-కొత్తపల్లి (కరీంనగర్) లైన్‌కు రూ.350 కోట్లు, అక్కన్నపేట-మెదక్ మధ్య 17 కిలోమీటర్ల రైల్వేలైన్‌కు రూ.196 కోట్లు, భద్రాచలం నుంచి సత్తుపల్లి కొత్త రైల్వేలైన్‌కు రూ.300కోట్లు, కాజీపేట-బళ్లారీ మూడోలైన్‌కు రూ.160 కోట్లు, సికింద్రాబాద్ నుంచి మహబూబ్‌నగర్ డబ్లింగ్ పనులకు రూ.50 కోట్లు, హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండోఫేజ్‌కు రూ.100 కోట్లు, చర్లపల్లి స్టేషన్‌లో శాటిలైట్ టర్మినల్‌కు రూ. 5 కోట్లు

తెలంగాణలో నిర్మించనున్న ఏ1 స్టేషన్లు

కాజీపేట, మంచిర్యాల, ఖమ్మం, వరంగల్

ఆదర్శ స్టేషన్లు

రఘునాథపల్లి, బాసర, గద్వాల, కేసముద్రం, శంకర్‌పల్లి

కొత్తగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్న స్టేషన్లు

వనపర్తి, డోర్నకల్, లింగంపల్లి, కాజీపేట, ఆదిలాబాద్, నిజామాబాద్

ఏపీలోని ఆదర్శ రైల్వేస్టేషన్లు..

ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శ రైల్వేస్టేషన్లలో భాగంగా వినుకొండ, గుంటూరు, మంత్రాలయం రోడ్, మచిలీపట్నం, మర్కాపూర్ రోడ్, రాజమండ్రి, ఒంగోలు, దొనకొండ, ఆదోని, విశాఖ, దువ్వాడ, బొబ్బిలి, పార్వతీపురం, కడప, తిరుపతి, విజయవాడ, విశాఖ రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనున్నారు. అలాగే రేణిగుంట, ధర్మవరం, రాజమండ్రి, తుని, బేతంచర్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. రాయనపాడు, గుంతకల్, పలాస, మర్కాపూర్, పాకాల, కాణీపాకం, నక్కనదొడ్డి, పుల్లంపేట, ఇచ్ఛాపురం, సాలూరు, కొత్తవలస, లక్కవరపు కోట, ఎస్ కోట, శివలింగాపురం, బొద్దవర, బొర్రా గుహలు, అరకు, సిమిలిగూడ రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫారాలను విస్తరించనున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.